ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 12-05- 2026 | సంపుటి: 17, సంచిక: 39, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



# కేంద్రంతో కలిసి నడుస్తాం

## ప్రధాని పిలుపులో రాజకీయాలకు తావులేదు: సీఎం రేవంత్ రెడ్డి

### తెలంగాణ హక్కుల కోసం కేంద్రంతో పోరాడుతాం
### ప్రధాని మోదీతో అభివృద్ధి అంశాలపైనే చర్చ..
### మోదీ పర్యటనపై సీఎం రేవంత్ రెడ్డి చిట్ చాట్
### ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోంది
### బండి భగీరథ్ కేసు దర్యాప్తులో వేగం పెంచాం..

హైదరాబాద్, మే 11 (ప్రజాకలం) : రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని వ్యాఖ్యానించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు.

**ప్రధాని మోదీతో అభివృద్ధి అంశాలపైనే చర్చ..**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్ఐసీసీలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను ప్రస్తావించిన అభివృద్ధి అంశాలను ప్రధాని మోదీ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని... కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగుతున్నామని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోదీ సమావేశం కావడం ప్రైవేట్ కార్యక్రమమని చెప్పుకొచ్చారు.

**కేంద్రం నిధులు ఇవ్వాలి..**

రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో, సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్ వంటి కొన్ని ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.

తరువాయి 2వ పేజీలో...



### మే నెలాఖరు వరకు 3.00 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా

# బఫర్ స్టాక్ ఉంచుకోవాలి

## ఎరువుల కంపెనీల ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష

- రామగుండం ఎరువుల కర్మాగారం నుండి రాష్ట్రానికి కనీసం 90 శాతం సరఫరా చేయాలి
- రైతులకు నానో యూరియాపై కంపెనీలు కూడా అవగాహన కల్పించాలి
- ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు ఎరువుల అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు
- సేంద్రియ వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సహకాలు అందించాలి.
- రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్ మార్గదర్శకంగా కేంద్రం సరికొత్త యాప్
- మే 21 నుంచి దేశంలోని అన్ని రాష్ట్రాలలో రెండు జిల్లాల చొప్పున ప్రయోగాత్మకంగా అమలు

హైదరాబాద్, మే 11 (ప్రజాకలం) : రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరా, నిల్వలు మరియు నానో యూరియా వినియోగంపై వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత ఉ జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సచివాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్‌తో పాటు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ మరియు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ 2026 సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 11.50 లక్షల మెట్రిక్ టన్నుల

తరువాయి 2వ పేజీలో...

## బండి సాయి భగీరథ్ కేసులో సిట్ వేయడమంటే

# కేసును నీరుగార్చడమే..


### రేవంత్ రెడ్డి లీకుల మాస్టర్ : హరీష్ రావు



హైదరాబాద్, మే 11 (ప్రజాకలం) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు బండి సాయి భగీరథ్ ఓ బాలికపై లైంగికదాడి యత్నం చేసిన వ్యవహారంలో.. బండి సాయి భగీరథ్‌పై హైదరాబాద్ నగరంలోని పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్)కేసు నమోదు కాగా.. విచారణకు ప్రభుత్వం సిట్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వత తీరుపై మాజీ మంత్రి హరీష్ రావు తనదైన శైలిలో స్పందించారు. ఈ విషయమై హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. బండి సాయి భగీరథ్ విషయంలో విచారణకు సిట్ వేయడమంటెనే కేసును నీరుగార్చడం. సీదా కంప్లైయింట్ ఉంది కదా. ఇందులో సిట్ ఎందుకు..? అసలు కంప్లైయింట్ వచ్చినాలుగు రోజులైనా ఇప్పటిదాకా ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. మా బీఆర్ఎస్ నాయకులు మన్నె క్రిశాంక్‌తో, నల్ల బాలు రీట్వీట్స్ చేస్తే రాత్రి ఒంటిగంటకు వచ్చి తీసుకుపోతరా.. వాళ్లేమీ రేప్ చేయలే.. మర్డర్ చేయలే.. ఎక్స్‌లో రీట్వీట్ చేసిన్రు అంతే. దానికి ఒంటిగంట రాత్రి ఇంటికెళ్లి బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్ట్ చేసి కేసుల మీద కేసులు పెట్టిన్రు. పీటీ వారెంట్లు వేసి బెయిల్ రాకుండా లోపలేసిన రేవంత్ రెడ్డి నాలుగు రోజులైనా ఓ రేప్ కేసులో ఫిర్యాదు చేస్తే ఇప్పటిదాకా నువ్వు అరెస్ట్ చేయలేదంటేనే నీ కుమ్మక్కు రాజకీయం బయటపడ్డదన్నారు.

**రేవంత్ రెడ్డి లీకుల మాస్టర్..** ఇంత క్లియర్‌గా ఉన్న కేసులో నువ్వు నాలుగు రోజులైనా నువ్వు చర్యలు తీసుకోలే.. ఇప్పుడు సిట్ అంటున్నవ్.. ఇప్పటికీ రేవంత్ రెడ్డి పది సిట్లు వేసిండు. ఏ సిట్టన్నా తేల్చిందా.. ఏ సిట్టు మీదన్నా చర్యలు తీసుకున్నారా..? అని ప్రశ్నించారు.

తరువాయి 2వ పేజీలో...



## సోమ్‌నాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని నెహ్రూ

# వ్యతిరేకించారు

### - ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : నరేంద్ర మోదీ మరోసారి దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై తీవ్ర విమర్శలు చేశారు. స్వాతంత్ర్యానంతరం గుజరాత్ లోని సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారని ఆరోపించారు. బుజ్జగింపు రాజకీయాల కోసం జాతీయ ఆత్మగౌరవాన్ని పక్కనపెట్టే శక్తులు దేశంలో ఇప్పటికీ ఉన్నాయని,

తరువాయి 2వ పేజీలో...

## అన్నాడీఎంకేలో

# అసమ్మతి..

### - పళనిస్వామి నాయకత్వంపై గుర్రుమంటున్న నేతలు




చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే నిరాశాపూరిత ఫలితాలను చవిచూడటంతో ఆ పార్టీ నేతల్లో అసంతృప్తి పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నాయకత్వ మార్పు జరగాలనే డిమాండ్ ఊపందుకుంటోంది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి తన పదవికి రాజీనామా చేయాలని పలువురు నేతలు పట్టుబడుతున్నట్టు పార్టీ అంతర్గత వర్గాల సమాచారం. పళనిస్వామి నాయకత్వంపై మాజీ మంత్రులు సీవీ షణ్ముగం, ఎస్‌పీ వేలుమణి వంటి నేతలు

తరువాయి 2వ పేజీలో...

## పేషెంట్లకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా సనత్‌నగర్

# టిమ్స్‌ను తీర్చిదిద్దాలి

### ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



హైదరాబాద్, మే 11 (ప్రజాకలం) : పేషెంట్లకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా సనత్‌నగర్ టిమ్స్‌ను తీర్చిదిద్దాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌పై మంత్రి సోమవారం రివ్యూ చేశారు. సెక్రటేరియట్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, జాయింట్ సెక్రటరీ అయేషా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రయల్ రన్‌లో భాగంగా అందిస్తున్న వైద్య సేవల వివరాలను, ఎదురవుతున్న ఇబ్బందులు, లోపాలను అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా.. ఓపీ రిజిస్ట్రేషన్, కన్సల్టేషన్ రూమ్‌లు, వెయిటింగ్ ఏరియా, డయాగ్నస్టిక్స్, రేడియాలజీ డిపార్ట్‌మెంట్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. ట్రయల్ రన్‌లో భాగంగా 22 డిపార్ట్‌మెంట్లలో ఓపీ సేవలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ఆపరేషన్ థియేటర్లు శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డిజిటల్ ఎక్స్-రే మిషన్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఇన్‌స్టాలేషన్ పూర్తి అయిందని తెలిపారు. ట్రయల్ రన్‌లో భాగంగా టెస్టులు నిర్వహిస్తున్నామని చెప్పారు. సనత్‌నగర్ టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ కేర్, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌గా తీర్చిదిద్దాలని గతంలోనే అధికారులకు మంత్రి సూచించారు. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల గుండె సంబంధిత ఆపరేషన్లు చేసేలా, అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేలా క్యాథల్యాబ్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ థియేటర్ల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. క్యాథల్యాబ్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయని, ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మెడికల్ సర్వీసెస్‌తో పాటు సానిటేషన్, సెక్యూరిటీ వంటి నాన్ మెడికల్ సర్వీసెస్ విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

# రోడ్ల అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్

### - తెలంగాణ ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్, మే 11 (ప్రజాకలం) : హ్యామ్ ప్రాజెక్ట్ పురోగతిపై తెలంగాణ ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోమవారం సచివాలయంలో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు. హ్యామ్ ప్రాజెక్ట్ టెండర్ ప్రక్రియపై అధికారులను ఆరా తీశారు. దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్ఏఐ, ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న హ్యామ్ మోడల్ వివరాలు మంత్రికి వివరించారు అధికారులు. బిటుమెన్ ధర మెట్రిక్ టన్నుకు రూ.44 వేల నుంచి రూ.89 వేలకు పెరిగిందని తెలిపారు. బిటుమెన్ ధరల్లో దాదాపు వందశాతం పెరుగుదల నమోదైందని అధికారులు వివరించారు. జీఎస్టీ అదనపు భారం, ఇతర మెయింటెనెన్స్, పశ్చిమాసియ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ధరలు పెరగడానికి కూడా ఓ కారణమని అధికారులు పేర్కొన్నారు. గుజరాత్‌లో 66శాతం, మహారాష్ట్రలో 47శాతం ధరలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ధరలు తక్కువగా ఉన్నాయని వెల్లడించారు. రూ.4 నుంచి రూ.5 లక్షల కోట్లతో దేశంలో 374కు పైగా హ్యామ్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. నాణ్యమైన మౌలిక వసతుల అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని చెప్పుకొచ్చారు. మొత్తం 6,092 కిలోమీటర్ల పొడవుతో 34 ప్యాకేజీలుగా హ్యామ్ పనులు కొనసాగుతున్నాయని అన్నారు. హ్యామ్ తుది అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం లేదా బుధవారం కలిసి చర్చిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# కేంద్రంతో కలిసి నడుస్తాం

మొదటి పేజీ తరువాయి...

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్‌లు, డిఫెన్స్ ల్యాండ్స్, మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలకు అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు.

**తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం..**

2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని తాను ప్రధాని మోదీని కోరగా ఆయన అంగీకరించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ప్రధాని చెప్పారని.. తమ మధ్య జరిగిన చర్చ పూర్తిగా అభివృద్ధికి సంబంధించినదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలం..**

బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. ముస్లింలు, క్రిస్టియన్లు, మావోయిస్టులు కూడా ఈ దేశ ప్రజలేనని, అందరికీ సమాన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఖతం చేయడం వాళ్ల విధానమని విమర్శించారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఒప్పించి జనజీవనంలో కలపడం కాంగ్రెస్ విధానమని వ్యాఖ్యానించారు. విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కేంద్రానికి స్పష్టమైన విధానం లేదన్నారు. జెమిని సర్కస్ లా బీజేపీ ఎన్నికల విధానం ఉంటుందని ఎద్దేవా చేశారు. అనుభవరాహిత్యం, అహంకారం వల్లనే దేశాన్నిసంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు.

**ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోంది..**

ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పశ్చిమబెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కేరళంలో 3 సీట్లు, తమిళనాడులో ఒక సీటు మాత్రమే బీజేపీ గెలుచుకుందని ప్రస్తావించారు. ఏ రాష్ట్రంలో గెలవాలంటే అక్కడ ఎస్ఐఆర్‌ను ప్రయోగిస్తున్నారని ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రాలేదని.. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రెండు సీట్లతో ప్రారంభమైందని..అక్కడికే వస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌ను మోదీ విమర్శిస్తే తనను విమర్శించినట్లేనని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఆశించిన మేరకు సహకారం లేదని చెప్పారు. బీజేపీకి ప్రజాస్వామ్యంపైన నమ్మకం లేదని మండిపడ్డారు. తమిళనాడులో అతిపెద్ద పార్టీకి ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ ఆహ్వానించకుండా నిర్లక్ష్యం ఎందుకు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ జపం చేయకుండా బీజేపీ బతకదని విమర్శించారు.

**మావోయిస్టుల లొంగుబాటుకు ప్రత్యేక చర్యలు..**

తెలంగాణలో 818 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారని, దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుల్లెట్ కాదు బ్యాలెట్ అని కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతోందని, చివరకు మావోయిస్టులు కూడా అదే మార్గంలోకి వచ్చారని అన్నారు. మావోయిస్టుల లొంగుబాటుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. గణపతి వంటి నేతలు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే వైద్య సహాయం, ఆర్థిక సాయం కూడా అందిస్తామని తెలిపారు. దేశం కోసం కాంగ్రెస్ ప్రాణాలు ఇచ్చిందని ఉద్ఘాటించారు. రాజీవ్ గాంధీని చంపిన వాళ్లకు కూడా సోనియా గాంధీ క్షమాభిక్ష పెట్టారని ప్రస్తావించారు.

**ప్రధాని మోదీ వ్యాఖ్యలు దురదృష్టకరం..**

ప్రధాని మోదీ మాట్లాడిన కొన్ని మాటలు దురదృష్టకరమని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ముస్లింలు, క్రిస్టియన్లు, ఇతర మతాలు, కులాలు, మావోయిస్టులు దేశ ప్రజలు కారా.. అందరికీ సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వాళ్లను ఖతం చేయడమే వాళ్ల విధానమని మండిపడ్డారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వాళ్లను ఒప్పించి జనజీవనంలో కలపడం తమ విధానమని ఉద్ఘాటించారు. మనుషులను చంపడం పరిష్కారం కాదని.. ముస్లింలు, మావోయిస్టులు కూడా ఈ దేశ భాగస్వాములేనని అన్నారు. దేశంలో ఐక్యత పెంచేలా ప్రధాని మాట్లాడాలని, విడదీసేలా వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని చెప్పారు. ఇది బీజేపీ వివక్ష రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు.

**విదేశాంగ విధానంపై కేంద్రంపై విమర్శలు..**

బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణం చేయొద్దని ప్రజలకు చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. విదేశాంగ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కేంద్రానికి సూచించారు. మోదీ అనుభవరాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు.

**అలా మహిళా రిజర్వేషన్లు అమలు చేయొచ్చు..**

మహిళా రిజర్వేషన్‌ను దేనికి సంబంధం లేకుండా అమలు చేయడానికి అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయొచ్చని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన 543 లోక్‌సభ సీట్లను దామాషా ప్రకారం చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. 50 శాతం పెంపు అనే దానికి కూడా ఎలాంటి ఫార్ములా లేదని చెప్పుకొచ్చారు. సీట్ల పెంపకంపైనే అందరికీ అభ్యంతరాలు ఉన్నాయని అన్నారు. జమిలి ఎన్నికలు 2029లో జరిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు.

**బండి భగీరథ్ కేసు దర్యాప్తులో వేగం పెంచాం..**

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన కేసు విషయంపై కూడా సీఎం స్పందించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మే 8వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదైందని, ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్ల కారణంగా విచారణ ఆలస్యమైందని వివరించారు. ఇప్పుడు దర్యాప్తు వేగవంతం చేశామని, సిట్ ఏర్పాటు చేశామని.. సీనియర్ మహిళా అధికారిని విచారణాధికారిగా నియమించినట్లు చెప్పారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని.. ఎవరినీ ఇప్పటివరకు వదలిపెట్టలేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై విమర్శలు..**

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కూడా సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేశారు. గతంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఫిర్యాదు చేసిన ఆయనే తర్వాత ప్రభాకర్ రావును నీతిమంతుడని చెప్పారని గుర్తుచేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దగ్గర ఆధారాలు ఉంటే పోలీస్ కమిషనర్‌కు ఇవ్వొచ్చని.. మైకుల ముందు స్టేట్‌మెంట్లు ఇవ్వడం వల్ల విచారణ జరగదన్నారు. కేటీఆర్ బామ్మర్ది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ తీసుకుని దొరికినా తాము వదల్లేదని తెలిపారు. ఖాళీగా ఉన్నామని కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోలీసుల డ్యూటీ చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. గడీలు బద్దలు కొడతానని గతంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారని ప్రస్తావించారు.

**రైతులు, ధాన్యం కొనుగోళ్లపై..**

అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయినప్పటికీ తడిసిన ధాన్యాన్ని కూడా తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని చెప్పారు. పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత చర్చలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు వివరణ ఇచ్చే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. యూరియా కేంద్రం ఇవ్వాలని.. రాష్ట్ర ప్రభుత్వం పంచాలని తెలిపారు.

**తుమ్మిడిహట్టి అంశంపై కేంద్రానికి లేఖ..**

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశంపై ఇప్పటికే మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మహారాష్ట్ర సీఎం స్పందించేలా చూడాలని ప్రధాని మోదీకి కూడా లేఖ పంపినట్లు చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రధాని పెద్దరికం వహిస్తే మంచిదని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వారా కూడా చర్చలు జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

### మే నెలాఖరు వరకు 3.00 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా

# బఫర్ స్టాక్ ఉంచుకోవాలి

మొదటి పేజీ తరువాయి...

యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా, కేంద్రం 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందన్నారు. ఆ కేటాయింపుల ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నులు, జూలై మరియు ఆగస్టు నెలల్లో నెలకు 1.50 లక్షల మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్‌లో 1 లక్ష మెట్రిక్ టన్నుల సరఫరా ఉంటుందని కేంద్రం తెలిపిందన్నారు. ఏప్రిల్ నెలలో కేటాయించిన 2 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.53 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే రాష్ట్రానికి చేరాయని, మే నెలలో ఇప్పటివరకు 48,985 మెట్రిక్ టన్నులు అందాయని అధికారులు వివరించారు. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో వరి నాట్లు ప్రారంభమయ్యే అవకాశమున్నందున, మే నెలాఖరు నాటికి కనీసం 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన మిగిలిన యూరియాను అత్యవసరంగా రాష్ట్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోనే ఉన్న రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో కనీసం 90 శాతం తెలంగాణ అవసరాలకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర వనరులను వినియోగించి ఇక్కడే ఉత్పత్తి జరుగుతున్న యూరియా, రాష్ట్ర రైతులకు అవసరమైన సమయంలో అందకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ అంశంపై రామగుండం ఎరువుల కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. గత నెలలో కేటాయింపుల మేరకు సరఫరా చేయని కంపెనీలు, మిగిలిన పరిమాణంతో పాటు ఈ నెల కోటాను కూడా సమయానికి సరఫరా చేయాలని మంత్రి స్పష్టం చేశారు. రేక్ పాయింట్లకు చేరిన యూరియాను జిల్లాలకు తరలించే ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకూడదని, హ్యాండ్లింగ్ మరియు రవాణాలో నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులను హోల్ సేల్ మరియు రిటైల్ లో ఎమ్మార్పి కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర యూరియా యాప్ ను మార్గదర్శకంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎరువులను అందించేందుకు ఒక సరికొత్త యాప్ ను తీసుకువస్తుందని మంత్రి అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలోని రెండు జిల్లాలలో ఈ యాప్ ను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. మన రాష్ట్రంలో రంగారెడ్డి మరియు మేడ్చల్ జిల్లాలలో ఈ యాప్ ను అమలు చేయనున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. నానో యూరియా తయారీ సంస్థలు కూడా అవగాహన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. నానో యూరియా వాడుతున్న రైతుల అనుభవాలను వీడియో రూపంలో చిత్రీకరించి "రైతు నేస్తం" కార్యక్రమంలో ప్రసారం చేయాలని సూచించారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొని, సాధారణ యూరియా అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలు, నానో యూరియా ప్రయోజనాలపై రైతులకు వివరించాలని ఆదేశించారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని మంత్రి కోరారు.

రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. యూరియాను అధికంగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతిని, భవిష్యత్తులో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని, ఆ ఫలితాల ఆధారంగా అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగిస్తే భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్, అగ్రికల్చర్ డ ఫార్మర్స్ వెల్ఫేర్ డిజిటల్ వింగ్ డైరెక్టర్ సరితా లక్ష్మీ, వ్యవసాయశాఖ డైరెక్టర్ డా. గోపి, ఎరువుల కంపెనీల ప్రతినిధులు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సోమ్‌నాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారు

మొదటి పేజీ తరువాయి...

అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నిర్వహించిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్'లో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. '1951లో సోమనాథ్ ఆలయ పునఃప్రతిష్ఠ కేవలం ఒక సాధారణ విషయం కాదు. అది భారతదేశ స్వతంత్ర నాగరిక స్పృహకు ప్రతీక' అన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆలయ పునర్నిర్మాణానికి అంకితభావంతో పనిచేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌ల సేవలను ప్రధాని కొనియాడారు. దేశంలోని 500కు పైగా సంస్థానాలను ఏకంచేసి ఆధునిక భారతాన్ని నిర్మించిన సర్దార్ పటేల్, సోమనాథ్ పునర్నిర్మాణం ద్వారా మన ప్రాచీన వైభవాన్ని తిరిగి పొందుతున్నామన్న సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చారని మోదీ వివరించారు. అయితే ఈ మహత్కార్యానికి నెహ్రూ నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైందని మోదీ ఆరోపించారు. 'ఆలయ పునర్నిర్మాణం కోసం సర్దార్ పటేల్, రాజేంద్ర ప్రసాద్ ఎంతో కృషిచేశారు. కానీ వారికి నెహ్రూజీ నుంచి ఎంత వ్యతిరేకత వచ్చిందో మనందరికీ తెలుసు.

ఈ రోజు నేను ఆ వివరాల్లోకి వెళ్లడం లేదు. కానీ సర్దార్ పటేల్ సంకల్పం ముందు ఏదీ నిలవలేదు. శతాబ్దాల అవమానాన్ని చెరిపేస్తూ సోమనాథ్ ఆలయం పునర్నిర్మితమైంది..' అన్నారు. ఈ చారిత్రక నేపథ్యాన్ని ప్రస్తుత రాజకీయాలతో ముడిపెడుతూ.. జాతీయ ఆత్మగౌరవం కంటే బుజ్జగింపు రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చే శక్తులు ఇప్పటికీ ఉన్నాయన్నారు.

# ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్‌పై వ్యతిరేకత..

### - ఆన్‌లైన్ ప్రపంచంలో అత్యంత ద్వేషించబడుతున్న దేశంగా గుర్తింపు!



హైదరాబాద్ : అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రస్తుతం ఇజ్రాయెల్ ఎదుర్కొంటున్న పరిస్థితులు గతంలో ఎన్నడూ లేనంత తీవ్రంగా మారుతున్నాయి. ముఖ్యంగా గాజా, ఇరాన్ సంక్షోభాల తర్వాత ప్రపంచ దేశాల్లో ఇజ్రాయెల్ పట్ల వ్యతిరేకత గణనీయంగా పెరిగిందని తాజా సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఒకప్పుడు అమెరికా వంటి దేశాల్లో ఇజ్రాయెల్‌కు తిరుగులేని మద్దతు ఉండేది, కానీ ఇప్పుడు అక్కడి యువతలో కనిపిస్తున్న మార్పు నెతన్యాహు ప్రభుత్వాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. అంతర్జాతీయ తాజా సర్వే ప్రకారం.., ప్రపంచంలోని 24 దేశాలలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో 20 దేశాలు ఇజ్రాయెల్ పట్ల ప్రతికూల దృక్పథాన్ని కలిగి ఉన్నాయి. కేవలం కొన్ని ఆఫ్రికన్ దేశాలు (కెన్యా, నైజీరియా) మినహా, ప్రపంచంలోని మెజారిటీ దేశాల్లో ఇజ్రాయెల్, నెతన్యాహు ప్రతిష్ట మసకబారింది. ఇజ్రాయెల్‌ను ద్వేషించడంలో టర్కీ ప్రథమం సర్వే ఫలితాల ప్రకారం వ్యతిరేకత అత్యధికంగా ఉన్న దేశాలు ఇవే. టర్కీలో ఏకంగా 93% మంది ఇజ్రాయెల్ పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేశారు. ముస్లిం దేశాలైన ఇండోనేషియా (80%) వంటి దేశాల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. పాశ్చాత్య దేశాలు జపాన్ (79%), నెదర్లాండ్స్ (78%), స్వీడన్ (75%), మరియు స్పెయిన్ (75%) లలో కూడా మెజారిటీ ప్రజలు ఇజ్రాయెల్‌ను వ్యతిరేకిస్తున్నారు. అమెరికాలో మార్పు ఇజ్రాయెల్‌కు అతిపెద్ద మిత్రదేశమైన అమెరికాలోనే ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. అమెరికాలో 60% మంది ప్రజలు ఇజ్రాయెల్ పట్ల అసంతృప్తితో ఉన్నారు. 50 ఏళ్ల లోపు వయసున్న అమెరికన్లలో ఇజ్రాయెల్ పట్ల ఆదరణ దారుణంగా పడిపోయింది. ప్యూ సర్వే ప్రకారం, గత రెండేళ్లలో ఈ వ్యతిరేకత 11 పాయింట్ల మేర పెరిగింది. ప్రపంచ వ్యవహారాల్లో నెతన్యాహు సరైన నిర్ణయాలు తీసుకుంటారన్న నమ్మకం అమెరికన్లలో కేవలం 40% మందికే ఉంది. సర్వేలో పాల్గొన్న వారు ఇజ్రాయెల్‌పై వ్యతిరేకతకు కొన్ని ముఖ్య కారణాలను పేర్కొన్నారు. గాజాలో జరుగుతున్న దాడులు, అక్కడ ఏర్పడిన ప్రాణనష్టం ప్రపంచ వ్యాప్తంగా సామాన్యులను కలచివేసింది. యుద్ధ భూమిలోని దృశ్యాలు నేరుగా సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి చేరడం వల్ల ఇజ్రాయెల్ యొక్క ఇమేజ్ దెబ్బతింది. ఐక్యరాజ్యసమితి, ఇతర అంతర్జాతీయ సంస్థల హెచ్చరికలను బేఖాతరు చేయడం వ్యతిరేకతకు దారితీసింది. హార్మూజ్ జలసంధి మూసివేయడం వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగి ద్రవ్యోల్బణం దెబ్బతిని పరిస్థితులు అప్పుల వరకు తీసుకెళ్లాయి. ఒకవైపు సైనికపరంగా ఇజ్రాయెల్ బలంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ వేదికపై 'సాఫ్ట్ పవర్' మరియు ప్రజాభిప్రాయాన్ని కోల్పోవడం ఆ దేశ భవిష్యత్తుకు పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా మిత్రదేశాల యువతలో మద్దతు తగ్గడం అనేది నెతన్యాహు ప్రభుత్వానికి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.

### బండి సాయి భగీరథ్ కేసులో సిట్ వేయడమంటే

# కేసును నీరుగార్చడమే..

మొదటి పేజీ తరువాయి...

ఇక్కడ కూడా సిట్ వేయడమంటే ఉద్దేశపూర్వకంగా కుమ్మక్కై కేసును నీరు గార్చడమే. నా డౌటు.. పార్లమెంట్ ఎన్నికలు రాగానే సినిమా యాక్టర్ల టెలిఫోన్ ట్యాపింగ్ అని సిట్ వేసిండు. ఎన్నికలు కాగానే సినిమా యాక్టర్లు ఎవరిది ట్యాప్ కాలేదని ప్రభుత్వమే చెప్పిందన్నారు. మొన్న సర్పంచ్, మున్సిపాలిటీ ఎన్నికల్లో సిట్ లీకులన్నీ వచ్చినయ్. ఎన్నికలు అయిపోయినయ్ బంద్ అయింది. ఇప్పుడు బండి సంజయ్‌ను కాపాడేందుకు రేవంత్ రెడ్డి లీకుల మాస్టర్.. ఇయ్యాళ్ల పొద్దీకో రేపో మళ్లీ లీకులిస్తరు.. ఇండ్ల ఏ1 ఈయనట.. ఏ2 ఈయనట.. అని రేవంత్ రెడ్డి ఎప్పుడు అవసరముంటే దీన్ని వాడుకొని మళ్లీ లీకులు ఇస్తడు. ఎన్నికలు రాగానే లీకులు యాదికొస్తయి. రేవంత్రెడ్డి ప్రభుత్వం డిఫెన్స్ లో పడంగనే లీకులు గుర్తొస్తయి. లేదే ఏదైనా అంశాన్ని పక్కదారి పట్టియ్యాలంటే లీకులు.. ఇదంతా కూడా ఓ డ్రామా కంపెనీ.. అని హరీష్ రావు మండి పడ్డారు.

### అన్నాడీఎంకేలో

# అసమ్మతి..

మొదటి పేజీ తరువాయి...

బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పళనిస్వామి అధ్యక్షతన ఇటీవల జరిగిన పార్టీ సమావేశానికి కూడా ఈ నేతలు గైర్హాజరయ్యారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) చీఫ్ విజయ్‌కు మద్దతుగా పలువురు నేతలు ప్రకటనలు సైతం చేస్తున్నారు. 'పార్టీలో చీలిక చాలా స్పష్టంగా కనిపిస్తోంది. నాయకత్వంలో మార్పు జరగాలని చాలా మంది నేతలు కోరుతున్నారు. పళనిస్వామి లీడర్‌గా కొనసాగితే కొందరు ఎమ్మెల్యేలు టీవీకేకు మద్దతు ప్రకటించే అవకాశాలు ఉన్నాయి' అని అన్నాడీఎంకే మాజీ నేత కేసీ పళనిస్వామి తెలిపారు. పార్టీ ఉన్నత పదవి నుంచి పళనిస్వామి స్వచ్ఛందంగా దిగిపోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో అన్నాడీఎంకే కేవలం 47 సీట్లకే పరిమితమైంది. అయితే పళనిస్వామి నాయకత్వాన్ని ప్రశ్నించడం ఇదే మొదటిసారి కూడా కాదు. ఎన్నికలకు ముందు కూడా పార్టీలో నాయకత్వ మార్పు జరగాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు.

**అసెంబ్లీలోనూ రెండు గ్రూపులు**

అన్నాడీఎంకేలో అసంతృప్తులు మొదలైనట్టు సోమవారంనాడు జరిగిన అసెంబ్లీ సమావేశాల సమయంలో బయటపడిందని కొందరు చెబుతున్నారు. కొత్తగా ఎన్నికైన అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు రెండు గ్రూపులుగా సభలోకి వచ్చారు. ఒక గ్రూపులో పళనిస్వామి, కేపీ మునుస్వామి, టీఎన్ సుందరం వంటి నేతలుండగా, మరో గ్రూపులో వేలుమణి, డాక్టర్ విజయ్ భాస్కర్ వంటి నేతలు ఉన్నారు.

**అవన్నీ వదంతులే..**

కాగా, పార్టీలో అసంతృప్తుల మాట ఉత్తదేనని, అవన్నీ వదంతులేనని అన్నాడీఎంకే ఎమ్మెల్యే ఇ.సుబ్బయ్య తెలిపారు. పార్టీలో అసంతృప్తులు లేవని, అంతా సజావుగానే ఉందని చెప్పారు. అన్నాడీఎంకేను 'చీల్చే' అధికారం ఎవరికీ లేదన్నారు. దీనిపై మీడియా అత్యుత్సాహం చూపించవద్దని కోరారు.

# సరిహద్దు సమస్యకు ముగింపు!

**సువేందు సంచలన నిర్ణయం..**



పశ్చిమబెంగాల్ సీఎంగా బాధ్యతలు తీసుకున్న కొద్దిరోజుల్లోనే ముఖ్యమంత్రి సువేందు అధికారి కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్-బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దులో కంచె నిర్మాణానికి 127 కిలోమీటర్ల మేర భూమి కేటాయించారు. గత పదేళ్లుగా ఈ ప్రాంతంలో కంచె నిర్మాణం విషయమై కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. అయితే బెంగాల్ లోని టీఎంసీ ప్రభుత్వం మాత్రం రకరకాల కారణాలు చూపుతూ భూ కేటాయింపులను నిరాకరిస్తూ వస్తోంది. దీనిపై న్యాయపోరాటం చేస్తున్న సువేందు అధికారి అధికారం చేపట్టిన కొద్ది రోజుల్లోనే సంచలన నిర్ణయం తీసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సరిహద్దు సమస్యకు ముగింపు పలికినట్లైందని అంటున్నారు. సరిహద్దుల్లో ఫెన్సింగ్ నిర్మాణానికి 45 రోజుల్లో భూమి అప్పగించనున్నట్లు ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. భారత్-బంగ్లా సరిహద్దుల్లో దాదాపు 2,217 కిలోమీటర్ల ప్రాంతం పశ్చిమబెంగాల్ కు ఆనుకునే ఉంది. ఇందులో సుమారు 400 కిలోమీటర్ల మేర ప్రస్తుతం కంచె లేదు. దీంతో బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లతోపాటు స్మగ్లింగ్ బెడద ఎక్కువగా ఉంది. దీనిని గమనించిన కేంద్ర ప్రభుత్వం పదేళ్ల క్రితమే అంటే 2016లోనే ఫెన్సింగ్ నిర్మిం చాలని భావించింది. అయితే అంతర్జాతీయ సరిహద్దు పరిధిని 15 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వరకు పెంచడంతో గత ప్రభుత్వం కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకించింది. 50 కిలోమీటర్ల పరిధి మేరకు అంతర్జాతీయ సరిహద్దు చేస్తే ఆ ప్రాంతంపై ఆధిపత్యం కేంద్ర బలగాల చేతుల్లోకి వెళ్లిపోతుందని, స్థానిక పోలీసు వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం భావించిందని చెబుతున్నారు. అయితే కేంద్రం నిర్ణయం అమలు చేయాలని, దేశ రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి తీవ్ర పోరాటం చేశారు. సరిహద్దుల్లో కంచె నిర్మించడం వల్ల చొరబాట్లకు స్మగ్లింగుకు ఫుల్ స్టాప్ పెట్టొచ్చని ఆయన వాదించారు. అంతేకాకుండా సరిహద్దుల్లో చొరబాట్లు, స్మగ్లింగ్‌ను అరికట్టడానికి భూమిని వెంటనే అప్పగించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేశారు.

## నిరుపేద కుటుంబానికి అండగా అమ్మా చారిటబుల్ ట్రస్ట్..





ఇబ్రహీంపట్నం మే 11 (ప్రజా కలం ప్రతినిధి) ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ గ్రామంలో ఓ నిరుపేద కుటుంబానికి చెందిన గుడిసె ఆదివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో గుడిసెలో ఉన్న సామగ్రి మొత్తం దగ్ధమై కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ ఘటనను సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న అమ్మా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పుల్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, పిల్లలకు బట్టలు అందజేశారు. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు రావాలని, ఇందుకు అమ్మా చారిటబుల్ ట్రస్ట్‌ను సంప్రదించాలని పుల్ల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో యామాపూర్ సర్పంచ్ కనక నాగేష్, మాజీ సర్పంచ్ తలారి ఆనంద్, కాస ప్రశాంత్, విగ్నేష్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి

### - మెట్ పల్లి డివిజన్ ప్రజావాణి కార్యక్రమం ఆకస్మికం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

మెట్ పల్లి కోరుట్ల ప్రతినిధి మే 11 (ప్రజాకలం) : మెట్‌పల్లి పట్టణం ఆర్డీవో



కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ప్రజల నుండి అందుతున్న వినతులు, ఫిర్యాదుల స్వీకరణ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉదేశ్యంతో గత వారం నుండి డివిజన స్థాయిలో ప్రజా వాణి కార్యక్రమాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సానుభూతితో విని, శాఖల వారీగా సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు న్యాయం చేకూరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీవో నరసింహ రావు, తహసీల్దార్ నీతా లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహ మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



రుద్రంగి, మే 11, (ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ఎల్లాల లక్పతి రెడ్డి - భూమక్క ల ప్రథమ పుత్రుడు ఎల్లాల రమేశ్ రెడ్డి వివాహం రుద్రంగి మండంలోని మానాల గ్రామం మున్నూరుకాపు ఫంక్షన్ హాల్ లో జరుగగా అట్టి వివాహానికి ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గ ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్ హాజరై నూతన వధువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు. విప్ వెంట వ్యవసాయ మార్కెట్ కమిటి చెర్మెన్ చెలుకల తిరుపతి, రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ,నాయకులు గడ్డం శ్రీనివాస్, తర్రె లింగం తదితరులు ఉన్నారు.

## వెల్లుల్ల గ్రామంలో హెచ్ఎల్ఓ 2026 కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు అధికారులు ఫీల్డ్ సమీక్ష

మెట్ పల్లి రూరల్,మే 11:(ప్రజా కలం):వెల్లుల్ల గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో భారతదేశ జనాభా గణన 2027 మొదటి దశగా ఇళ్ల జాబితా మరియు ఇళ్ల గణన (హెచ్‌ఎల్ఓ 2026) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో



సర్పంచ్ గూడూరు తిరుపతి గారు, కార్యదర్శి నారాయణ్, జి పి ఓ నాగరాణి, ఉపాధ్యాయులు అందరూ ఫీల్డ్ పనుల్లో భాగంగా లైవ్‌గా పాల్గొని క్షేత్ర సమీక్షలు చేశారు.జనాభా గణన 2027 నేపథ్యం భారతదేశ జనాభా గణన 2027 దేశవ్యాప్తంగా రెండు దశల్లో జరుగుతోంది. మొదటి దశ (హెచ్ఎల్ఓ) ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు ఇళ్ల పరిస్థితి, కుటుంబ వివరాలు, వసతి సౌకర్యాలను (33 ప్రశ్నలు) డిజిటల్‌గా సేకరిస్తారు. రెండో దశలో జనాభా వివరాలు తీసుకుంటారు.పాల్గొన్న వారి పాత్రలు సర్పంచ్ గూడూరు తిరుపతి కార్యక్రమానికి నాయకత్వం వహించి, గ్రామస్థుల సహకారాన్ని ప్రోత్సహించారు.కార్యదర్శి నారాయణ్ పంచాయతీ స్థాయి సమన్వయం చేపట్టారు.గణన ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు.ఉపాధ్యాయులు స్థానిక సహకారం అందించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ చొరవ గ్రామంలో జనగణన ప్రక్రియను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తుంది

## బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్ట్ చేయాలి

### - కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 11 (ప్రజా కలం) మైనర్ బాలికకు న్యాయం చేయాలని, బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్ట్ చేసి పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ డిమాండ్ చేశారు. సోమవారం కోరుట్ల పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా ఘటనపై ఎలాంటి స్పందన లేకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. మైనర్ బాలికకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. రక్షకుడే భక్షకుడు అయ్యాడు అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో చట్టం ప్రకారం 24 గంటల్లోనే అరెస్ట్ చేయాల్సి ఉండగా ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. సాధారణ వ్యక్తి అయితే వెంటనే అరెస్ట్ చేసే పోలీసులు, అధికార పార్టీకి చెందిన వారి విషయంలో ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుండి వెంటనే తొలగించాలని, బాలికకు పూర్తి రక్షణ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి గాని, కేంద్ర మంత్రులు గాని ఇప్పటి వరకు స్పందించకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ నాయకులు ఈ ఘటనపై స్పందించి ఆ చిన్నారికి





న్యాయం జరిగేలా ముందుకు రావాలని కోరారు. మహిళల భద్రతపై పెద్ద పెద్ద మాటలు చెప్పే నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. బాలికకు న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు.

## కళాశాలలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక పోస్టర్ ఆవిష్కరణ




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 11 (ప్రజాకలం) విద్యా శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవ వేడుకలలో భాగంగా జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం రోజున ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పోస్టర్ తో పాటు బ్రౌచర్ లను స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ కే.వేంకయ్య నేతృత్వంలో కళాశాల సిబ్బంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం విద్యా వారోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి యోగితా రాణా ఐ ఏ ఎస్, కళాశాల విద్యా కమిషనర్ అల్లంరాజు దేవసేన లతో పాటు సీ సీ ఈ సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ రాజేందర్ సింగ్, ప్రొఫెసర్ బాల భాస్కర్ ల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. విద్యా రంగం అభివృద్ధి కోసం పాటు పడుతున్న వ్యక్తులతో పాటు ప్రముఖులను గుర్తించి, వారి సేవలను సద్వినియోగం చేసుకోవటమే ఈ వారోత్సవాల ఉద్దేశ్యమని ఆయన స్పష్టం చేశారు. కళాశాలలో ఏడు రోజుల పాటు విద్యా వారోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి, విజయవంతం చేయడమే కళాశాల సిబ్బంది ధ్యేయమని కళాశాల ప్రిన్సిపాల్ కే.వేంకయ్య ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తొంటి దేవన్న,కళాశాల అకాడమిక్ కో–ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, 'దోస్త్' కో – ఆర్డినేటర్ ఏ.మనోజ్ కుమార్, లెక్చరర్లు అంజయ్య, శ్రీకాంత్ లతో పాటు బోధనేతర సిబ్బంది లక్ష్మి నారాయణ,బాబు, శ్రీనివాస్,లింగం,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

### తూకం వేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 11 (ప్రజాకలం) మండలంలోని ఆత్మకూర్, ఆత్మ నగర్, వెల్లుల్ల గ్రామంలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో జిల్లాలో అకాల వర్షాలు ఉన్నందున వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు గన్ని సంచులు, టార్ఫలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు



ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాలు ఉన్నందున ఉరుములు మెరుపులతో కూడుకున్న వర్షాలు కురిస్తే రైతులు చెట్ల కింద, కరెంటు పోల్స్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించాలని అన్నారు. ఈ పరిశీలనలో మండల తహసిల్దార్ నీత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పైడిపల్లి గ్రామంలో మొదటి సారి కోతకు వచ్చిన ఆయిల్ ఫామ్ తోట



వెల్గటూర్, మే 11 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండలం పైడిపల్లి గ్రామం లో సోమవారం రోజున ఉద్యాన వన విస్తరణ అధికారి వేముల వంశీ కృష్ణ ఆధ్వర్యం లో వెల్గటూర్ మండలం లో పైడిపల్లి గ్రామం లో జైన అభినవ్, గంగుల నగేష్ మొదటి సారీ ఆయిల్ పామ్ గెలలను కోత కోయటం జరిగిం ది. 2022-23 సంవత్సరం లో నాటిన వివిధ ఆయిల్ పామ్ తోటల లో సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పైడిపల్లి గ్రామం లో 2.20 ఎకరాల ఇరువై గుంటల చేను లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న జైన అభినవ్, గంగుల నగేష్ తోటలను చూడటం జరిగింది. మళ్ళీ ఇరువై రోజు లకి గెలలను కోత కు సిద్ధంగా ఉంటాయని ఇలా నిరంతరం ఆదాయం పొందాలని రైతు నూతన పంటలకి రైతులు సాగుకి ముందుకి రావాలని ప్రభుత్వం సబ్సిడీలు పొందాలని చెప్పటం జరిగింది వివిధ దశలలో ఉన్న ఆయిల్ పామ్ గెలలను పరిశీలించి వాటికి తగు ఎరువుల యాజమాన్యం పద్ధతులను వివరించడం జరిగింది. ఒక్కో ఆయిల్ పామ్ చెట్టుకు దాదాపు 10 నుండి 12 గెలలు వేయడం గమనించటం జరిగింది. ఇప్పటి వరకు ధర్మపురి డివిజన్ లో మొత్తం రైతులు 10 మంది (16.00) టన్నులు దిగుబడి సాధించారు.

టన్ను కి ధర 23,500 రేట్ పలకటం జరిగింది ఉద్యాన వన శాఖ అధికారులు చెప్పిన యాజమాన్య పద్ధతులను పాటించాలని కోరడం జరిగింది.

అదే విధంగా గెలల కోతకు సంబంధించి రైతులు తీసు కోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు ఈ కార్యక్రమం లో లోహియా కంపెనీ, క్లస్టర్ మేనేజర్ మహర్షి, ఫీల్డ్ ఆఫీసర్, అభ్యుదయ రైతులు పాల్గొనటం జరిగింది.

## పేకాట స్థావరంపై దాడి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 11 (ప్రజా కలం)



కోరుట్లలోని జమ్మి గద్దె సమీపంలో కొంతమంది పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు స్థావరం పై పోలీసులు దాడి చేశారు ఏ దాడుల్లో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ 8500 రూపాయల నగదు, ఏడు సెల్ ఫోన్లు, తొమ్మిది మోటార్ సైకిల్ లను స్వాధీనపరుచుకున్నట్లు ఎస్ ఐ చిరంజీవి తెలిపారు. మరొక ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని, పేకాట ఆడుతున్న ఈ పది మంది పైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో ఎస్ఐ చిరంజీవి, కోరుట్ల పిఎస్ సిబ్బంది శివాజీ,ఎల్లయ్య, గంగాధర్, రామకోటి ఉన్నారు.

## మైనార్టీ గురుకులలో డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 11 (ప్రజాకలం) కోరుట్ల మైనారిటీ గురుకులంలో ఐదవ తరగతి నాన్ మైనారిటీ విద్యార్థుల ఎంపిక లక్కీ డ్రా ద్వారా నిర్వహించారు. ఈ లక్కీ డ్రా నందు నాన్ మైనారిటీ విద్యార్థులలో అర్హులైన ఎస్సి, ఎస్టీ, బీసీ, ఓసి




విద్యార్థులకు ఈ అవకాశం కల్పించారు.

2026-27 అసంవత్సరానికి నాన్ మైనారిటీ విద్యార్థుల లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో 20 మంది బీసీ,ఎస్సీ-5, ఎస్టి-3, ఓసి -2 విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ లక్కీ డ్రా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా రీజినల్ లెవెల్ కో ఆర్డినేటర్ శ్రీ రమేష్ లాల్ హాత్కర్ విచ్చేసరూ ప్రిన్సిపాల్ జె. రాములు సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ సమక్షంలో డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు.

ఈ లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయబడ్డ విద్యార్థులు తమ ఏదేని రెండు ఒరిజినల్ ధృవీకరణ పత్రాలను ఈ నెల 20 వరకు సమర్పించాలని తెలిపారు. ఈ మైనారిటీ గురుకులంలో అనేక రకాల సౌకర్యాలు ఉచితంగా విద్యార్థులకు కల్పించడం జరుగుతోందని ప్రిన్సిపాల్ జే రాములు తెలిపారు

## జన గణన సక్సెస్ చేయాలి

### - మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్





మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మే 11 (ప్రజాకలం) జనగణన - 2027 లో భాగంగా ఫేస్ - 1 హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సెస్ ప్రక్రియ ప్రారంభమైనందున




మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో జనగణన న్యూమరేటర్లు, సూపర్వైజర్లు, వార్డ్ ఆఫీసర్స్ బిల్ కలెక్టర్స్, మున్సిపల్ సిబ్బంది తో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నేటి నుండి ప్రారంభమైన జనగణనకి ప్రభుత్వ ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్ లుగా సూపర్వైజర్లుగా నియమించడం జరిగిందని తెలిపారు. ఎన్యుమరేటర్ లు వారికి కేటాయించిన జనగణ చేయు ఇండ్ల వివరాలను స్వీకరిస్తారని వెల్లడించారు. ఎన్యుమరేటర్ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు వారు అడిగిన వివరాలను తెలపాలన్నారు. కార్యక్రమంలో యం ఈ ఓ కనకతార, జనగణన ఎన్యూమరేటర్ లు, సూపర్వైజర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాలీబాల్ సమ్మర్ క్యాంప్ ను సందర్శించిన సీఐ

రుద్రంగి, మే11, (ప్రజాకలం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలో హైస్కూల్ వద్ద స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ తెలంగాణ, జిల్లా వాలీబాల్ అషోషియేషన్ ఆద్వర్యంలో నిర్వర్తిస్తున్న వాలీబాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సీఐ రవీందర్ సందర్శించారు. వేసవి క్రీడా శిక్షణను క్రీడాకారులు, విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకోవాలని, క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. వ్యసనాలకు అలవాటు పడకుండా సమ్మర్ క్యాంప్ లను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. శిక్షణ శిభిరానికి కోచ్ గా వ్యవహరిస్తున్న అక్కినపెల్లి దేవయ్య ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్, సీనియర్ క్రీడాకారులు,కర్ణావత్తుల చందు, అరిపెల్లి రవి, పాల్గొన్నారు.



ప్రజా కలం
మంగళవారం, మే 12, 2026

# లాభాలు పండిస్తున్న యుద్ధం

ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా, ప్రపంచవ్యాప్తంగా సామాన్యులు ఆర్థిక భారంతో సతమతమవుతుంటే, కొన్ని కంపెనీలు భారీ లాభాలు గడిస్తున్నాయి.యుద్ధం సృష్టించిన అనిశ్చితితో పాటు ఇరాన్ 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్'ను మూసివేయడం వల్ల ప్రజల జీవన వ్యయం భారీగా పెరిగింది. దీని ప్రభావం కంపెనీలు, కుటుంబాలు, ప్రభుత్వాల బడ్జెట్‌లపై తీవ్రంగా పడింది.ఇలా ఒకవైపు అనేకమంది ఆర్థికంగా కుదేలై దివాలా అంచున నిలబడితే, మరోవైపు యుద్ధ సమయాల్లో ఎక్కువ లాభాలు పొందే వ్యాపారాలు, అస్థిరమైన ఇంధన ధరల ద్వారా లబ్ధి పొందే మరికొన్ని సంస్థలు మాత్రం రికార్డు స్థాయిలో సంపాదనను కళ్లచూస్తున్నాయి.ఇరాన్ యుద్ధం కారణంగా ఇప్పటిదాకా కనిపించిన అతిపెద్ద ఆర్థిక ప్రభావం ఇంధన ధరల పెరుగుదలే.ప్రపంచంలోని చమురు, సహజ వాయువులలో దాదాపు ఐదో వంతు (20 శాతం) 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' ద్వారా రవాణా అవుతుంది. అయితే, ఫిబ్రవరి చివరి నాటికి ఈ రవాణా దాదాపు పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా ఇంధన మార్కెట్లలో ధరల హెచ్చుతగ్గులు ఒక 'రోలర్ కోస్టర్'లా మారిపోయాయి.ఈ పరిస్థితిని ప్రపంచంలోని కొన్ని అతిపెద్ద చమురు, గ్యాస్ కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకుని భారీగా లాభపడ్డాయి.ప్రధానంగా ఐరోపాకు చెందిన దిగ్గజ చమురు సంస్థలు లబ్ధి పొందాయి.ఈ కంపెనీలకు సొంతంగా ట్రేడింగ్ విభాగాలు ఉండటంతో, మార్కెట్‌లో ధరల్లో వచ్చిన భారీ మార్పులను తమకు అనుకూలంగా మార్చుకుని లాభాలు పెంచుకోగలిగాయి.ముఖ్యంగా బ్రిటిష్ పెట్రోలియం (బీపీ) కంపెనీ లాభాలు ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే రెండింతలు పెరిగి 3.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.30,230 కోట్లు)కు చేరుకున్నాయి. తన ట్రేడింగ్ విభాగం కనబరిచిన 'అసాధారణ' పనితీరు వల్లే ఈ స్థాయిలో లాభాలు వచ్చాయని సదరు కంపెనీ పేర్కొంది.షెల్ కంపెనీ తన మొదటి త్రైమాసిక లాభాలు 6.92 బిలియన్ డాలర్ల (సుమారు రూ.65,379 కోట్లు)కు పెరిగినట్లు నివేదించింది. ఇది విశ్లేషకుల అంచనాలను కూడా మించిపోయింది.మరో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ 'టోటల్ ఎనర్జీస్' చమురు, ఇంధన మార్కెట్లలోని హెచ్చుతగ్గుల కారణంగా 2026 మొదటి త్రైమాసికంలో తన లాభాలను దాదాపు మూడో వంతు పెంచుకుని, 5.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.51,014 కోట్లు)కు చేరుకుంది.మధ్యప్రాచ్యంలో ఇంధన సరఫరాకు ఏర్పడిన ఆటంకాల కారణంగా అమెరికా దిగ్గజ సంస్థలు ఎక్సాన్ మొబిల్, షెవ్రాన్ ఆదాయాలు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే తగ్గాయి.అయితే, ఈ రెండు కంపెనీలు విశ్లేషకుల అంచనాలను మించి రాణించాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి కంటే చమురు ధరలు ఇప్పటికీ గణనీయంగా ఎక్కువగానే ఉండటంతో, ఈ ఏడాది గడిచేకొద్దీ తమ లాభాలు మరింత పెరుగుతాయని అవి భావిస్తున్నాయి.కొన్ని అతిపెద్ద బ్యాంకులు కూడా ఇరాన్ యుద్ధ సమయంలో తమ లాభాలను భారీగా పెంచుకున్నాయి.జేపీ మోర్గాన్ ట్రేడింగ్ విభాగం 2026 మొదటి మూడు నెలల్లో రికార్డు స్థాయిలో 11.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1,09,585 కోట్లు) ఆదాయాన్ని ఆర్జించింది. ఇది ఆ బ్యాంక్ మొత్తం మీద తన చరిత్రలోనే రెండవ అతిపెద్ద త్రైమాసిక లాభాన్ని నమోదు చేయడంలో సహాయపడింది.అలాగే బ్యాంక్ ఆఫ్ అమెరికా, మోర్గాన్ స్టాన్లీ, సిటీ గ్రూప్, గోల్డ్‌మన్ సాక్స్, వెల్స్ ఫార్గో వంటి మిగిలిన 'బిగ్ సిక్స్' బ్యాంకులన్నీ కూడా ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో గణనీయమైన లాభాలను సాధించాయి.మొత్తంగా, ఈ బ్యాంకులు 2026 మొదటి మూడు నెలల్లో 47.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4,50,621 కోట్లు) లాభాలను నివేదించాయి.భారీ స్థాయిలో జరిగిన ట్రేడింగ్ లావాదేవీలు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులకు, ముఖ్యంగా మోర్గాన్ స్టాన్లీ, గోల్డ్‌మన్ సాక్స్ సంస్థలకు బాగా లబ్ధి చేకూర్చాయి" అని వెల్త్ క్లబ్ ప్రధాన ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ సుసానా స్ట్రీటర్ పేర్కొన్నారు.పెట్టుబడిదారులు రిస్క్ ఎక్కువగా ఉండే స్టాక్స్, బాండ్లను వదిలించుకుని, సురక్షితమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టడానికి పోటీ పడటంతో ట్రేడింగ్‌కు పెరిగిన డిమాండ్ వాల్ స్ట్రీట్ రుణదాతలకు బాగా కలిసివచ్చింది.అలాగే, ఆర్థిక మార్కెట్లలో నెలకొన్న అస్థిరతను సొమ్ము చేసుకోవాలని పెట్టుబడిదారులు ప్రయత్నించడం వల్ల కూడా ట్రేడింగ్ లావాదేవీల పరిమాణం గణనీయంగా పెరిగింది."యుద్ధం వల్ల తలెత్తిన అస్థిరత ట్రేడింగ్ ఒక్కసారిగా పెరగడానికి కారణమైంది. పరిస్థితులు మరింత విషమిస్తాయన్న భయంతో కొందరు పెట్టుబడిదారులు తమ స్టాక్స్‌ను విక్రయించగా, మరికొందరు తక్కువ ధరల్లో కొనుగోలు చేశారు. ఇది మార్కెట్ మళ్లీ పుంజుకోవడానికి దోహదపడింది" అని స్ట్రీటర్ విశ్లేషించారు.ఎఫ్-35 ఫైటర్ జెట్ భాగాల సహా వివిధ ఉత్పత్తులను తయారుచేసే బీఏఈ సిస్టమ్స్, ట్రేడింగ్ అప్‌డేట్‌లో ఈ ఏడాది అమ్మకాలు, లాభాల్లో బలమైన వృద్ధిని ఆశిస్తున్నట్లు తెలిపింది.ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న 'రక్షణపరమైన ముప్పులు' ప్రభుత్వ రక్షణ వ్యయాన్ని పెంచుతున్నాయని, ఇది తమ కంపెనీకి 'అనుకూలమైన వాతావరణాన్ని' సృష్టించిందని ఆ సంస్థ పేర్కొంది.ప్రపంచంలోని అతిపెద్ద రక్షణ కాంట్రాక్టర్లలో మూడు సంస్థలైన లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, నార్త్రోప్ గ్రుమ్మన్ 2026 మొదటి త్రైమాసికం చివరి నాటికి తమ వద్ద రికార్డు స్థాయిలో ఆర్డర్లు పేరుకుపోయినట్లు నివేదించాయి.అయితే, గత కొన్నేళ్లుగా విపరీతంగా పెరిగిన రక్షణ రంగ సంస్థల షేర్లు, మార్చి మధ్య కాలం నుంచి తగ్గుముఖం పట్టాయి. ఈ రంగంలోని షేర్ల విలువ వాస్తవ స్థాయి కంటే ఎక్కువగా ఉందనే ఆందోళనల మధ్య ఈ క్షీణత కనిపిస్తోంది.

# జేసీబి యూనియన్ పై వచ్చిన ఆరోపణలను ఖండించిన యూనియన్ సభ్యులు



వెల్గటూర్, మే 11 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం వెల్గటూర్ యూనియన్ పై వచ్చిన తప్పుడు ఆరోపణలను ఖండించిన యూనియన్ సభ్యులు యూనియన్ పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించమని యూనియన్లో చేరమనడం లో తప్పేముందని వెల్గటూర్ మండల జేసీబీ యూని యన్ పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోమని యూని యన్ సభ్యులు హెచ్చరించారు సోమవారం రోజున ఓ పత్రికలో ప్రచురితమైన కథనంపై స్పందించిన యూనియన్ సభ్యులు ఎవరిని బలవంతంగా డబ్బులు కట్టమని ఒత్తిడి చేయలేదని సభ్యులు స్పష్టం చేశారు జేసీబి యూనియన్ సభ్యుల తో కలిసి యూనియన్ పై వచ్చిన తప్పుడు ఆరోపణలను ఖండించారు. తాము ఎవరినీ బలవంతంగా డబ్బులు కట్టమని ఒత్తిడి చేయలేదని స్పష్టం చేశారు. యూనియన్ లో సభ్య త్వం తీసుకోవాలని అడగడం లో తప్పేముందని ప్రశ్నించారు. అప్పులు చేసి జేసీబీలు కొను గోలు చేసి ప్రతి నెల ఫైనాన్స్‌లు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. జేసీబీ యూనియన్‌ను 2024 లో రిజిస్ట్రేషన్ చేశామని ప్రస్తుతం యూనియన్ లో రూపాయలు 5.40 లక్షల నిధులు నిల్వ ఉన్నాయని వెల్లడించారు. సభ్యుల నిర్ణయాల ప్రకారమే కొన్ని నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని చెప్పారు. కొత్తగా జేసీబీలు కొనుగోలు చేసిన వారిని యూనియన్ లో చేరాలని కోరుతున్నామని ఇదే క్రమం లో స్థంభంపెల్లి గ్రామానికి చెందిన పాకల నరేష్‌ను కూడా సభ్యత్వం తీసుకోవాలని అడిగినట్లు వివ రించారు. యూనియన్ నిధుల ప్రకారం సభ్యత్వం 35000/- రూపాయలు చెల్లించాల్సి ఉంటుందనీ, ప్రస్తుతం అయితే 8000 రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందాలనీ కోరామని అందుకు అతను 8000 వేల రూపాయలు కాదు 800 వందల రూపాయలు కూడా కట్ట అని యూనియన్ సభ్యులు మీరు ఎం చేసుకుంటారో చేసుకోండని అతనే కరాకండిగా చెప్పాడని యూనియన్ సభ్యులు వివ రించారు. సభ్యత్వం గురించి మాత్రమే చెప్పామని కానీ ఎప్పుడూ డబ్బులు చెల్లించాలనీ ఒత్తిడి చేయలేదన్నారు. పాకల నరేష్ సభ్యత్వం తీసుకోక ఉల్టా మా యూనియన్ పైనే నిందలు వేస్తూ, ఒక్క రూపాయి కూడా కట్టననీ, ఏం చేసుకుంటారో చేసుకొమ్మనీ యూనియన్ సభ్యులపైనే దురుసు ప్రవర్తన చేసినట్లు యూనియన్ సభ్యులు తెలిపారు. నిబంధనల ఉల్లంఘన అంశం పై మండల తహసీల్దార్‌ను కూడా కలిసి వివరించినట్లు తెలిపారు. పాకల నరేష్ యూని యన్ లో చేరకుండా ఇప్పుడు తానే యూనియన్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని యూనియన్ సభ్యులు ఆరోపించారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి,మే 11:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని,ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.సుల్తానాబాద్ మండలం గట్టుపల్లి గ్రామానికి చెందిన బి.హన్సిక తనకు ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా తహసిల్దార్ కార్యాలయంలో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదని,స్కాలర్షిప్ దరఖాస్తు చేసుకునేందుకు కుల దృవీకరణ పత్రం అత్యవసరం అయినందున తనకు వెంటనే కుల ధృవీకరణ పత్రం మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామపంచాయతీకి చెందిన ఆవుల వసంత తనకు ఇంటి నిర్మాణం కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్న అనుమతి మంజూరు చేయడం లేదని ఇంటిని నిర్మించు కునేందుకు అవసరమైన అనుమతులు మంజూరు అయ్యే విధంగా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా పంచాయతీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.రామగుండం నగరపాలక సంస్థకు చెందిన లింగం వెంకట్ రెడ్డి అయోధ్య నగర్ పరిధిలో ఇంటి యజమాని రేకుల ఇండ్లు నిర్మించుకుని దానికి తగిన పన్ను మాత్రమే చెల్లిస్తున్నారని,6 సంవత్సరాల క్రితం ఆ రేకులను తొలగించి స్లాబ్ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నప్పటికీ పాత రేకుల ఇంటి పన్ను మాత్రమే చెల్లిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నందున దానిని పరిశీలించి కొత్త ఇంటికి పన్ను పెనాల్టీతో సహ వసూలు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో 'పెద్దపల్లి'ని అగ్రగామిగా నిలుపుతా

**- ప్రభుత్వ విప్ విజయరమణారావు - పర్యాటక కేంద్రాలుగా నియోజకవర్గ చెరువులు**

**- విద్యార్థుల కోసం ఓపెన్ జిమ్..రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రం**




పెద్దపల్లి,మే11:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధి,సంక్షేమ రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణారావు స్పష్టం చేశారు.సోమవారం పెద్దపల్లి పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో సుమారు 6 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంఖుస్థాపనలు చేసి,ప్రారంభోత్సవాలు నిర్వహించారు.ముందుగా,చీకురాయి టర్నింగ్ నుండి రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బిటి రోడ్డు పనులను విప్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఆవరణలో విద్యార్థులు,యువత కోసం రూ.10 లక్షలతో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్ పనులను ప్రారంభించారు.పట్టణ సుందరీకరణలో భాగంగా బంధంపల్లి చెరువును రూ.3.14 కోట్లతో మినీ ట్యాంక్ బండ్ గా అభివృద్ధి చేసే పనులకు ఆయన భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా బంధంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ఆయన ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తెచ్చారు.ఈ సందర్భంగా జరిగిన సభలో విజయరమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి రూపురేఖలు మార్చడమే ధ్యేయంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలోని ఎల్లమ్మ చెరువు,సుల్తానాబాద్,బంధంపల్లి చెరువులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.గతంతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, ప్రజా ప్రభుత్వానికి ప్రజలు ఎప్పుడూ అండగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య,మున్సిపల్ కమీషనర్ వెంకటేష్,స్థానిక కౌన్సిలర్లు,సర్పంచులు, వివిధ శాఖల అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# స్వదేశీ విధానంతోనే విపత్తుల నుంచి విముక్తి

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి**



పెద్దపల్లి,మే11:(ప్రజాకాలం జిల్లా ప్రతినిధి) ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాల కారణంగా ఆహారం,ఇంధనం,ఎరువుల ధరలు పెరిగి సామాన్యుడిపై భారం పడుతున్న తరుణంలో, భారతీయులంతా సమన్వయంతో ఒక్కటై ఈ విపత్తును ఎదుర్కోవాలని బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి పిలుపునిచ్చారు.హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు.వికాసిత్ భారత్ లక్ష్యంగా ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించాలని,అధిక ఖర్చులు తగ్గించుకుంటూ పూర్తిగా స్వదేశీ వస్తువులనే వాడాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పాలన అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మారిందని విమర్శించారు.రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.హైదరాబాద్ బహిరంగ సభకు పెద్దపల్లి జిల్లా నుండి సుమారు వెయ్యి మందిని ప్రత్యేక రైలులో తరలించినట్లు పేర్కొన్న ఆయన,ఇందుకు సహకరించిన పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే మే 12న కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో జరిగే హిందూ ఏక్తా యాత్ర కు హిందూ బంధువులందరూ భారీ సంఖ్యలో తరలిరావాలని సంజీవరెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# నాటి ప్రేమ.. నేడు ప్రాణం తీసింది

**- గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్**

**-దళిత యువకుడు వంశీ హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు**




పెద్దపల్లి,మే11:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పాత పరిచయం..పెళ్లయిన తర్వాత కూడా ప్రేమ పేరుతో వేధింపులు..చివరకు ఆ వివాదం ఒక యువకుడి దారుణ హత్యకు దారితీసింది.గత కొద్దిరోజులుగా జిల్లాలో సంచలనం సృష్టించిన దళిత యువకుడు జూల వంశీ హత్య కేసును గోదావరిఖని టూ టౌన్ పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు.ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి,వారి నుండి ఒక టాటా జెస్ట్ కారు,ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ వెల్లడించారు.

సోమవారం టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వెల్లడించిన వివరాల ప్రకారం సింగిరెడ్డిపల్లికి చెందిన జూల వంశీ (29) ఏప్రిల్ 29న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో,మే 1న అతని తల్లి శంకరమ్మ గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కాల్ డేటా అనాలిసిస్ ఆధారంగా దర్యాప్తు చేయగా,అలేఖ్య అనే యువతితో వంశీ చివరిగా మాట్లాడినట్లు గుర్తించారు.ఈ దిశగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారించడంతో ఘోరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.వంశీ,అలేఖ్యలు పాఠశాల దశలో ప్రేమించుకున్నారు. కాలక్రమేణా అలేఖ్య,నీలం నవీన్‌ను వివాహం చేసుకుంది.అయితే 2025 ఫిబ్రవరిలో జరిగిన టెన్త్ క్లాస్ గెట్-టు-గెదర్ కార్యక్రమంలో వీరిద్దరూ మళ్లీ కలుసుకున్నారు.అప్పటి నుండి వంశీ ఆమె నంబర్ తీసుకుని ప్రేమ పేరుతో వేధించడం మొదలుపెట్టాడు.పలుమార్లు ఆమె ఇంటికి వెళ్లి గొడవ పడటంతో,అతడిని వదిలించుకోవాలని అలేఖ్య తన భర్త నవీన్,స్నేహితుడు భాస్కర్‌తో కలిసి పథకం వేసింది.ఏప్రిల్ 30న పథకం ప్రకారం అలేఖ్య,భాస్కర్ కలిసి వంశీని హైదరాబాద్‌కు పిలిపించారు.ముందుగా అలేఖ్య ఫ్లాట్‌కు వెళ్లిన వంశీని,అక్కడి నుండి భాస్కర్ తన కారులో తన సొంత ఫ్లాట్‌కు తీసుకెళ్లాడు.అక్కడ అతడికి మద్యం తాగించి గొడవకు దిగి,ముందే సిద్ధం చేసుకున్న కత్తితో ఛాతి,మెడ భాగాల్లో పొడిచి కిరాతకంగా చంపేశాడు. హత్య అనంతరం భర్త నవీన్‌ను పిలిపించిన అలేఖ్య,అంతా కలిసి రక్తపు మరకలను లైజాల్‌తో శుభ్రం చేశారు.మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్లు,మ్యాట్‌లో చుట్టి టాటా జెస్ట్ కారు డిక్కీలో ఉంచారు.ఆపై భాస్కర్ ఒక్కడే కారులో వెళ్లి మంథని మండలం గాడుదులగండి సమీపంలోని లోయలో మృతదేహాన్ని పడేసి సాక్ష్యాలు తారుమారు చేసే ప్రయత్నం చేశాడు.గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు బృందం ఈ కేసును కేవలం 10 రోజుల్లోనే ఛేదించింది. నిందితుల నుంచి టాటా జెస్ట్ కారు,5 ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.కేసును వేగంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని ఏసీపీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు

# బహుజన కాంట్రాక్టర్ల పొట్ట కొట్టొద్దు

**- జీవో 17తో 10 వేల మంది ఉపాధికి గండి**

**- జీవో 17 రద్దు చేయకపోతే ఆందోళనలు ఉధృతం**

**- బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష**



పెద్దపల్లి,మే11:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 17తో చిన్న తరహా కాంట్రాక్టర్ల పాలిట శాపంగా మారిందని,తక్షణమే దానిని రద్దు చేయాలని బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష నేతృత్వంలో బీసీ,ఎస్సీ,ఎస్టీ,ఎంఎస్ఎంఈ ప్రతినిధులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా గురుకుల పాఠశాలలకు నిత్యావసరాలు సరఫరా చేస్తూ,నెలకు 10 నుండి 20 వేల రూపాయల ఆదాయంతో జీవనం సాగిస్తున్న వేలాది మంది బహుజన కాంట్రాక్టర్ల పొట్ట కొట్టేలా ప్రభుత్వం ఈ కొత్త నిబంధనలు తెచ్చిందని మండిపడ్డారు. ముఖ్యంగా 20 నుండి 50 కోట్ల రూపాయల వార్షిక టర్నోవర్ ఉండాలనే నిబంధనను చేర్చడం వల్ల స్థానిక చిన్న కాంట్రాక్టర్లు టెండర్లకు అనర్హులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా,50 లక్షల నుండి 2 కోట్ల రూపాయల భారీ అడ్వాన్స్‌లు చెల్లించాలని కోరడం కేవలం బడా కార్పొరేట్ కంపెనీలకు మేలు చేయడానికేనని ఆమె విమర్శించారు. జీవో 17వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు10 వేల మంది చిన్న తరహా కాంట్రాక్టర్లు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని,ప్రభుత్వం వెంటనే స్పందించి స్థానిక కాంట్రాక్టర్ల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మొలుమూరి శేఖర్,బీసీ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లబెల్లి శంకర్,బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్,మహిళా కన్వీనర్ సిరవైన స్వప్న,మీడియా ఇన్చార్జి అబ్దుల్ మాలిక్,అరుణ, ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ అలువాల రాజేందర్,బీసీ జేఏసీ నాయకులు బొల్లం భూమేష్,భూమయ్య, శ్రీనివాస్,కన్నం రవి,ప్రసాద్,సంతోష్,శ్రావణ్,రఘు,రమేష్ తోపాటు వివిధ సంఘాల నాయకులు,చిన్న తరహా కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## విద్యార్థినిలను సత్కరించిన మంత్రి కొండా సురేఖ



( వరంగల్/ పర్వతగిరి) మే 11, ప్రజాకలం ప్రతినిధి.


పర్వతగిరి మండలం లోని జమాల్పురం గ్రామం వద్దగల ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల/కళాశాలకు చెందిన విద్యార్థినిలు భూక్య నవ్య పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పర్వతగిరి మండలం లో మొదటి స్థానం లో నిలిచారు ( 569/ 600), జి. త్రిష ఇంటర్ సెకండ్ ఇయర్ లో (986/1000) సాధించారు. వీరిని పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, కుడా చైర్మన్ వెంకట రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద తమ చేతుల మీదుగా సత్కరించినట్లుగా పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ శైలజరాణి తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో వరంగల్ లో జరిగిన యంగ్ అచీవర్స్ సన్మాన కార్యక్రమంలో భాగంగా తమ పాఠశాల కళాశాలకు చెందిన విద్యార్థులను వారు శాలువాతో సత్కరించి సర్టిఫికెట్ అందజేసి అభినందించినట్లుగా తెలిపారు. మంచి ఉత్తీర్ణతతో రాష్ట్రవ్యాప్తంగా తమ పాఠశాలకు మంచి గుర్తింపు అందించిన విద్యార్థులకు తమ పాఠశాల పక్షాన అభినందనలు తెలుపుతున్నట్లు ప్రిన్సిపల్ శైలజారాణి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాధించిన విజయాల పట్ల గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారానికి డిగ్రీ కళాశాల సిద్ధం

**- మే 11 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు -ప్రభుత్వ కళాశాలల,బడుల అభివృద్ధి, విద్యార్థుల ప్రతిభ వికాసమే లక్ష్యం**

మే 11 ప్రజాకలం ప్రతినిది:
(వరంగల్ /వర్ధన్నపేట)

ప్రభుత్వ,కళాశాలలను, పాఠశాలలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మకత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ విద్యాశాఖ ఎడ్యుకేషన్ వీక్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనుంది. మే 11 నుంచి 17 వరకు వారం రోజులపాటు రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. సోమవారం రోజున వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోషయ్య ఆధ్వర్యంలో విద్యా వారోత్సవాలని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ పోషయ్య మాట్లాడుతూ,కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు భాగస్వాములు కానున్నారని,విద్యా ప్రమాణాల పెంపు, పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదల ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పేర్కొందని అన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన మున్సిపల్ పాలకవర్గాన్ని కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది షాలువాతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా వారోత్సవాలలో రోజుకో ప్రత్యేక థీమ్‌తో కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు వివరిస్తూ,



–మే 11 – పాఠశాల భవనాలు, మౌలిక వసతుల దినోత్సవం
మొదటి రోజు కళాశాలల్లో పాఠశాలల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాలు, టాయిలెట్లు, విద్యుత్, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. అదే రోజు సమ్మర్ క్యాంపుల ప్రారంభం కూడా జరగనుంది.

–మే 12 – ఎస్ఎస్సీ రిమీడియల్ క్యాంపులు
పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు, ఫలితాల మెరుగుదల కోసం నిపుణుల బోధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

–మే 13 – ప్రజాప్రతినిధులతో విద్యాభివృద్ధి చర్చలు
గ్రామ, మండల స్థాయిలో ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి కళాశాల,పాఠశాలల అభివృద్ధిపై చర్చలు చేపట్టనున్నారు.

–మే 14 – "జయహో తెలంగాణ బడి బాట" ఒ పీటీఎమ్
తల్లిదండ్రుల సమావేశాలు, విద్యార్థుల ప్రతిభ ప్రదర్శనలు, అలుమ్ని మీట్లు, మాజీ విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాలునిర్వహించనున్నారు.

–మే 15 – లైబ్రరీల అభివృద్ధి దినోత్సవం
"లైబ్రరీస్ – ది హార్ట్ అఫ్ నాలెడ్జి " పేరిట పుస్తక ప్రదర్శనలు, బుక్ టాక్స్, డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

–మే 16 – కళా, క్రీడా ఉత్సవాలు
కళలు, క్రీడలు, యోగా, సాంస్కృతిక పోటీలు, జానపద కళల ప్రదర్శనలతో పాఠశాలలు కళకళలాడనున్నాయి.

–మే 17 – విద్యా విజయోత్సవం
ఎస్సీ, ఇంటర్, పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించనున్నారు.

ప్రభుత్వ బడులపై నమ్మకం పెంచే దిశగా చర్యలు,ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే మన ఊరు – మన బడి, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఇంగ్లీష్ మీడియం బోధన వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పిల్లల ప్రతిభను వెలికితీసేందుకు మాత్రమే కాకుండా, తల్లిదండ్రులు కూడా పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో "ఎడ్యుకేషన్ వీక్" నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలకు ప్రత్యేక బడ్జెట్ విడుదల,ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రతి జిల్లాకు ప్రత్యేక బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించిందని,విద్యార్థుల హాజరు పెంపు, డ్రాపౌట్స్ తగ్గింపు, ప్రభుత్వ కళాశాల,పాఠశాలలపై విశ్వాసం పెంపు లక్ష్యంగా అధికారులు కార్యాచరణ రూపొందించారు.రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాలతో ప్రభుత్వ బడులు మరోసారి చైతన్యవంతంగా మారనున్నాయని విద్యావర్గాలు, కళాశాల ప్రిన్సిపాల్ పోషయ్య అభిప్రాయపడ్డారు.

## పల్లకొండ సమ్మయ్య దిశదిన కర్మలో పాల్గొన్న మార్నేని రవీందర్ రావు

**-వెంకటయ్య సేవాస్ఫూర్తిని కొనియాడిన మార్నేని**
**-గ్రామాభివృద్ధికి వెంకటయ్య సేవలు చిరస్మరణీయం**
**-కుటుంబానికి ప్రగాఢ సానుభూతి**



మే 11ప్రజాకలం ప్రతినిది: (హన్మకొండ /ఐనవోలు)
అయినవోలు మండల కేంద్రం ఆదివారం విషాద వాతావరణంలో మునిగిపోయింది. నందనం రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్‌గా సేవలందించిన దివంగత పల్లకొండ సమ్మయ్య దిశదిన కర్మ కార్యక్రమానికి మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు హాజరై ఘనంగా నివాళులర్పించారు. సమ్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సామాజిక సేవకుడు శాగంటి వెంకటయ్య పార్థివదేహాన్ని సందర్శించిన మార్నేని రవీందర్ రావు, పూలమాల వేసి నివాళు లర్పించారు. వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "వెంకటయ్య గ్రామ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ ముందుండే వ్యక్తి. అవసరమైన వారికి సహాయం చేయడం, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ఆయన జీవిత ధ్యేయంగా చేసుకున్నారు. ఆయన మరణం గ్రామానికి తీరని లోటు" అని పేర్కొన్నారు.గ్రామంలో యువతకు మార్గనిర్దేశనం చేస్తూ, పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆధ్యాత్మిక సామాజిక కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించిన వెంకటయ్య సేవలను పలువురు గ్రామస్తులు గుర్తుచేసుకున్నారు. ఆయన సాదాసీదా జీవనం, అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావం కారణంగా గ్రామ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు సర్పంచులు, సహకార సంఘాల నాయకులు, జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని దివంగతులకు నివాళులర్పించారు.

## నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన వేసవి శిబిరం

**- వేసవి శిబిరన్ని ప్రారంభించిన సర్పంచ్ కొమ్ము కృష్ణ**
**- విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కళలో రాణించాలి**

నందిగామ మే 11 (ప్రజా కలం):ప్రతినిధి నందిగామ మండల కేంద్రంలో. నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో




ఏర్పాటు చేసిన యూవ ఇండియా వేసవి శిబిరం ను నందిగామ సర్పంచ్ కొమ్ము క్రిష్ణ జ్యోతి వెలిగించి అధికారికంగా ప్రారంభించారు ఈ కారక్రమంలో సర్పంచ్ కొమ్ము క్రిష్ణ ప్రసంగిస్తు విద్యార్థులు వేసవి సెలవుల్లో కేవలం ఆటలకే పరిమితం కాకుండా కొత్త కొత్త విషయాలను నేర్చుకుంటూ తమలోని మేధా శక్తిని మెరుగుపరుచుకుంటూ క్రీడా కార్యక్రమలో దేహ దారుఢ్యాన్ని మెరుగు పరుచుకోవాలని కొమ్ము కృష్ణ అన్నారు సోమవారం వేసవి శిబిరం మే 11వ తేదీ నుండి మే 25వ తేదీ వరకు టైమ్ 8 నుండి 12 వరకు నిర్వహించబడుతుంది ఈ శిబిరంలో విద్యార్థులకు క్లాసికల్ డ్యాన్స్, సంగీతం, మరియు పాటలు పాడటం, వివిధ రకాల ఆటలు మరియు అవుట్ డోర్ స్పోర్ట్స్ వంటి అంశాలలో శిక్షణ ఇవ్వనున్నారు పాఠశాల చదువుతో పాటు విద్యార్థులకు కళలు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే ఈ క్యాంప్ ప్రధాన లక్ష్యం అని సర్పంచ్ కృష్ణ చెప్పుకొచ్చారు విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించినప్పుడే విద్యార్థులు సంపూర్ణ వ్యక్తిత్వాన్ని పొందుతారని తెలిపారు ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి సైదులు,మండల విద్యా అధికారి సుదాకర్, ఉపసర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్, మరియు నందిగామ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సమ్మర్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలి

**- తహశీల్దార్ టి. వెంకటస్వామి**

(వరంగల్/ పర్వతగిరి) మే 11, ప్రజాకలం ప్రతినిధి.

వేసవి సెలవుల్లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని పర్వతగిరి మండల తహశీల్దార్ టి. వెంకటస్వామి అన్నారు. పర్వతగిరి మండల కేంద్రంలోనీ మోడల్ స్కూల్ లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేసవిలో ఇళ్ల వద్ద సమయాన్ని వృధా చేసుకోకుండా నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు విద్యార్థులకు ఈ సమ్మర్ క్యాంపు దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి. శ్రీదేవి మాట్లాడుతూ, సమ్మర్ క్యాంప్ ఈ నెల 11 వ తేదీ నుండి 25 వ తేదీ వరకు నిర్వహించబడుతుందని, ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు తరగతులు నిర్వహించబడుతాయని అన్నారు. ఈ క్యాంప్ లో విద్యార్థులకు




మ్యూజిక్, డాన్స్, డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, చెస్, ఇండోర్ గేమ్స్, ఇతర నైపుణ్యాలు నేర్పించబడతాయని తెలిపారు. ఈ క్యాంపులో చేరుటకు 6 నుండి 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులు అని ఏ పాఠశాలలో చదివే విద్యార్థులు అయినా కూడా చేరవచ్చు అని తెలిపారు. క్యాంపుకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం ( స్నాక్స్) అందించబడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్స్ భవానీ, రాజప్రభు, రిసోర్స్ పర్సన్స్ హైమవతి, శ్రీలేఖ, మాధవి, సీ ఆర్ పి ప్రవీణ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## తానూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా విద్యా వారోత్సవాల ప్రారంభం!



తానూర్,మే 11(ప్రజా కలం):

తానూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా వారోత్సవాలు ప్రారంభం! తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన–ప్రగతి' ప్రణాళికలో భాగంగా మే 11 నుండి 17 వరకు విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, పాంప్లెట్లు మరియు బ్రోచర్లను ఆవిష్కరించారు. ఇంటర్ అడ్మిషన్ల ప్రచారంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో తానూర్ మండల విద్యాధికారి నరేందర్, ఉప సర్పంచ్ ఫారూఖ్, వార్డు మెంబర్లు, ప్రిన్సిపాల్ రవికిరణ్ మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## 64మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా అందజేత**



షాద్నగర్ మే 11 (ప్రజా కలం): ప్రతినిధి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన 64 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్లతో కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగయ్య, అధికారులు నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



(వరంగల్/ పర్వతగిరి) మే 11, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలం ధూప తండా గ్రామంలో స్థానిక సర్పంచ్ ధరంసోత్ తిరుపతితో కలిసి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు పట్టు వస్త్రాలు సమర్పించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ, పర్వతగిరి మండల పరిధిలో ఇందిరమ్మ ఇల్లు మొత్తం అందించినవి 551, మార్క్అవుట్ ఇచ్చినవి 459, మార్క్అవుట్ ఇవ్వనివి 92, బేస్‌మెంట్ స్థాయి 69, పైకప్పు స్థాయి 37, స్లాబ్ స్థాయి 262 కాగా పేదవారి సొంతింటి కల సాకారం చేయడనికి 27 కోట్ల పైచిలుకు రూపాయిలు ఖర్చు చేస్తుంది అని శ్రీనివాస్ నాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి బిసి, ఎస్సీ, ఎస్టి, మైనరీటి వర్గాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు నిరంతరం కృషి చేస్తున్నరాని అన్నారు. గత ప్రభుత్వం పేద కుటుంబాలను మోసశీ చెసింధని డబుల్ బెడ్ రూమ్ పెరిట ధఘా చెసింధని అన్నారు. గత ప్రభుత్వంలో మోసపోయిన ప్రతి కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆగిపోయిన ఇంటి నిర్మాణాలను ప్రభుత్వం చేపడుతుందని బరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దతండా సర్పంచ్ సుశీల వీరన్న, గోరుగుట్ట తండా సర్పంచ్ బానోత్ విజయలక్ష్మి భాస్కర్, అన్నారం గ్రామ పార్టీ అధ్యక్షులు గొడుగు రమేష్, మండల సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ వంగ సాయికృష్ణ యాదవ్, మోహన్ నాయక్, తధితరులు పాల్గొనారు.

## విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోవాలి : డీఈఓ రాము

గొల్లపల్లి మే 11 ప్రజా కలం ప్రతినిధి
గొల్లపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో 15 రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నారు.విజ్ఞాన శిబిరాన్ని స్థానిక సర్పంచ్ నల్ల నిరజా సతీష్ రెడ్డి ,ఎంఈఓ చెరుకు రాజన్న ప్రారంభించారు.. 15 రోజుల పాటు జరిగే ఈ వేసవి విజ్ఞాన శిబిరం మండలంలో ఉన్న ఆరవ తరగతి నుండి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులు ఉపయోగించుకోవాలని విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడానికే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇంట్లో ఉండి సెల్ ఫోన్ ,టీవీకి పరిమితం కాకుండా విద్యార్థులు పాఠశాలకు వచ్చి వివిధ కార్యక్రమాల ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుంకరి రవి, ఉప సర్పంచ్ గురజాల బుచ్చిరెడ్డి,వార్డు సభ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



## జనగణన ప్రక్రియలో ప్రజలంతా భాగస్వామ్యం అవ్వాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ మే11 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జనగణన ప్రక్రియలో ప్రజలంతా భాగస్వామ్యం అవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జనగణన ప్రచార వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రచార వాహనం ద్వారా జిల్లాలో ప్రజలకు జనగణన ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.జనగణన ప్రక్రియకు సంబంధించి సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ ఆదివారంతో ముగిసిందని, జిల్లాలో సుమారు 20 వేల మంది ప్రజలు స్వయంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ పూర్తి చేసుకున్నారని వివరించారు. నేటి నుంచి జూన్ 9వ తేదీ వరకు హౌస్ లిస్టింగ్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.జిల్లాలో జనగణన నిర్వహణ కోసం సుమారు 1,400 మంది ఎన్యుమరేటర్లు, 200 మందికి పైగా సూపర్వైజర్లను నియమించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఎన్యుమరేటర్లు 33 ప్రశ్నలు అడుగుతారని, ప్రజలంతా అధికారులకు సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. అందజేసే వివరాలన్నీ పూర్తిగా గోప్యంగా ఉ



ంచబడతాయని స్పష్టం చేశారు.ఈసారి జనగణన ప్రక్రియ మొత్తం కాగిత రహితంగా, పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో నిర్వహించబడుతుందని తెలిపారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తైన అనంతరం రెండో దశ జనగణన చేపట్టనున్నట్లు వెల్లడించారు.అలాగే జిల్లాలోని ప్రతి మండలం, పట్టణంలోని వార్డుల్లో ప్రత్యేక ప్రచార రథం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 2 లక్షల ఇళ్లలో సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో ఇంటి వివరాల నమోదు ప్రక్రియకు కేవలం 3 నుండి 4 నిమిషాల సమయం మాత్రమే పడుతుందని, ప్రజలు ఎలాంటి అపోహలు లేకుండా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సీపీఓ జీవరత్నం, డీపీఆర్వో విష్ణువర్ధన్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపైన అత్యాచారానికి పాల్పడిన బండి సాయి భగీరథ్, ను తక్షణమే అరెస్టు చేయాలి

### - డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ దళితరత్న డిమాండ్.

ఖమ్మం మే11(ప్రజా కలం న్యూస్ )

మైనర్ బాలిక కుటుంబానికి తెలంగాణ పోలీస్ రక్షణ కల్పించాలి,తెలంగాణ మాదిగ హక్కుల దండోరా టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ దళితరత్న డిమాండ్ చేశారు.మైనర్ బాలికకు మద్యం తాగించి అత్యాచారానికి పాల్పడిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలి, బండి సంజయ్, కేంద్ర హోమ్ సహాయక మంత్రి పదవికి రాజీనామా చేయాలి. టీఎంహెచ్డీ రాష్ట్ర కమిటీ తరపున టీఎంహెచ్డీ వ్యవస్థాపకులు జన్ను కనకరాజు మాదిగ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్, మాదిగ డిమాండ్ చేశారు.



చట్టం ముందు అందరూ సమానులే అనేవిధంగా రాజ్యాంగబద్ధంగా పోలీసులు వ్యవహరించాలని చెప్పారు. బండి సాయి భగీరథ తన తండ్రి కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉన్నాడనే అండదండతో తాను చదువుకున్న విద్యాసంస్థలలో ర్యాగింగ్ కు, భౌతిక దాడులకు పాల్పడటం, మద్యం మత్తులో సహా విద్యార్థులపై అరాచకాలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. మైనర్ బాలికపై అత్యాచారం చేయడమే కాకుండా తమను హనీ ట్రాప్ చేశారని కేసులు తప్పుదోవ పట్టించడానికి కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని విమర్శించారు. బాధిత 17 ఏళ్ల యువతీ.తన నిండు భవిష్యత్తును పాడు చేస్తున్నాడని, మొయినాబాద్ ఫామ్ హౌస్ లో తనకు మద్యం తాగించి మద్యం మత్తులో తనను నానా రకాల ఇబ్బందులు పెట్టారని తన తల్లితో కలిసి బెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుకి వస్తే పోలీసులు గంటల తరబడి నిరీక్షింపజేసి ఫిర్యాదు స్వీకరించారని చెప్పారు. రాష్ట్ర పోలీస్ యంత్రాంగం తక్షణమే స్పందించి మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన సాయి భగీరథ పై ఫోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బేటి బచావో బేటి పడావో వంటి అనేక నినాదాలు ఇస్తున్న బిజెపి సంస్కారం.. రేపిస్టులకు సత్కారాలు చేయటం.. అత్యాచారాలు చేయడంతో వారి మహిళల పట్ల చిత్తశుద్ధి చాటుకుంటున్నారని చెప్పారు. దేశం కోసం ధర్మం కోసం అంటూ దేశ ప్రజలను బుకాయిస్తున్నటువంటి మతోన్మాదులు మహిళల జీవితాలతో చలగాటమాడుతున్న స్థితిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కేంద్ర హోం మంత్రి రాష్ట్ర ప్రభుత్వ నేతలను, పోలీసులను ప్రభావితం చేయడమే కాకుండా బాధిత యువతి కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు.

ఆ యువతికి ప్రాణహాని పొంచి ఉందని తక్షణమే సాయి భగీరథను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని టీఎంహెచ్డీ రాష్ట్ర కమిటీ తరపున డిమాండ్ చేస్తుందన్నారు. సాయి భగీరథను అరెస్ట్ చేయకపోతే తెలంగాణ మాదిగ హక్కుల దండోరా టీఎంహెచ్డీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం లో అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారులిమైనర్ బాలికపైన అత్యాచారానికి పాల్పడిన బండి సాయి భగీరథ్ ను తక్షణమే అరెస్టు చేసి మైనర్ బాలిక కుటుంబానికి తెలంగాణ పోలీస్ రక్షన కల్పించాలితెలంగాణ మాదిగ హక్కుల దండోరా టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ దళితరత్న డిమాండ్ చేశారు.

## "రాజీవ్ యువ వికాసం" పథకం అమలు జరిగేనా...!?

### - నిరాశ లో నిరుద్యోగ యువత

### - బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు

పాలేరు మే 11( ప్రజా కలం న్యూస్ ) నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన "రాజీవ్ యువ వికాసం" పథకం అమలులో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు తీవ్ర విమర్శలు చేశారు. రూ.6000 కోట్లతో ప్రకటించిన ఈ పథకం కేవలం హామీలకే పరిమితమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 5, 2025 న దరఖాస్తుల ప్రక్రియ ముగిసి 13 నెలలు గడిచినా ఇప్పటికీ ఇంటర్వ్యూలు నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేసారు. జూన్ 2, 2025 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 5 లక్షల మంది లబ్ధిదారులకు మంజూరు లేఖలు, చెక్కులు అందజేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికీ ఆ ప్రక్రియ అమలులోకి రాలేదని ఆయన పేర్కొన్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాల యువతకు రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు 60% నుంచి 100% సబ్సిడీతో రుణాలు ఇస్తామని ప్రకటించినప్పటికీ అమలు జరగలేదని విమర్శించారు. ఖమ్మం జిల్లాలోని వేలాది మంది నిరుద్యోగ యువత ఆశతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, కలెక్టర్ అధ్యక్షతన జరగాల్సిన జిల్లా స్థాయి ఎంపిక కమిటీ సమావేశాలు కూడా పూర్తి కాలేదని తెలిపారు. జూన్ 2న ప్రకటించాల్సిన లబ్ధిదారుల జాబితా ఎందుకు విడుదల కాలేదో ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.6000 కోట్ల బడ్జెట్లో ఎంత ఖర్చు చేశారు, ఎన్ని లోన్లు మంజూరు చేశారు అనే వివరాలను జిల్లా వారీగా ప్రకటించాలని కోరారు. బ్యాంకుల లింకేజీతో వెంటనే లోన్లు మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 13 నెలల ఆలసత్వానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద వేలాది మంది నిరుద్యోగ యువతతో భారీ నిరసనచేపడతామని హెచ్చరించారు. భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.



## బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

### -వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

వరంగల్ : ఉద్యోగంలో స్థాయి పెరిగిన కొద్దీ బాధ్యతలు కూడా పెరుగుతాయని, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ గారు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల ఏఎస్సై స్థాయి నుంచి సబ్ ఇన్స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన 25 మంది అధికారులు శుక్రవారం పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన ఎస్.ఐ భుజాలపై నక్షత్ర చిన్నహాలను అలంకరించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పదోన్నతులు కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా ప్రజల పట్ల మరింత బాధ్యతతో పనిచేసే అవకాశం అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుభూతితో వినడం, చట్టపరంగా వేగవంతమైన చర్యలు తీసుకోవడం, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

## రైతు రిజిస్ట్రీ వంద శాతం పూర్తి చేయాలి

### - కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశం

పెద్దపల్లి,మే 11:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రైతు రిజిస్ట్రీ నమోదు వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి రైతు రైతు రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రైతు రిజిస్ట్రీ భవిష్యత్తులో యూరియా,సబ్సిడీ విత్తనాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలకు అనుసంధానం కానున్నందున ఒక్క రైతు కూడా నమోదు కాకుండా మిగలకుండా చూడాలని సూచించారు.ప్రస్తుతం జిల్లాలో రైతు రిజిస్ట్రీ నమోదు 80 శాతం మాత్రమే పూర్తైందని, ముఖ్యంగా శ్రీరాంపూర్,పెద్దపల్లి మండలాల్లో 70 శాతానికి పరిమితమైందని తెలిపారు.ప్రతి ఏఈఓ ప్రతి రోజూ కనీసం 10 మంది రైతుల నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు.వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి క్రాప్ బుకింగ్ వంద శాతం పూర్తి అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి అర్హులైన ప్రతి రైతుకు ప్రయోజనం అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.ప్రతి



క్లస్టర్‌లో పెండింగ్‌లో ఉన్న రైతు బీమా దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని,రైతు కుటుంబాలందరికీ పథకం ప్రయోజనం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.రైతు బీమా ప్రతిపాదనలు ఆలస్యం లేకుండా వెంటనే పంపించాలని సూచించారు.వచ్చే సీజన్‌లో యూరియా కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని తెలిపారు.ఏఈఓల హాజరు వంద శాతం ఉండేలా ఎఫ్ఎల్ఎన్ చేయాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్ల వేగాన్ని వెంటనే పెంచాలని, ధాన్యం నాణ్యతను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఎఫ్ఏక్యూ నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.చివరి బస్తా ధాన్యం కొనుగోలు అయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా పని చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్,ఎంఏఓలు,ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ గండితో అగాధంలోకి రైతన్న

### - భోజన చెరువును కాపాడాలని కలెక్టర్ కు పెద్దకల్వల రైతుల వినతి



పెద్దపల్లి,మే11:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

సొంత లాభం కోసం కాంట్రాక్టర్లు చేస్తున్న అక్రమాలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయని, పెద్దపల్లి బైపాస్ రోడ్డు పనుల సాకుతో పెద్దపల్లి మండలం పెద్దకలవల గ్రామంలోని భోజన చెరువుకు అక్రమంగా గండి కొట్టడాన్ని గ్రామ రైతులు తీవ్రంగా ఖండించారు.గ్రామానికి అన్నపూర్ణ వంటి ఈ చెరువును ధ్వంసం చేయడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం ప్రజావాణిలో రైతులు జిల్లా కలెక్టర్‌కు ఆధారాలతో సహా వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతు ప్రతినిధి గుండవేన స్వామి మాట్లాడుతూ ఈ నెల 6న గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ చెరువుకు గండి కొట్టారని,దీని వెనుక రోడ్డు కాంట్రాక్టర్ల స్వార్థం దాగి ఉందని ఆరోపించారు.మరో పది రోజుల్లో రోహిణి కార్తె రాబోతోందని,ఈ సమయంలో రైతులంతా వరి నారు పోసుకోవడానికి సిద్ధమవుతుంటే,చెరువు నీటిని వృథా చేయడం రైతుల పొట్ట కొట్టడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో ఉన్న చేపలు,గ్రామ పశుసంపదకు తాగునీరు ఈ గండి వల్ల కరువయ్యే పరిస్థితి నెలకొందని వారు వాపోయారు.అధికార,ప్రతిపక్ష నాయకులు కాంట్రాక్టర్ల లబ్ధి కోసం మౌనంగా ఉంటూ రైతులకు అన్యాయం చేస్తున్నారని,రాజకీయ పక్షాల తీరును రైతులు తీవ్రంగా విమర్శించారు.నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లు తమ పనులకు కావాల్సిన వనరులను వేరే విధంగా సమకూర్చుకోవాలి కానీ,సాగునీటి వనరులను ధ్వంసం చేసే హక్కు ఎవరికీ లేదని వారు స్పష్టం చేశారు.ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి యుద్ధ ప్రాతిపదికన చెరువు గండిని పూడ్చివేయాలని,అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు డిమాండ్ చేశారు.ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన వారిలో రైతులు బత్తుల అనిల్,బత్తుల కొమురయ్య,నామసాని ఐలయ్య,బత్తుల రవి,గాండ్ల అంజయ్య,జంగిటి కొమురయ్య,అదిచెర్ల మూర్తి,నలేంద్ర మహేష్ కుమార్,నాంసాని పెద్ద ఐలయ్య,మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

## నెలవారి చిట్టి పేరుతో ఘరానా మోసం

### తొమ్మిది లక్షలు కట్టిన బాధితులు

### ఇద్దరు పిల్లల కోసం రూపాయి రూపాయి కూడబెట్టిన దంపతులు

### నమ్మినవారే నట్టేట ముంచిన వైనం - పోలిసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

పర్వతగిరి: నెలవారి చిట్టీల పేరుతో జరుగుతున్న ఘరానా మోసాలు ఇటీవల తరచూ వెలుగులోకి వస్తున్నాయి. ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బును, నమ్మకంతో చిట్టీల నిర్వాహకులకు కట్టి చివరకు మోసపోతున్నారు. ఇలాంటి మోసానికి సంబంధించి తాజాగా వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మాల్యా తండ గ్రామ పంచాయతీ పరిధిలోని హర్జ్యాతండ కు చెందిన బానోత్ రమేష్ తొమ్మిది లక్షల రూపాయలు చిట్టి కట్టి మోసపొయిన సంఘటన వెలుగులోకి వచ్చింది.గూడూరు మండలం గుండెగ గ్రామ పరిధిలోని రామచంద్రు తండ మరియు నర్సంపేట మండల కేంద్రానికి చెందిన ఆరుగురు వ్యక్తులు భానోత్ సందీప్, భానోత్ మంగమ్మ, ధరావత్ సురేష్, ధరావత్ స్రవంతిఏసరిత, ఎర్ర రంజిత్ కుమార్, కందగట్ల అనితలు నెలవారి చిట్టీలు నడిపిస్తున్నామని చెప్పి నెలకు 35 వేల రూపాయల చొప్పున చిట్టి వేయాలని దగ్గర సన్నిహితులతో పరిచయమయ్యారని 27 నెల చిట్టి డబ్బులు కట్టడం జరిగిందని ప్రస్తుతం ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని బాధితులు వాపోతున్నాడు. మోసపోయానని గ్రహించిన బాధితులు పర్వతగిరి పోలీస్ స్టేషన్లో సంబంధిత వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. ఇద్దరు



ఆడపిల్లలు వారి చదువుల కోసం భార్యాభర్తలు కష్టపడి నెల నెల పొదుపు చేస్తే నమ్మించి మోసం చేశారని బాధితులు వాపోయారు. నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు. ఫిర్యాదు అందింది దర్యాప్తు చేస్తున్నాం –ఎస్సై ప్రవీణ్ కుమార్ చిట్ ఫండ్ పేరుతో 9 లక్షల రూపాయలు మోసపోయినట్లు బానోత్ రమేష్ ఫిర్యాదు చేశారు. నర్సంపేట గూడూరు మండలాలకు సంబంధించిన వ్యక్తులకు ఫోన్ పే ల ద్వారా డబ్బులు పంపించారని ప్రస్తుతం చిట్ఫండ్ కట్టించుకున్న వారు ఫోన్ లిఫ్ట్ చేస్తే స్పందించడం లేదని తెలిసింది.కేసు విచారణ చేస్తున్నాము.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### విద్యా వారోత్సవాల్లో అధికారులు భాగస్వాములు కావాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ మే11 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందే వినతులను ఏమాత్రం జాప్యం చేయకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్నారని, వారి వినతులపై అధికారులు సానుకూల దృక్పథంతో స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉంటేనే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని తెలిపారు.ప్రజావాణిలో భాగంగా ప్రజలు ప్రధానంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సమర్పించారు. అధికారులు, సిబ్బంది విధిగా కార్యాలయ సమయాలను పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు.

'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జిల్లావ్యాప్తంగా విద్యా వారోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు చురుకుగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ నెల 15న నిర్వహించనున్న 'లైబ్రరీ డే' సందర్భంగా అధికారులు పెద్ద ఎత్తున పుస్తకాలను వితరణ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### విత్తన సంస్థ పంపిణీ చేసే సీడ్స్ రైతులు

## వినియోగించేలా ప్రోత్సహించాలి

### రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్ రెడ్డి.



నిర్మల్ మే11 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్ర విత్తన సంస్థ పంపిణీ చేసే సీడ్స్ రైతులు వినియోగించేలా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సంస్థ చైర్మెన్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి, వారి ఉన్నతికి విత్తన సంస్థ పనిచేస్తుందని, డీలర్లు అందరూ ప్రభుత్వం తయారు చేసే విత్తనాలు రైతులు సాగు చేసుకునేలాగా ప్రచారం కల్పించాలన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ పంపిణీ చేసే విత్తనాలు అన్ని నాణ్యతా పరంగా ఉత్తమమైనవి అని అన్నారు. ధర తక్కువ ఉండటంతో పాటుగా, దిగుబడి కూడా అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. అనుమతులు లేని ప్రైవేట్ విత్తనాల కంపెనీలు రైతులను ప్రలోభాలకు గురిచేస్తూ, నాసిరకం విత్తనాలు అమ్ముతున్నాయని వివరించారు. దీని ద్వారా రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. డీలర్లు ఎట్టిపరిస్థితుల్లో నకిలీ విత్తనాలు విత్తనాలు రైతులకు అమ్మరాదని హెచ్చరించారు. సహకార సంఘాలు, మహిళా సంఘాలు విత్తన సంస్థ యొక్క విత్తనాలు రైతులకు అందించాలని తెలిపారు.

విత్తనాభివృద్ధి సంస్థ సీడ్స్ వల్ల రైతులకు లాభాలు:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసే విత్తనాలు వల్ల రైతులకు చాలా లాభాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సంస్థ తయారు చేసే విత్తనాలు అన్ని ఎన్నో నాణ్యతా పరీక్షల తర్వాత విపణిలోకి వస్తాయన్నారు. ఈ విత్తనాలు సాగు చేయడం ద్వారా రైతులు ఎక్కువ లాభాలు పొందగలుగుతారని చెప్పారు. అలాగే నకిలీ విత్తనాల నుంచి కూడా రైతులు నష్టపోకుండా ఉంటారని అన్నారు. విత్తన డీలర్లు అందరూ రైతులు ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలు వినియోగించేలా ప్రోత్సహించాలని తెలిపారు.ఈ సమావేశంలో నిర్మల్, ఆదిలాబాద్ వ్యవసాయ శాఖ అధికారులు అంజి ప్రసాద్, శ్రీధర్, డిఆర్డిఓ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ లు భీమ్ రెడ్డి, అబ్దుల్ హాది, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, ఇతర అధికారులు, విత్తన డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా నేతలపై కేసులు పెడుతున్నారు

విశాఖపట్నం : స్పీకర్ అయ్యన్నపాత్రుడు అనుచరులే దాడి చేసి తమ నాయకులపై కేసులు పెట్టడం దారుణమని మాజీ మంత్రి అమర్ నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా స్పీకర్ సొంత నియోజకవర్గంలో అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్లకాలం ఒకేలా ఉండదని, భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. చర్యకు ప్రతి చర్య ఉంటుందన్న విషయం టీడీపీ నాయకులు గుర్తించుకోవాలని సూచించారు.

## విశాఖలో ఎన్జీజీవో భవనం ప్రారంభం

విశాఖపట్నం : రాష్ట్రంలో ఏపీఎన్జీజీఓ భవణాలను ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉండేలా తీర్చిదిద్దామని రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు.విశాఖలో ఏపీఎన్జీజీఓ నూతన భవణాన్ని ప్రారంభించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ... ఉద్యోగ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కరించేలా కృషి చేస్తామని,పదవీ విరమణ బకాయిలను కూడా పెండింగ్ లో ఉన్నాయని,కూటమి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు న్యాయం చేసేలా ఒత్తిడి తెస్తామని అన్నారు.పెండింగ్ లో ఉన్న సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## కేకే లైన్ ను రాయగడ డివిజన్ లో కలపొద్దు

విశాఖపట్నం : దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడాన్ని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు స్వాగతించారు. అయితే, కొత్తవలస–కిరండూల్ కేకే లైన్, అరకు, బొర్రా గుహల ప్రాంతాలను విశాఖ డివిజన్ నుండి విడదీసి రాయగడ డివిజన్‌లో కలపడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.మద్దిలపాలెంలోని ఏచూరి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేకే లైన్‌ను తరలించడం విశాఖ ప్రజలకు అన్యాయం చేయడమేనని, ఆ ప్రాంతాలను విశాఖ డివిజన్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు

విశాఖపట్నం : విశాఖ కేంద్రంగా జూన్ 1 నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు ఎంపీ భరత్ వెల్లడించారు. ఇచ్చిన హామీ మేరకు వాల్తేరు డివిజన్‌ను కాపాడుకున్నామన్నారు. జోన్ వల్ల విశాఖ నుంచి మరికొన్ని కొత్త రైళ్లు అడగవచ్చని, విశాఖ నుంచి బెంగళూరుకు రోజూ సర్వీసులు నడిపే ఆలోచన చేస్తున్నామన్నారు. అలాగే విశాఖ నుంచి తిరుపతికి వందేభారత్ అడుగుతామని తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో రైల్వేజోన్ విషయంలో ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని ప్రశ్నించారు.జగన్ అండ్ కోకు పరిపాలన అంటే ఏమీ తెలియదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేయకపోయినా.. ప్రతిపక్షంలోకి వచ్చినప్పుడు మాత్రం అన్ని చేయాలని అంటారని ఎద్దేవా చేశారు. జూన్ ఒకటి నుంచి రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని తెలిపారు. గెజిట్ రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రైల్వేజోన్ రావడమే కాదని.. విశాఖ డివిజన్ కూడా వచ్చిందని ప్రస్తావించారు. అభివృద్ధి అంటే ఏమిటో తెలియని పార్టీ వైసీపీ అని విమర్శించారు. జగన్ అండ్ కో క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రతిదీ తామే తెచ్చామని గొప్పలు చెప్పుకొవడం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీకి లక్ష కోట్ల ప్రాజెక్టులు వచ్చాయని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు.

## త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు

విజయవాడ : రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో 'స్వర్ణాంధ్ర విజన్ 10 సూత్రాలు' అనే అంశంపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర అభివృద్ధిలో లాజిస్టిక్స్ వ్యయం తగ్గించడం అత్యంత కీలకమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి రూ.లక్ష కోట్లకు పైగా విలువైన 64 జాతీయ రహదారులు, రూ.64 వేల కోట్ల విలువైన 624 రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. మరో రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టులు డీపీఆర్ దశలో ఉన్నాయని వెల్లడించారు.ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉందని, దీనికి అనుగుణంగా కలెక్టర్లు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. వర్షాధార, మెట్ట, ఉద్యాన పంటలకు తగినట్లుగా నీటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.



# సాయంత్రం 5 దాటితే ఇసుక వాహనాలకు నో ఎంట్రీ:

## నిజామాబాద్ కలెక్టర్ కఠిన ఆదేశాలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 11:

ఇసుక రవాణా విషయంలో నిబంధనల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. కలెక్టర్ అధ్యక్షతన సోమవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, మైనింగ్, ఇంజినీరింగ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక రీచ్ లను. క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ ద్వారా ఇసుక కేటాయింపులు జరగాలని, ఇసుక రవాణా విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత.సంబంధిత శాఖల అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను తూచ తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత ఇసుక వాహనాల రాకపోకలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పని చేస్తూ అక్రమాలకు తావు లేకుండా చూడాలన్నారు. ఇసుక రీచ్ ల వద్ద టీజీఎండిసి అధికారులు ప్రభుత్వ మార్గదర్శకా పక్కాగా పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, జవహర్ నవోదయ విద్యాలయం భవన సముదాయాల నిర్మాణాలకు అవసరమైన ఇసుక నిల్వలను నిర్దేశిత ఇసుక రీచ్ ల నుండి తరలించేందుకు కలెక్టర్ అనుమతించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, మైనింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో 50మంది చిన్నారులకు సైకిల్స్ పంపిణీ చేసిన. టి పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి.

### - సంతోషం వ్యక్తం చేస్తున్న చిన్నారులు.

### - చిన్నారుల చిరు కోరికలు తీరుస్తున్న జగ్గన్న.

సంగారెడ్డి ప్రతినిధి మే 11( ప్రజా కలం):

సంగారెడ్డి పట్టణంలోని 50 మంది చిన్నారులకు సోమవారం నాడు జగ్గారెడ్డి సైకిల్స్ పంపిణీ చేశారు. ఈ వేసవి



సెలవుల్లో ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలని ఈ సందర్భంగా జగ్గారెడ్డి చిన్నారులకు సూచించారు. ఎండలో సైకిల్స్ తొక్కవద్దన్నారు. తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకున్న చిన్నారులకు విడతల వారీగా సైకిల్స్ పంపిణీ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు 320 సైకిల్స్ పంపిణీ పూర్తయింది. మరో 600సైకిల్స్ పంపిణీ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జార్జ్, చిద్రుప్ప రఘు గౌడ్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# కుకునూరు పల్లి లో వైభవంగా నాభి శిల ప్రతిష్ఠ మహోత్సవం

గజ్వేల్ నియోజకవర్గం:11 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం కుకునూరుపల్లి మండల కేంద్రంలో నాభి శిల (బొడ్రాయి) ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని వందల ఏళ్ల నాటి పురాతన నాభి శిలను వెలికితీసి, గ్రామ నడిబొడ్డున నూతన నాభి శిల, పోతలింగేశ్వర స్వామి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు.పాండురంగ ఆశ్రమ గురువులు విఠల్ శర్మ పర్యవేక్షణలో అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య యంత్ర ప్రతిష్ఠ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహా అన్నదానానికి భక్తులు భారీగా తరలివచ్చారు.కార్యక్రమంలో సర్పంచ్ మల్లం కనుకవ్వ ఐలయ్య,ఉప సర్పంచ్ దోంతి సత్తయ్య,మాజీ సర్పంచ్ కాసం నవీన్ కుమార్,పిఎన్ఆర్ ట్రస్ట్ అధినేత పోల్కంపల్లి నరేందర్,పాక్స్ వైస్ చైర్మన్ అమరేందర్, మాజీ ఎంపిటిసిలు ఇండ్ల కనకయ్య,భూరమైన భూములు గౌడ్,ప్రజాప్రతినిధులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజావాణి దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించాలి

## : జిల్లా కలెక్టర్ కె. హైమావతి.

సిద్దిపేట ప్రజాకలం మే 11.


ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో ప్రజావాణికి వస్తున్నారని, అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించాలని అధికారులను



ఆదేశించారు. ఈ సందర్భంగా మొత్తం 94 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఫీజు బకాయిలు చెల్లించాలి

## -జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన పిల్లల తల్లి తండ్రులు.



సంగారెడ్డి ప్రతినిధి మే 11 (ప్రజాకలం):

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గత 4 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ ఫీజు బకాయిలను సుమారు (రూ. 5 కోట్ల పైన ఉన్న) వెంటనే విడుదల చేయాలని, మరియు షరతులు లేకుండా పదవ తరగతి పాస్ అయినా విద్యార్థుల సర్టిఫికెట్స్ ఇవ్వాలని బెస్ట్ అవైలేబులు (స్కింమ్) స్కూల్ ( విద్యార్థుల తల్లిదండ్రులు సంఘం నాయకులు ఎల్ వేణుగోపాల్, చిత్తరి.యాదగిరి, మన్నే.నరేష్,టి.క్రాంతి, రాములు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయం జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది .ఈ సందర్భంగా వారు ఎల్. వేణుగోపాల్. చిత్తరి.యాదగిరి (మాజీ: కౌన్సిలర్) లు మాట్లాడుతూ 2026-27 ఇప్పుడు ప్రారంభం అయ్యే అకాడమీక్ వరకు రావలసిన రూ.5 కోట్లలోపు బకాయిలు విడుదల చేయాలనీ, ఇప్పటికి కాలేనందున ప్రైవేట్ స్కూళ్లు యాజమాన్యాల ఒత్తిడి విద్యార్థుల పై, వారి తల్లిదండ్రులపై పెరిగింది, విద్యార్థులను తరగతులకు అనుమతించమని లేదా ఇంటికి పంపిస్తమని మేనేజ్మెంట్ వతిడి చేయడం జరుగుతుంది, ఈ యొక్క సమస్య ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు చాలా ఇబ్బందులకు గురౌతున్నరు, అప్పులు తేచి కట్టడమా పిల్లలని స్కూల్ కి పంపకపోవడం అనేది వారి ముందున్న ప్రశ్న గా మిగిలింది, అలాగే పదవ తరగతి పాస్ అయిన విద్యార్థుల సర్టిఫికెట్స్ వెంటనే ఇవ్వాలి...! విద్యార్థులు పాత బకాయిలు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తాము అని యాజమాన్యం వత్తిడి చేయడం సరైంది కాదు అని వారు అన్నారు. ప్రభుత్వం అక్టోబర్ /2025 లో తుతు మంత్రంగా డిప్యుటీ సి.ఎం. బట్టి విక్రమార్క గారి ద్వారా 25 శాతం నిధులు విడుదల చేయడం జరిగింది, అవి ఏమాత్రం సరిపోక, స్కూల్ యాజమాన్యాలు కూడా ఇట్టి 25% బకాయి పీజులు సరిపోవట్లేదని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మిగిలిన బకాయి ఫిజులు మిరే కట్టాలని ఇబ్బందులకి గురించేయడం జరుగుతుంది.

కాబట్టి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని నాలుగు సంవత్సరాల బకాయిలు పీజులు వెంటనే విడుదల చేసి, పేద విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా, వారి వారి తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతున్నారు, లేదంటే రాష్ట్రావ్యాప్తంగా విద్యార్థుల తల్లిదండ్రులను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

ఇయొక్క కార్యక్రమం లో మమతా, వై.బాలరాజ్, డి. రాములు, కిరణ్ కుమార్, ప్రసాద్, కె. జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి




## - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.

సంగారెడ్డి ప్రతినిధి,మే11 ( ప్రజా కలం):

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల మ్యాపింగ్ పురోగతి ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు.


ప్రస్తుతం కొన్ని నియోజకవర్గాలు మాత్రమే 90 శాతం పురోగతి సాధించాయని తెలిపారు. వచ్చే 15 రోజుల్లో అన్ని జిల్లాలు వేగంగా పని చేసి 90 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల మ్యాపింగ్ ప్రక్రియలో తప్పులు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు మ్యాపింగ్ పురోగతి, పంపిణీ చేసిన ఫారాలు, సేకరించిన ఫారాల వివరాలను తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా వీఆర్వోలు, బీఎల్ఓల పేర్లు మరియు ఫోన్ నంబర్లను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో జిల్లాలో యావరేజ్ గా 58% పైగా అయిందని, పటాన్చెరు నియోజకవర్గంలో గత వారం కన్నా ఇప్పుడు కొంత పురోగతి సాధించిందనీ, మరింత పురోగతి సాధించాలని అధికారులకు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు పరిష్కరించి, ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలోఅదనపు కలెక్టర్ పాండు, సంగారెడ్డి ఆర్డిఓ రాజేందర్, తహసిల్దార్ జయరాం, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాలకు సర్పంచ్ రాధకు ఆహ్వానం

## ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణపై అవగాహన

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 11:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా పాలెం గ్రామ సర్పంచ్ పలిగిరి రాధ గారికి సోమవారం అధికారిక ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ నెల 13న



వేల్పూర్ మండల కేంద్రంలో నిర్వహించనున్న 'సర్పంచ్‌ల సమావేశానికి' హాజరుకావాల్సిందిగా పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లెపాటి వేణుగోపాల్ రావు, సీనియర్ ఉపాధ్యాయులు ఎస్. మహేష్ కుమార్ కలిసి ఆమెను కోరారు. విద్యార్థులకు ఉపాధ్యాయుల భరోసా:ఇదే సందర్భంలో,ఇటీవల విడుదలైన ఎస్ఎస్సీ (SSC) ఫలితాల్లో ఉత్తీర్ణులు కాలేకపోయిన గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రశాంత్, మారుతి, అల్పిన, శ్రీజలను ఉపాధ్యాయ బృందం స్వయంగా కలిశారు. విద్యార్థులు నిరాశ చెందకుండా,రాబోయే సప్లిమెంటరీ పరీక్షల్లో విజయం సాధించేలా వారికి అవసరమైన సూచనలు చేశారు. నిజామాబాద్‌లో ప్రత్యేక తరగతులు:పదో తరగతిలో తప్పిన విద్యార్థుల కోసం నిజామాబాద్‌లోని శంకర్ భవన్ పాఠశాలలో మే 12 నుండి జూన్ 3 వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ తరగతులు జరుగుతాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి ఉత్తీర్ణులు కావాలని వారు ఆకాంక్షించారు.

# హైదరాబాద్ లో నీటిగండం




హైదరాబాద్ : ఎండ తీవ్రత ఎలా పెరుగుతుందో.. హైదరాబాద్ లో నీటి కష్టాలు కూడా అలాగే పెరుగుతున్నాయి. ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. వేసవి ఇంకా ముగియకముందే భూగర్భ జలాలు ఇంత దారుణంగా అడుగంటిపోవడం రాబోయే రోజుల్లో ఎదురయ్యే నీటి ఎద్దడికి ముందస్తు హెచ్చరికగా కనిపిస్తోంది. నగరం కాంక్రీట్ అడవిలా మారుతున్న తరుణంలో, వర్షపు నీరు భూమిలోకి ఇంకే మార్గం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందన్నది కాదనలేని వాస్తవం. హైదరాబాద్ మహానగరంలో భూగర్భ జల మట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయి. కేవలం ఒక్క నెలలోనే నీటి మట్టం గణనీయంగా తగ్గిపోవడం గ్రేటర్ వాసులను భయాందోళనలకు గురిచేస్తోంది. భూగర్భ జల శాఖ తాజా గణాంకాల ప్రకారం, నగరంలోని మెజారిటీ ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ప్రమాదకర స్థాయికి నీటి మట్టాలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో భూగర్భ జలాల పరిస్థితి ఇలా ఉంది. హైదరాబాద్‌లోని సుమారు 80 శాతం ప్రాంతాల్లో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే తక్కువ లోతుకు పడిపోయాయి. దీనివల్ల సాధారణ బోర్ల నుంచి నీరు రావడం కష్టతరంగా మారింది. నగర శివార్లలోని కుత్బుల్లాపూర్ ప్రాంతంలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది.

ఇక్కడ భూగర్భ జలాలు ఏకంగా 32 మీటర్ల (సుమారు 105 అడుగులు) లోతుకు పడిపోయాయి. అంటే ఇక్కడ నీరు దొరకాలంటే భూమిని మరింత లోతుగా తవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేగంగా మారుతున్న గణాంకాలు గతంతో పోలిస్తే ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గే వేగం పెరగడం నిపుణులను ఆశ్చర్యపరుస్తోంది. గత నెల రోజుల్లోనే పలు ప్రాంతాల్లో నీటి మట్టం సగటున 2 మీటర్ల మేర తగ్గడం గమనార్హం. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో భూగర్భంలో నీటి ఒత్తిడి పెరిగి, ఉన్న వనరులు కూడా త్వరగా హరించుకుపోతున్నాయి. దీనివల్ల ట్యాంకర్ల మీద ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. పరిష్కార మార్గాలు నీటి మట్టాలు ఇంత వేగంగా పడిపోవడానికి ప్రధాన కారణాలను అన్వేషించి పరిష్కరించుకోవాలి. నగరంలో విచ్చలవిడిగా సాగుతున్న అపార్ట్‌మెంట్ నిర్మాణాలు, వందలాది బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు త్వరగా అయిపోతోంది. భారీ వర్షాలు కురిసినప్పుడు ఆ నీటిని భూమిలోకి ఇంకించే 'రెయిన్ వాటర్ హార్వెస్టింగ్' గుంతలు చాలా చోట్ల పనిచేయకపోవడం లేదా అసలు లేకపోవడం ప్రధాన సమస్య. నీటిని నిల్వ చేసే చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికావడంతో భూగర్భ జలాలు పునరుద్ధరణ కావడం లేదు. హైదరాబాద్‌లోని ఈ పరిస్థితి రాబోయే రోజుల్లో కేప్ టౌన్ వంటి 'డే జీరో' (నీరు పూర్తిగా అయిపోయే రోజు) పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రతి ఇంటిలో వర్షపు నీటి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం, నీటిని పొదుపుగా వాడుకోవడం ద్వారానే మన నగరాన్ని నీటి సంక్షోభం నుంచి కాపాడుకోగలం.

# బర్త్‌డే గ్లోలో మెరిసిన రాయ్ లక్ష్మి...



టాలీవుడ్ అందాల భామ రాయ్ లక్ష్మి తన పుట్టినరోజు వేడుకలను ఎంతో గ్రాండ్‌గా జరుపుకుంటోంది. తాజాగా సోషల్ మీడియాలో ఆమె షేర్ చేసిన బర్త్‌డే ఫోటోలు నెట్టింట సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. సముద్రపు గాలులు, ఆత్మీయుల సమక్షంలో ఆమె చిరునవ్వులు చిందిస్తూ పంచుకున్న ఈ ఫోటోలు చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఆ డ్రెస్సింగ్, ఆ స్టైల్ చూస్తుంటే రాయ్ లక్ష్మి ఈ బర్త్‌డేని ఫుల్ ఎంజాయ్ చేస్తోందని అర్థమవుతోంది. ఆ విశేషాలేంటో చూద్దాం.. రాయ్ లక్ష్మి తన పుట్టినరోజు సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని అద్భుతమైన ఫోటోలను పంచుకుంది. "బర్త్‌డే గ్లో అంటే ఇలాగే ఉంటుంది" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ అభిమానులను ఆకట్టుకుంటోంది. సముద్రపు తీరంలో, ప్రకృతి ఒడిలో ఎంతో ప్రశాంతంగా కనిపిస్తున్న ఆమె ఫోటోలు చూస్తుంటే, వయసు పెరుగుతున్నా ఆమె అందం మాత్రం తగ్గడం లేదనిపిస్తోంది. మే 5న పుట్టిన ఈ భామ, తన సెలబ్రేషన్స్ గ్లింప్స్‌ను తాజాగా షేర్ చేసింది. ఈ ఫోటో షూట్‌లో ఆమె ధరించిన డ్రెస్ ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. రాయ్ లక్ష్మి యాలేమైస్ బ్రాండ్‌కు చెందిన నాడియా ప్రింటెడ్ ఫ్లాక్స్ మాక్సీ డ్రెస్‌లో మెరిసిపోయింది. ఇక ఇది కేవలం డ్రెస్ మాత్రమే కాదు, ప్రముఖ ఆర్టిస్ట్ నాడియా హెర్నాండెజ్ రూపొందించిన ఒరిజినల్ ఆర్ట్‌వర్క్‌తో కూడిన స్పెషల్ కొల్లాబరేషన్ పీస్. రంగురంగుల పూల డిజైన్లు, నాటికల్ ప్రింట్‌తో ఉన్న ఈ స్ట్రాప్‌లెస్ డ్రెస్ ఆమెకు పర్ఫెక్ట్ బీచ్ లుక్‌ను ఇచ్చింది. కేవలం డ్రెస్ మాత్రమే కాదు, ఆమె వాడిన యాక్సెసరీస్ కూడా లుక్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లాయి. డ్రెస్‌కు మ్యాచింగ్‌గా ఉండే పింక్ కలర్ హెడ్ స్కార్ఫ్ కట్టుకుని, డార్క్ సన్ గ్లాసెస్ పెట్టుకుని రాయ్ లక్ష్మి ఒక ఫ్యాషన్ ఐకాన్‌లా కనిపిస్తోంది. ఇక తనకిష్టమైన మనుషుల మధ్య, గ్లాసుల నిండా డ్రింక్స్‌తో, మనసు నిండా సంతోషంతో ఈ బర్త్‌డే జ్ఞాపకాలను ఆమె పదిలం చేసుకుంటోంది. ఫోటోలు షేర్ చేసిన కొన్ని నిమిషాలకే వేల సంఖ్యలో లైకులు, కామెంట్లతో ఇన్‌స్టా షేక్ అవుతోంది. "హ్యాపీ బర్త్‌డే లక్ష్మి" అంటూ నెటిజన్లు విషెస్ చెప్తుంటే, మరికొందరు ఆమె డ్రెస్సింగ్ సెన్స్‌ను మెచ్చుకుంటున్నారు. "జీవితాన్ని ఎలా ఎంజాయ్ చేయాలో రాయ్ లక్ష్మిని చూసి నేర్చుకోవాలి" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక మొత్తం మీద తన 37వ బర్త్‌డేని అత్యంత గుర్తుండిపోయేలా జరుపుకున్నారు ఈ 'ఖైదీ నంబర్ 150' బ్యూటీ. సినిమాల్లోనే కాదు, పర్సనల్ లైఫ్‌లో కూడా రాయ్ లక్ష్మి ఎప్పుడూ ట్రెండీగా ఉండటానికి ఇష్టపడుతుంది. ఈ బర్త్‌డే గ్లింప్స్ ఆమె అభిమానులకు ఒక మంచి ట్రీట్ లాంటిదనే చెప్పాలి. ఇక సముద్రపు అలల మధ్య, తన వాళ్లతో కలిసి ఆమె జరుపుకున్న ఈ వేడుకల ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారాయి.







# షోకేస్‌లో బొమ్మలా మిల్కీ బ్యూటీ

దశాబ్దాలు గడిచినా... పోటీలో ఎందరు తారలు ఉన్నా మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా భాటియా క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు. నేటి తరానికి సవాల్ విసిరే ఈ భామ ఫ్యాషన్ సెన్స్... ఎప్పటికప్పుడు తనను తాను కొత్తగా ఆవిష్కరించుకునే తీరు తమన్నాను అగ్రస్థానంలో నిలబెడుతున్నాయి. ముంబై నుంచి టాలీవుడ్ వరకు సాగిన ఈ బ్యూటీ ప్రయాణంలో ఎన్నో పరిణతి చెందిన పాత్రలతో ప్రేక్షకులను మైమరిపించింది. ప్రస్తుతం తెలుగు, తమిళంతో పాటు బాలీవుడ్‌లోనూ వరుస ప్రాజెక్టులతో ఈ మిల్కీ బ్యూటీ బిజీగా గడుపుతోంది. ఇటీవల ప్రముఖ డిజైనర్ రాహుల్ మిశ్రా రూపొందించిన ఐవరీ పర్ల్ కేప్ డ్రెస్‌లో తమన్నా మెరిసిన తీరు ఫ్యాషన్ ప్రపంచాన్ని అబ్బురపరిచింది. ముత్యాల మధ్య మంచి ముత్యంలా మిల్కీ లుక్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కోర్సెట్–స్టైల్ బాడీస్ – ముత్యాలతో అలంకరించిన కేప్ తమన్నాకు ఒక ప్రత్యేకమైన హుందాతనాన్ని తెచ్చిపెట్టాయి. ఈ అవుట్‌ఫిట్‌లో తమన్నా షోకేస్‌లో ఉంచిన అందమైన బొమ్మలా కనిపిస్తూ ఫ్యాషన్ ప్రియుల నీరాజనాలు అందుకుంటోంది. తమన్నా మేకప్ – స్టైలింగ్ కూడా ఈ లుక్‌కు మరింత అందాన్ని జోడించాయి. సింపుల్ మేకప్, లూజ్ వేవీ హెయిర్‌స్టైల్.. మెరిసే తెల్లటి హీల్స్ తమన్నాలోని యూనిక్ నెస్‌ని ఎలివేట్ చేశాయి. కేవలం అందం మాత్రమే కాదు... తన ఆహార్యంలో తమన్నా చూపే వైవిధ్యం తనను గ్లోబల్ ఐకాన్‌గా మారుస్తోంది. రెండు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో తమన్నా సాధించిన ఈ ఎత్తు కచ్చితంగా తన పట్టుదలకు... ఫ్యాషన్ పై తనకు ఉన్న అభిరుచికి నిదర్శనం తమన్నా ప్రస్తుత సినిమా విషయానికి వస్తే.. ఈ సంవత్సరం తమన్నా కెరీర్‌లో అత్యంత కీలకమైనదిగా మారుతోంది. తమన్నా నటించిన ఓ రోమియో ఫిబ్రవరిలో విడుదలైన సంగతి తెలిసిందే. షాహిద్ సరస నటించిన ఈ చిత్రానికి మిశ్రమ స్పందనలు వచ్చినా... తమన్నా గ్లామర్ కి మంచి గుర్తింపు దక్కింది. తదుపరి ఆగస్టులో విడుదల కానున్న వివాన్ – ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్–, అజయ్ దేవగన్ తో చేస్తున్న –రేంజర్–పై చాలా ఆశలే పెట్టుకుంది. రేంజర్ డిసెంబర్ 4న విడుదల కానుంది. వీటితో పాటు తమిళంలో యేన్ ఎంద్రు కాదల్ ఎన్బెన్, పురుషన్ లాంటి చిత్రాలలో నటిస్తోంది.

# రెండు సినిమాలకే సూపర్‌స్టార్లా?

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యంత అదృష్టవంతురాలైన కథానాయికగా అమీషా పటేల్‌ను అభివర్ణించవచ్చు. బాలీవుడ్ డెబ్యూ కహో నా ప్యార్ హై... టాలీవుడ్ ఎంట్రీ బద్రి చిత్రాలతో ఈ పంజాబీ బ్యూటీ కెరీర్ భారీ బ్లాక్ బస్టర్లతో ప్రారంభమైంది. ఆ తర్వాత దశాబ్ద కాలం పాటు దక్షిణాది, ఉత్తరాది అనే తేడా లేకుండా అగ్ర హీరోల సరసన నటిస్తూ బిజీ నాయికగా వెలిగారు. సుదీర్ఘ విరామం తర్వాత సన్నీ డియోల్‌తో నటించిన గదర్ – 2 బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సంచలనం సెకండ్ ఇన్నింగ్స్ లోను సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రస్తుతం 50 ఏళ్ల వయసులోను అమీషా తన సెకండ్ ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇటీవల సోషల్ మీడియా వేదికగా అమీషా పటేల్ నేటితరం నటీమణులపై చేసిన వ్యాఖ్యలు చిత్ర పరిశ్రమలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కేవలం పీఆర్ బృందాల ద్వారా సృష్టించుకునే కృత్రిమమైన స్టార్‌డమ్ శాశ్వతం కాదని ఘాటుగా విమర్శించారు. ఏడాదికి ఒకటి రెండు యావరేజ్ సినిమాల్లో నటిస్తూ తమను తాము సూపర్‌స్టార్లుగా ప్రచారం చేసుకోవడం వల్ల ప్రయోజనం లేదని హితవు పలికారు. నిజమైన స్టార్‌డమ్ అనేది బాక్సాఫీస్ వద్ద సృష్టించే ప్రభంజనంపై ఆధారపడి ఉంటుందని.. కేవలం షూటింగ్ సెట్లలో ఉండటం వల్ల ఎవరూ స్టార్లు కాలేరని కాస్త ఘాటుగానే విమర్శించారు. ముఖ్యంగా బాక్సాఫీస్ లెక్కల విషయంలో అమీషా తనదైన విశ్లేషణను వినిపించారు. 2026 నాటికి 100 కోట్ల వసూళ్లు సాధించడం అనేది ఒక పెద్ద విషయం కాదని.. కనీసం ఒక్క సినిమా కూడా 200 కోట్లు రాబట్టని వారు నంబర్ 1, నంబర్ 2 స్థానాల కోసం పీఆర్ బృందాలకు డబ్బులు ఇచ్చి ప్రచారం చేయించుకోవడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. తన కెరీర్‌లో కహో నా ప్యార్ హై, గదర్ 1,గదర్ 2 వంటి మూడు చారిత్రాత్మక సోలో బ్లాక్ బస్టర్లను అందించానని.. అవి తన సహనటుల కెరీర్‌లో కూడా బిగ్గెస్ట్ హిట్స్ అని అమీషా గుర్తు చేశారు. ఇతర నటీమణులలా తనకు ఫేక్ పీఆర్ మెషినరీ లేకపోవడం వల్లే తన విజయాల గురించి తక్కువ చర్చ జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమీషా పటేల్ కేవలం సినిమా విషయాలకే పరిమితం కాకుండా.. అంతర్జాతీయ ఉద్రిక్తతలపైనా ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ – యుఏయు యుద్ధం కారణంగా న్యూయార్క్ నుంచి ముంబైకి రావాల్సిన తాను ముప్పు తిప్పల గురించి ప్రస్తావించారు. న్యూయార్క్ నుంచి వస్తుండగా యుఏఇపై క్షిపణి దాడి కారణంగా తన విమానాన్ని దారి మళ్లించారని ఒమన్ లో 24 గంటల పాటు చిక్కుకు పోయానని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ భౌగోళిక రాజకీయ పరిస్థితులు సామాన్యుల ప్రయాణాలను ఎంతగా ఇబ్బంది పెడుతున్నాయో వివరిస్తూ.. ఈ యుద్ధాలు ఎప్పుడు ముగుస్తాయోనని కలత చెందారు.



# కిరణ్ అబ్బవరంది ఓవర్ కాన్ఫిడెన్సా? లేక గట్సా?

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కెరీర్ ఇప్పుడు ఆసక్తికరమైన మలుపు వద్ద నిలిచింది. హీరోగా వరుస ప్రయత్నాలు చేస్తూనే నిర్మాతగా మారి చేసిన తిమ్మరాజుపల్లి టీవీ ఆశించిన స్థాయిలో ఫలితం ఇవ్వలేదు. రిలీజ్‌కు ముందు టీమ్ భారీ స్థాయిలో ప్రమోషన్స్ చేస్తూ ఇది అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని చెప్పినా, థియేటర్లలో మాత్రం ఆ హడావిడి నిలబడలేదు. మొదటి మూడు రోజులు వచ్చిన బజ్ నాలుగో రోజుకే తగ్గిపోవడం, పబ్లిక్ టాక్ మిక్స్ గా మారడం సినిమాపై నెగటివ్ ప్రభావం చూపించింది. నాన్ థియేట్రికల్ డీల్స్ వల్ల నిర్మాతగా కిరణ్ సేఫ్ అయ్యాడనే మాటలు వినిపించినా, ప్రేక్షకుల తీర్పులో మాత్రం అది విజయంగా నిలవలేదు. అయితే ఇక్కడే చాలామంది వెనక్కి తగ్గే పరిస్థితుల్లో కిరణ్ మాత్రం మరో పెద్ద రిస్క్‌కు సిద్ధమవడం ఇండస్ట్రీలో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం కిరణ్ తన కొత్త ప్రాజెక్ట్ రియాలిటీ అనే సినిమాతో డైరెక్టర్ గా మారేందుకు రెడీ అవుతున్నాడు. రియల్ లైఫ్ ఇన్సిడెంట్స్, నిజమైన మనుషుల ఎమోషన్స్ ఆధారంగా రూపొందనున్న ఈ సినిమాను మే చివరి వారం నుంచి ప్రారంభించే ప్లాన్‌లో ఉన్నట్టు సమాచారం. భీమ్స్ సిసిరోలియో సంగీతంలో ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా మొదలయ్యాయి. చిన్న సినిమాల్లో మ్యూజిక్ ఎంత




కీలకమో గతంలో చాలాసార్లు రుజువైంది. ముఖ్యంగా ఎమోషనల్ లేదా రియలిస్టిక్ డ్రామాలకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బలంగా ఉంటే ప్రేక్షకుల్లో కనెక్ట్ పెరుగుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని కిరణ్ ముందుగానే మ్యూజిక్‌పై ఫోకస్ పెట్టడం విశేషం. అయితే అసలు ప్రశ్న మాత్రం ఒకటే, ఆల్రెడీ రచయితగా తన ముద్ర వేసిన కిరణ్, ఇప్పుడు డైరెక్టర్ గా కూడా అదే స్థాయి ఇంపాక్ట్ చూపగలడా అన్నది. ఎస్ఆర్ కళ్యాణమండపం సినిమా టైమ్ లో స్టోరీ, ఎమోషన్స్, సీన్స్ విషయంలో కిరణ్ చూపించిన ఇన్‌వాల్వ్‌మెంట్‌కు మంచి ప్రశంసలొచ్చాయి. ఆ సినిమాతో రైటింగ్ పరంగా తనకు మంచి టాలెంట్ ఉందని నిరూపించుకున్నాడు. ఇప్పుడు అదే ఎక్స్‌పీరియెన్స్ ను డైరెక్షన్ లోకి మార్చే ప్రయత్నం చేస్తున్నాడు కిరణ్. అయితే రైటర్‌గా సక్సెస్ కావడం ఒక విషయం అయితే, మెగా ఫోన్ పట్టుకుని మొత్తం సినిమాను నడిపించడం పూర్తిగా వేరే సవాల్. అందుకే రియాలిటీ మూవీ కిరణ్ కెరీర్ కు టర్నింగ్ పాయింట్ మూవీగా మారే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ జెనరేషన్ హీరోల్లో చాలా మంది రైటింగ్ లో భాగస్వామ్యం అవుతున్నా, డైరెక్షన్ బాధ్యతను భుజాలపై వేసుకోవడానికి మాత్రం ముందుకు రావడం లేదు. అలాంటి సమయంలో కిరణ్ అబ్బవరం తీసుకున్న ఈ డెసిషన్ కాస్త రిస్క్ అనే చెప్పొచ్చు. ఈ నేపథ్యంలోనే కిరణ్‌ది కాన్ఫిడెన్సా లేక కంటెంట్, తనపై తనకున్న గట్సా? అని అందరూ చర్చించుకుంటున్నారు. తిమ్మరాజుపల్లి టీవీ రిజల్ట్ తర్వాత కూడా కిరణ్ వెనక్కి తగ్గకుండా ముందుకు రావడం కొందరికి ధైర్యంగా కనిపిస్తుంటే, మరికొందరికి అది డేరింగ్ స్టెప్ గా అనిపిస్తోంది. కానీ సినీ పరిశ్రమలో చాలా సార్లు ఫెయిల్యూర్లే కొత్త మార్గాలు చూపించిన దాఖలాలున్నాయి. మరి ఇప్పుడు రియాలిటీతో కిరణ్ అబ్బవరం ఆ పాఠాలను సక్సెస్ గా మార్చుకుంటాడా? లేక మరో కొత్త పరీక్షను ఎదుర్కొంటాడా? అన్నదే ఆసక్తిగా మారింది.

# ఆదాయంలో విశాఖ రికార్డ్

విశాఖపట్టణం : రాష్ట్ర ఆర్థిక రాజధానిగా విశాఖపట్నం సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. రూ. 1,61,009 కోట్ల జీడీపీతో విశాఖ సత్తా చాటింది. కలెక్టర్ల సదస్సులో ఈ మేరకు ప్రభుత్వం నివేదిక విడుదల చేసింది. ఇందులో పలు ఆసక్తికర అంశాలు ఉన్నాయి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, జిల్లా స్థాయి పురోగతి, డేటా ఆధారిత పరిపాలన, స్వర్ణ ఆంధ్ర – 2047 దార్శనికత అమలుకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం వెల్లడించారు. స్వర్ణ ఆంధ్ర – 2047 విజన్ కింద రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించింది. 2047 నాటికి రాష్ట్ర జీఎస్డీపీని రూ. 308 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలకు చేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను అమలు చేస్తోంది. ఈ లక్ష్యాల సాధనకు మార్గదర్శకంగా “పది సూత్రాలు” మిషన్ ఫ్రేమ్‌వర్కును అమలులోకి తీసుకువచ్చారు. అభివృద్ధి పురోగతిని నిరంతరం కొలిచేందుకు 651 కీలక పనితీరు సూచికలతో కూడిన సమగ్ర డ్యాష్‌బోర్డును రూపొందించారు. ఇందులో 232 ఆర్థిక సూచికలు, 304 పాలన సూచికలు, 115 సామాజిక?సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన సూచికలు ఉన్నాయి. జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిల వరకు నెలవారీ పనితీరు నివేదికలను ప్రవేశపెట్టి, అభివృద్ధి ఫలితాలను క్రమబద్ధంగా పర్యవేక్షించే వ్యవస్థను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇక సదస్సులో 2025?26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం రూ.17.62 లక్షల కోట్ల జీఎస్డీపీతో 10.75% వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించారు. దేశ సగటుతో పోలిస్తే ఇది గణనీయమైన పురోగతిగా పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగం 7.83% వృద్ధిని నమోదు చేయగా, చేపల పెంపకం రంగం 19.07% వృద్ధితో అత్యుత్తమ పనితీరు కనబరిచింది. నిర్మాణ రంగం 13.05%, కమ్యూనికేషన్స్ రంగం 17.05%, బ్యాంకింగ్ ఌ భీమా రంగం 15.45% వృద్ధిని సాధించాయి. పరిశ్రమల రంగం మొత్తం మీద 9.53%, సేవల రంగం 12.94% వృద్ధిని నమోదు చేశాయి. ఈ పురోగతి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని సూచిస్తున్నదని అధికారులు వివరించారు. మరోవైపు జిల్లాల వారీగా పరిశీలిస్తే, బాపట్ల జిల్లా 19.19% వృద్ధితో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. విశాఖపట్నం జిల్లా రూ.1,61,009 కోట్ల జీడీపీతో రాష్ట్ర ఆర్థిక కేంద్రంగా నిలిచింది. తలసరి ఆదాయంలో కూడా రూ.6.58 లక్షలతో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఎన్టీఆర్, కృష్ణా, తిరుపతి, ఏలూరు జిల్లాలు కూడా మంచి ఆర్థిక పురోగతిని నమోదు చేశాయి. మరోవైపు, అన్నమయ్య జిల్లా మైనస్ 1.35% ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. దీంతో ఆ జిల్లాపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో తక్కువ తలసరి ఆదాయం నమోదవడం ప్రాంతీయ అసమానతలను సూచిస్తున్నదని అభిప్రాయం వ్యక్తమైంది.. మరో 3 పార్టీల మద్దతు ఇదే సమయంలో 2026?27 సంవత్సరానికి మరింత ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించారు. జీఎస్డీపీని రూ.20.36 లక్షల కోట్లకు పెంచి 15.53% వృద్ధి సాధించాలన్నది ప్రధాన లక్ష్యం. వ్యవసాయ, అనుబంధ రంగం 14.04%, పరిశ్రమల రంగం 17.47%, సేవల రంగం 15.80% వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపరంగాల వారీగా చూస్తే, చేపల పెంపకం రంగానికి 20.66%, నిర్మాణ రంగానికి 20.5%, మైనింగ్‌కు 18%, తయారీ రంగానికి 15.5%, వాణిజ్యం?హోటళ్లు?రెస్టారెంట్లకు 16.5%, బ్యాంకింగ్, బీమా రంగాలకు16% వృద్ధి లక్ష్యాలను నిర్ణయించారు. తలసరి ఆదాయాన్ని రూ.2,94,507 నుంచి రూ. 3,39,404కు పెంచి 15.24% వృద్ధిని సాధించాలన్నది మరో కీలక లక్ష్యంగా పేర్కొన్నారు. 2025?26లో నమోదైన 10.75% జీఎస్డీపీ వృద్ధి రాష్ట్రానికి బలమైన ఆర్థిక పునాదిని అందించగా, 2026?27లో 15.53% వృద్ధి లక్ష్యం సాధించదగినదిగా సదస్సు విశ్వాసం వ్యక్తం చేసింది. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నెలవారీ పనితీరు ట్రాకింగ్, విలువ జోడింపు, ఌఎ ఆధారిత పరిపాలన, కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలు, డేటా ఆధారిత నిర్ణయ వ్యవస్థలు కలిసి స్వర్ణ ఆంధ్ర – 2047 దిశగా రాష్ట్రాన్ని స్థిరమైన, సమగ్ర, వేగవంతమైన అభివృద్ధి మార్గంలో ముందుకు నడిపిస్తున్నాయని సదస్సు స్పష్టం చేసింది.

# యూత్ టార్గెట్ గా మహానాడు

నెల్లూరు : తెలుగుదేశం పార్టీ పసుపు పండుగ ఈనెల ఆఖరిలో జరగనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు కూడా వడివడిగా సాగుతున్నాయి. ఈ సారి ఉత్తరాంధ్రకు ప్రాధాన్యం ఇస్తూ.. శ్రీకాకుళం జిల్లాలో మహానాడు నిర్వహించాలన్నది టిడిపి ప్రధాన ఉద్దేశం. ఈ క్రమంలో ఇప్పటికే ఏర్పాట్లు కూడా వడివడిగా సాగుతున్నాయి. అయితే ఈ మహానాడుకు చాలా ప్రత్యేకత ఉంది. టిడిపిలో ఇప్పటివరకు జరిగిన మహానాడులు వేరు. ఇప్పుడు జరుగుతున్న మహానాడు వేరు అనేది పార్టీలో నాయకులు చెబుతున్నారు. ఈ దఫా యువనాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. మహానాడులో ఈసారి మొత్తం నారా లోకేష్ ప్రభావం కనిపిస్తుందని అదేవిధంగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన యువనాయకత్వానికి ఎక్కువ అవకాశం కల్పిస్తారని ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా ఈసారి విధానపరమైన నిర్ణయాలు పార్టీ పరంగా భవిష్యత్తు వ్యవహారాలు వంటి అంశాల్లో కీలకమైన అంశాలను నారా లోకేష్ నేతృత్వంలోని కమిటీ కి అప్ప చెబుతారని సమాచారం. ముఖ్యంగా.. పార్టీ భవిష్యత్తు వ్యూహాలు ఈ దఫా యువతను టార్గెట్గా చేసుకొని ఉంటాయని కూడా అంటున్నారు. అయితే ఇవన్నీ పర్యవేక్షించేందుకు, పరిశీలించేందుకు లోకేష్ నేతృత్వంలో మహానాడు వేదికగా ఒక కమిటీ ఏర్పాటు అవుతుందని కూడా సమాచారం. అదేవిధంగా ఈ దఫా మహానాడులో యువత ఎక్కువగా ప్రసంగించేలా వారికి ఎక్కువ ప్రాధాన్యం ఉండేలా కూడా వ్యవహరిస్తున్నారన్నది పార్టీలో జరుగుతున్న చర్చ. భవిష్యత్తు అంతా యువనాయకత్వానిదే కాబట్టి ఈసారి మార్గదర్శకానికి మాత్రమే సీనియర్లు పరిమితం కానున్నారు. యువతకు ఎక్కువ అవకాశం కల్పించడం ద్వారా వారి ఆలోచనలను పంచుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా ప్రభావం చూపించాలి అనేది టిడిపి లక్ష్యంగా కనిపిస్తుంది.

ఈ క్రమంలోనే పార్టీ పరంగా ఎలా ఉన్నప్పటికీ యువతకు మెజారిటీ అవకాశాలు కల్పించాలని మహానాడు నిర్దేశిస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఏం జరుగుతుందనేది చూడాలి. ప్రస్తుతానికైతే మహానాడు వేదికగా యువతకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ఆమేరకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి యువతకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని నిర్ణయించుకున్న దరిమిలా.. ఈ మేరకు మహానాడుతోనే శ్రీకారం చుట్టనున్నారని సీనియర్‌లు చెబుతున్నారు.

# పిఠాపురం నుంచే బాబు స్టార్ట్

## – తమ్ముళ్లకు వార్నింగ్



కాకినాడ : పర్సనల్ ఎజెండాలు వద్దు. మీ అభిప్రాయాలు పార్టీ మీద నెట్టొద్దు. కూటమి ముఖ్యం. పార్టీకే ప్రాధాన్యం. ఇది అర్థం చేసుకుంటే బెటర్. లేకపోతే సీరియస్ యాక్షన్ ఉంటుంది. ఇక మీ ఇష్టమంటూ లీడర్లకు, క్యాడర్‌కు ఎన్నోసార్లు క్లియర్ కట్ ఇండికేషన్ ఇస్తూ వచ్చారు సీఎం చంద్రబాబు. పై స్థాయిలో పవన్‌తో తనకు మంచి రిలేషన్ ఉంది..కలిసే ఉంటాం..కలిసే నడుస్తాం ఫిక్స్ అయిపోండని కూడా చెప్పేశారు. ఎక్కడా ఎలాంటి తేడాలు రావడానికి వీల్లేదని పలుసార్లు హెచ్చరించారు కూడా. కొందరు నేతల తీరుతో కూటమి డిస్ట్రబ్ అయ్యే పరిస్థితి వస్తే ఊరుకునేది లేదని చెప్పిన చంద్రబాబు..అన్నంత పని చేశారు.ఏకంగా పార్టీకి లాయలిస్ట్‌గా, సిన్సియర్ కార్యకర్తగా పేరున్న వర్మను పిఠాపురం ఇంచార్జ్ పదవి నుంచి తప్పించి షాక్ ఇచ్చారు చంద్రబాబు. ఆ్రలెడీ పార్టీ కార్యవర్గ సభ్యుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో కూడా ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చి చర్చకు దారితీశారు. ఫ్లెక్సీలు, ఫెక్సీలో ఫోటో కోసం గొడవేంటి అంటూ ఇండైరెక్ట్ గా వర్మకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పుడు ఏకంగా ఆయన్ను పార్టీ ఇంచార్జ్ పదవి నుంచి తొలగించారు. అయితే తనను పిఠాపురం బాధ్యతల నుంచి తప్పించడంపై స్పందించిన వర్మ..పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. వర్మ. ఫక్తు టీడీపీ కార్యకర్త. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా..పవర్‌లో ఉన్నా..వర్మది వన్ లైన్ ఎజెండా..పార్టీ కోసం పని చేయడమే. అయితే గత ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా పిఠాపురం సీటును జనసేన చీఫ్ పవన్ కల్యాణ్‌కు ఇచ్చారు. అప్పుడే వర్మ తన అసంతృప్తిని వ్యక్తం చేయడంతో..చంద్రబాబుతో సహా లోకేశ్ సర్దిచెప్పి భవిష్యత్‌పై భరోసా ఇచ్చారు. ఫ్యూచర్‌లో ఎమ్మెల్సీ లేకపోతే మరేదైనా ఆ స్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పోస్ట్ ఇస్తామని కూడా హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్లుగానే అధిష్టానం మాటకు కట్టుబడి పవన్ కోసం ప్రచారం చేశారు వర్మ. ఆయన ఫ్యామిలీ కూడా పవన్ గెలుపు కోసం హార్ట్ ఫుల్‌గా క్యాంపెయిన్ చేసింది. ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడ్డాక వర్మకు ఏదో ఒక పదవి ఇస్తారన్న టాక్ నడిచింది. మధ్యలో ఇద్దరు గన్‌మెన్‌లను కూడా ఇచ్చింది ప్రభుత్వం. కానీ ఇప్పటివరకు ఆయనకు ఏ పదవి దక్కలేదు. దీంతో రానురాను వర్మలో అసంతృప్తి బయటపడుతూ వచ్చింది.తనకు ఏ పదవి దక్కలేదన్న అసంతృప్తితో..ఇంటెన్షన్ వేరు..బరస్ట్ అవుతున్నది అందుకోసం కాదు అన్నట్లుగా ఎప్పుడూ ఏదో ఒక ఇష్యూతో వార్తల్లో ఉంటూ వచ్చారు. పిఠాపురంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో చంద్రబాబు ఫోటోను చిన్నగా వేశారని ఓసారి అధికారులపై సీరియస్ అయ్యారు వర్మ. మరోసారి పిఠాపురం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఫ్లెక్సీలో సీఎం ఫోటో లేదంటూ రాద్ధాంతం చేశారు. జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో మాటల యుద్ధం నడిచింది. దీంతో కూటమిలో కుతకుతలతో..పవన్ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతలకు పొసగట్లేదన్న వార్తలు హల్‌చల్ చేశాయి. ఇక ఇలా చూసుకుంటే పోతే మొదటికే మోసం వస్తుందని భావించిన సీఎం చంద్రబాబు..కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు. వర్మ పార్టీ కోసం పని చేసిన సిన్సియర్ కార్యకర్తే అయినా..ప్రస్తుత పరిస్థితుల్లో కూటమికే చంద్రబాబు ప్రయారిటీ ఇస్తున్నారన్నది ఓపెన్ సీక్రెట్ అయిపోయింది.వార్తా సేవలుఅయితే ఒక్క పిఠాపురంలోనే కాదు..రాష్ట్రంలో పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నేతల మధ్య పొసగట్లేదు. కొన్ని చోట్ల అయితే టీడీపీ ఎమ్మెల్యేలు టంగ్ స్లిప్ అవుతూ పార్టీకి తలనొప్పులు తెచ్చిపెడుతున్న పరిస్థితి. ఇలా అన్ని గమనించిన చంద్రబాబు..పిఠాపురం నుంచే ఆపరేషన్ స్టార్ట్ చేశారన్న టాక్ వినిపిస్తోంది. వర్మ లాంటి నేతకే షాక్ ఇచ్చారనే ఇండికేషన్ ఒకటి అయితే..పవన్‌కు, కూటమికి చంద్రబాబు ఇస్తున్న ప్రయారిటీ కూడా ఎక్స్‌పోజ్ చేసినట్లు అయిందన్న చర్చ జరుగుతోంది. ఇప్పుడు పదవి నుంచి తప్పించింది వర్మనే అయినా..ఈ సెగ అందరికీ తాకేలా చేయాలన్నదే బాబు ఆలోచనగా చెప్పుకుంటున్నారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన, బీజేపీ కూడా ఇలాగే సైడ్ ట్రాక్ పడితే ఇంతే స్ట్రిక్ట్‌గా బిహేవ్ చేసేలా బాబు రూట్‌మ్యాప్ వేశారని చర్చించుకుంటున్నారు. ఏదేమైనా పిఠాపురం వర్మ విషయంలో బాబు తీసుకున్న డెసిషన్ అయితే పొలిటికల్ హాట్ టాపిక్‌గా మారింది.

# రూ.2,200 కోట్లతో రాయల్ ఎన్‌ఫీల్డ్ మెగా ప్లాంట్!

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. ఐకానిక్ మోటార్‌సైకిల్ బ్రాండ్ రాయల్ ఎన్‌ఫీల్డ్, తన భారీ మెగా ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. సుమారు రూ. 2,200 కోట్ల పెట్టుబడితో తిరుపతి జిల్లా సత్యవేడులో ఈ తయారీ కేంద్రాన్ని నెలకొల్పుతున్నారు. 1901లో సంస్థ ప్రారంభమైన తర్వాత, తమిళనాడు వెలుపల ఇంతటి భారీ స్థాయిలో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి కావడం విశేషం.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్లాంట్ ద్వారా కేవలం మోటార్‌సైకిళ్ల తయారీ మాత్రమే కాకుండా, ఒక భారీ వెండర్ పార్క్ కూడా అభివృద్ధి చెందనుంది. దీనివల్ల రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు విడిభాగాలు సరఫరా చేసే అనుబంధ సంస్థలు కూడా ఆంధ్రప్రదేశ్‌కు తరలి రానున్నాయి. ఇది సత్యవేడును ప్రపంచ స్థాయి ఆటోమొబైల్ క్లస్టర్‌గా మార్చనుందిఈ ప్లాంట్ ప్రారంభం కావడంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం దాదాపు 9 లక్షల యూనిట్లు పెరగనుంది. దీంతో దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఎగుమతులలో కూడా సంస్థ మరింత దూసుకెళ్లే అవకాశం కనిపిస్తోంది.

ప్రాజెక్టు కోసం సత్యవేడు మండలంలోని వన్నెలూరు గ్రామంలో 233.76 ఎకరాలు, రాళ్ళకుప్పం గ్రామంలో 42.38 ఎకరాలు కలిపి మొత్తం 267 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.మొదటి దశలో ప్రధాన తయారీ యూనిట్‌తో పాటు ప్రత్యేక వెండర్ పార్క్‌ను కూడా అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు. దీనివల్ల రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు అనుబంధంగా ఉన్న సరఫరాదారులు, భాగాల తయారీ సంస్థలు కూడా ఏపీకి తరలివచ్చే అవకాశముంది. దీని ఫలితంగా సత్యవేడు ప్రాంతం భవిష్యత్తులో ప్రపంచ స్థాయి ఆటోమొబైల్ తయారీ క్లస్టర్‌గా రూపుదిద్దుకునే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

ప్రాజెక్టు తొలి దశను 2029 నాటికి, రెండో దశను 2032 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీర్ఘకాలిక పారిశ్రామిక వ్యూహంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది కీలక ఫలితంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ విస్తరణతో రాయల్ ఎన్‌ఫీల్డ్ తన దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఎగుమతులను కూడా గణనీయంగా పెంచుకోనుంది.

”రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి గ్లోబల్ బ్రాండ్ ఏపీని ఎంచుకోవడం రాష్ట్ర వ్యాపార అనుకూల వాతావరణానికి నిదర్శనం. ఇది రాష్ట్రాన్ని అడ్వాన్స్‌డ్ మానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతుంది” అని ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.దక్షిణ ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా మరో మెట్టు ఎక్కించే ఈ ప్రాజెక్టు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలవనుంది.

కియా మోటార్స్ తర్వాత ఆటోమొబైల్ రంగంలో ఏపీ సాధించిన మరో అతిపెద్ద విజయం ఇది. సత్యవేడు కేంద్రంగా రాయల్ ఎన్‌ఫీల్డ్ చేసే ప్రయాణం ఏపీ పారిశ్రామిక భవిష్యత్తును సరికొత్త శిఖరాలకు చేరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు

# ఫేక్ న్యూస్ కేసుల్లో ఏపీ టాప్

విజయవాడ : 2024 సంవత్సరంలో దేశవ్యాప్తంగా మొత్తం 483 ఫేక్ న్యూస్ కేసులు నమోదవగా.. అందులో 203 కేసులు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే నమోదయ్యాయి. దీంతో ఫేక్ న్యూస్ కేసుల్లో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణలో 139 కేసులు నమోదయ్యాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు కలిపి దేశవ్యాప్తంగా నమోదైన ఫేక్ న్యూస్ కేసుల్లో దాదాపు 70 శాతం వాటాను కలిగి ఉండటం గమనార్హం. సోషల్ మీడియాలో రాజకీయ అంశాలపైనే కాకుండా మతపరమైన అంశాలు, సామాజిక వివాదాలు, సాధారణ ఘటనలపైనా తప్పుడు ప్రచారాలు భారీగా పెరిగినట్లు నివేదికలో వెల్లడైంది. ఫేక్ పోస్టులు, మోర్ఫింగ్ వీడియోలు, తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో గందరగోళం సృష్టించే ఘటనలు అధికమయ్యాయని నేషనల్ క్రైం బ్యూరో రికార్డ్స్ పేర్కొంది.ఇక సైబర్ నేరాల విషయంలోనూ ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. 2024లో రాష్ట్రంలో మొత్తం 2,528 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే సైబర్ నేరాలు 8 శాతం పెరిగినట్లు నివేదిక తెలిపింది. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ యాప్స్, సోషల్ మీడియా బ్లాక్‌మెయిలింగ్, డిజిటల్ ఫ్రాడ్స్ పెరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం నేరాల పరంగా కూడా ఏపీలో పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2024లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,16,076 కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా హింసాత్మక నేరాలు భారీగా పెరిగినట్లు నివేదికలో వెల్లడైంది.మహిళలపై నేరాల విషయంలో కూడా ఆంధ్రప్రదేశ్ టాప్ రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించే నేరాల్లో రాష్ట్రంలో 2,965 కేసులు నమోదయ్యాయి. మహిళల వేధింపుల కేసుల్లో దేశంలో మూడో స్థానంలో ఏపీ నిలవడం ఆందోళన కలిగిస్తోంది.మానవ అక్రమ రవాణా కేసుల్లోనూ ఆంధ్రప్రదేశ్ దేశంలో మూడో స్థానంలో నిలిచినట్లు ఔఅఖీః పేర్కొంది. మరోవైపు 2024లో రాష్ట్రంలో మొత్తం 898 హత్య కేసులు నమోదయ్యాయి. అంటే సగటున రోజుకు రెండు నుంచి మూడు హత్యలు జరుగుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.రోడ్డు ప్రమాదాల విషయంలో కూడా ఏపీ దేశంలో 9వ స్థానంలో నిలిచింది. పెరుగుతున్న ప్రమాదాలు, నిర్లక్ష్య డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు ప్రధాన కారణాలుగా అధికారులు భావిస్తున్నారు. ఔఅఖీః నివేదికతో రాష్ట్రంలో సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, హింసాత్మక ఘటనలపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది.

# కూటమి గూటికి వైసీపీ ఎమ్మెల్యేలు


విజయవాడ : ప్రస్తుతం కూటమిలో ఎమ్మెల్యేలుగా ఉన్న వారిలో కొంత మంది వైసీపీకి టచ్ లో ఉన్నారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇటీవల వైసిపి నాయకులు సైతం అవును... కొందరు టచ్ లో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. దీంతో ఇది వాస్తవమేనా.. అసలు ఆ పరిస్థితి ఎందుకు వస్తుంది.. అనేది రాజకీయంగా ఆసక్తిగా మారింది. నిజానికి ఇలాంటి పరిస్థితి ఉంటుందని ఎవరూ ఊహించరు. కానీ రాష్ట్రంలో కొంతమంది ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో అలాంటి వారిని వైసిపి నాయకులు తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు అయితే చేస్తున్నారు..కానీ ఎవరూ ఈ విషయంలో బయటపడటం లేదు. వచ్చే ఎన్నికల నాటికి కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచేలా వైసిపి చేస్తున్న ప్రయత్నాల నేపథ్యంలోనే ఇప్పుడు కొంత మంది ఎమ్మెల్యేలు తమ వైపు ఉన్నారని చెబుతుండడం ఆసక్తిగా మారింది. అయితే, ఇప్పటికిప్పుడు దీనివల్ల ఇటు కూటమికి వచ్చిన నష్టం కానీ అటు వైసిపికి వచ్చిన లాభంగానీ ఏమీ కనిపించడం లేదు. ఇది కేవలం ప్రచారం మాత్రమే. ఇది ఒక రకంగా ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న పరోక్ష వ్యతిరేక ప్రచారంగా కూడా పరిశీలకులు భావిస్తున్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని.. పాలనకు కూడా వ్యతిరేకంగా ఉన్నారని.. చెప్పడం ద్వారా ప్రభుత్వాన్ని పలుచన చేసే పరిస్థితి ఏర్పడుతుంది. అటు సీమ నుంచి ఇటు ఉత్తరాంధ్ర వరకు కొంతమంది ఎమ్మెల్యేల పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వంలో ఉన్నప్పటికీ వారు అసంతృప్తితోనే ఉన్నారు. ఈ విషయంపై పార్టీలోనూ ప్రభుత్వంలోనూ చర్చ కూడా నడుస్తోంది. ఇది ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. బిజెపిలో ఆదినారాయణ రెడ్డి నుంచి జనసేనలో లోకం మాధవి వరకు కూడా చాలామంది అసంతృప్తితో ఉన్నారు. ఇక, టిడిపిలో ఈ సంఖ్య మరీ ఎక్కువగా ఉంది. అయితే, ఎప్పటికప్పుడు ఆయా పార్టీలు నేతలతో మాట్లాడుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితిని చక్కదిద్దుకునే దిశగా పని చేస్తున్నారు. కలివిడిగా ముందుకు సాగాలని చెబుతున్నారు. దీంతో తరచుగా వస్తున్న విభేదాలు ఒకింత సమస్యగా మారే పరిస్థితి ఏర్పడింది. కానీ, ఈ సమయంలోనే వైసీపీ ఇలాంటి నేతలను తమ వైపు ఉన్నారని చెప్పుకోవడం ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తుందన్న వాదన బలంగా వినిపిస్తోందిఇది నిజం కాదని, కొంతమందిలో అసంతృప్తి ఉన్న మాట వాస్తవమేనని అయినంత మాత్రాన వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నట్టు కాదని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఇక జనసేనలోనూ ఈ తరహా చర్చ నడుస్తున్నప్పటికీ ఎవరు పార్టీ వదిలేసి వెళ్లే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. బిజెపిలో ఈ విషయంపై నాయకులు మౌనంగా ఉన్నారు. ముఖ్యంగా ఆదినారాయణ రెడ్డి వంటి సీనియర్ నాయకుడి వ్యవహారంలో ఎవరు మాట్లాడటం లేదు. ఇక, ఉత్తరాంధ్రలో విష్ణుకుమార్ రాజు కూడా తీవ్ర అసంతృప్తి తో ఉన్న మాట వాస్తవమే. అయినప్పటికీ ఆయన పార్టీని వదిలి వెళ్లే టైపు నాయకుడు కాకపోవడం విశేషం. మొత్తంగా చూస్తే వైసిపి చేస్తున్న ఎమ్మెల్యేల ప్రచారం కేవలం రాజకీయం కోసమేనని స్పష్టమవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు.

# అమరావతికి మ్యారియట్ హోటల్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ప్రాజెక్ట్ ప్రారంభమైంది. అమరావతిలోని లింగయ్యపాలెం గ్రామంలో సుమారు రూ. 200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ‘కోర్ట్‌యార్డ్ బై మ్యారియట్’ హోటల్ ప్రాజెక్ట్‌కు ఘనంగా భూమిపూజ నిర్వహించారు. సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఆధ్వర్యంలో ఈ ఫోర్ స్టార్ డీలక్స్ హోటల్‌ను నిర్మించనున్నారు. సుమారు 2 ఎకరాల విస్తీర్ణంలో రెండు టవర్లుగా ఈ హోటల్‌ను నిర్మించనున్నారు. ప్రతి టవర్‌లో 10 అంతస్తులు ఉండనున్నాయి.మొత్తం 176 లగ్జరీ గదులు మరియు రెసిడెన్సీలు ఉంటాయి. స్విమ్మింగ్ పూల్, ఆధునిక జిమ్, బార్, మరియు ఆల్‌డే డైనింగ్ సౌకర్యాలు ఉండనున్నాయి. ఏకకాలంలో 2 వేల నుంచి 3 వేల మంది కూర్చునే సామర్థ్యంతో భారీ బ్యాంకెట్ హాల్‌ను కన్వెన్షన్లు మరియు ఈవెంట్స్ కోసం నిర్మిస్తున్నారు. మరో 6 నెలల్లో ఈ హోటల్ నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కానున్నాయి. రెండున్నరేళ్లలో నిర్మాణాన్ని పూర్తి చేసి, 2029 నాటికి హోటల్ కార్యకలాపాలను ప్రారంభించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సదరన్ గ్లోబ్ హోటల్స్ ప్రతినిధులు వెల్లడించారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సుమారు 600 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ప్రతినిధి కృష్ణమోహన్ ఆలపాటి మాట్లాడుతూ.. అమరావతి అభివృద్ధి వేగవంతం

# కుంకీ ఏనుగులకు ఆధార్‌లా

# ఓ గుర్తింపు కార్డు



తిరుపతి : ఏపీ ప్రభుత్వం గతేడాది కర్ణాటక నుంచి కుంకీ ఏనుగుల్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ ఏనుగులు ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని పలమనేరు కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చువరీలో ఉన్నాయి. అయితే ఈ ఏనుగులకు రెండు రోజుల క్రితం డీఎన్ఏ టెస్టులు నిర్వహించారు. బ్లడ్ శాంపిల్స్ సేకరించి డెహ్రాడూన్ పంపారు. ఆ టెస్ట్ రిజల్ట్స్ వచ్చిన తర్వాత ఏనుగులకు ఆధార్ కార్డులా ఓ గుర్తింపు కార్డును తగిలించనున్నారుసాధారణంగా మనుషులకు ఆధార్ కార్డులు ఉంటాయి.. ఎక్కడైనా ఏనుగులకు ఆధార్ కార్డులు ఉండటం చూశారా. ఏపీలో మాత్రం ఏనుగులకు ఆధార్ కార్డులు రాబోతున్నాయి.. అది కూడా ఆరు గజరాజులకు మాత్రమే. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్ని గమనించి అటవీశాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. చిత్తూరు జిల్లాలోని పలమనేరు కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చువరీలో కుంకీ ఏనుగులు ఉన్నాయి.. వీటికి అధికారులు డీఎన్ఏ పరీక్షలు చేయించారు. ఈ ఏనుగుల నుంచి రెండు రోజుల క్రితం రక్త నమూనాలను సేకరించి డెహ్రాడూన్ వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్‌కు పంపారు. ఏనుగుల సంరక్షణ, పరిరక్షణ, శాస్త్రీయ అధ్యయనాల నిమిత్తం అధికారులు ఈ డీఎన్ఏ పరీక్షలు చేయించి ఆధార్ కార్డులా ఉండేట్టు ఓ గుర్తింపు కార్డును ఏనుగుకు తగిలించనున్నారు. డెహ్రాడూన్ వైల్డ్‌లైఫ్ ఇనిస్టిట్యూట్ నుంచి టెస్టుల ఫలితాలు రాగానే ఆ వివరాలతో ఏనుగుకు ఒక గుర్తింపు కార్డును జారీ చేస్తారు. ఈ కుంకీ ఏనుగులకు ఇది ఆధార్ కార్డులా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఈ వివరాలతో రాబోయే రోజుల్లో ఏనుగులకు జన్యుపరమైన సమస్యలకు వైద్యంతో పాటు వాటి ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు అంటున్నారు. భవిష్యత్తు అవసరాలని గమనించి గజరాజులకు సంబంధించిన సమగ్ర వివరాల కోసం డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చిత్తూరు జిల్లా అటవీశాఖ అధికారులు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి అక్కడి నుంచి కుంకీ ఏనుగుల్ని రప్పించిన విషయం తెలిసిందే. అభిమన్యు, కృష్ణ, దేవ, జయంత్, రంజన్, వినయ్ అనే ఆరు కుంకీ గజరాజుల్ని తీసుకొచ్చి చిత్తూరు జిల్లా పలమనేరు క్యాంపులో ఉంచారు. ఈ కుంకీ ఏనుగుల దర్వారా అడవిలోని ఏనుగులు గ్రామాల మీదకు రాకుండా మళ్లించడానికి శిక్షణ ఇచ్చారు. రెండుసార్లు ఏనుగులు గ్రామాల మీదకు రాకుండా అటవీ ప్రాంతంవైపు మళ్లించే ప్రక్రియను విజయవంతం చేశారు.

## తుక్కుగూడ లో ఉన్న పిస్తా హౌస్ ను

# వెంటనే సీజ్ చేయాలి

- కస్టమర్ ప్రాణాలతో చెలగాటమాడుతున్న పిస్తా హౌస్
- తుక్కుగూడ పిస్తా హౌస్ బిర్యానీలో ఈగలు
- చేసిన తప్పు కప్పిపుచ్చుకుంటూ పిస్తా హౌస్‌లో కస్టమర్‌తో వాగ్వాదం
- తుక్కుగూడ ఉన్న ఓట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేయాలి
- నాణ్యత లోపించిన హోటల్ పై వెంటనే చర్యలు తీసుకోవాలి




**మహేశ్వరం, మే 11, (ప్రజా కలం)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధిలోని తుక్కుగూడలో ఉన్న పిస్తా హౌస్‌లో ఆహార నాణ్యతపై మరోసారి విమర్శలు వెల్లువెత్తాయి. తుక్కుగూడకు చెందిన అంగోత్ సందీప్ తన కుటుంబ సభ్యులతో కలిసి హోటల్‌కు వెళ్లి జఫ్రాని చికెన్ బిర్యానీ ఆర్డర్ చేశారు. బిర్యానీ తింటుండగా అందులో ఈగలు కనిపించడంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. దీనిపై హోటల్ సిబ్బందిని ప్రశ్నించగా, సమస్యను పరిష్కరించాల్సిందిపోయి కస్టమర్‌తో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. బిల్ తప్పనిసరిగా చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడి తెచ్చిందని బాధితుడు ఆరోపించాడు. ఈ ఘటనతో కొంతసేపు హోటల్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఇదే పిస్తా హౌస్‌లో గతంలో కూడా ఆహారంలో పురుగులు, బొద్దింకలు వచ్చిన ఘటనలు వెలుగులోకి వచ్చినప్పటికీ యాజమాన్యం తీరు మారడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు హోటల్‌పై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కస్టమర్ల ప్రాణాలతో పిస్తా హౌస్ చెలగాటమాడుతుందని గతంలో పలుమార్లు పిస్తా హౌస్ లో ఇలాగనే జరిగింది. అయినా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఫైన్ వేసి తూతూ మాత్రమే వదిలేశారు. వెంటనే పిస్తా హౌస్ సీజ్ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.





## తెలంగాణ జన సమితి ప్లీనరీ

# జయప్రదం చేయండి

### -తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షులు నీరుడి స్వామి

గజ్వేల్ :11 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ జన సమితి రాష్ట్ర 4 ప్లీనరీ హైదరాబాదులో జలవిహార్ లో జరుగుతుంది అని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు నీరుడు స్వామి మాట్లాడుతూ తెలంగాణ జన సమితి పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీరుడి స్వామి పిలుపునిచ్చారు గజ్వేల్ మండల కేంద్రాలలో విచ్చేసి విలేకరులతో మాట్లాడుతూ ఆయన మాటల్లో ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమ ఆంక్షలు కొత్త అభివృద్ధి నమూనాను రూపొందించి ఆర్థిక నాశనం చేసింది కేసీఆర్ రాజకీయ సామాజిక సమన్యాయం దిశగా ముందుకు సాగకపోగా సీమాంధ్ర పాలన విధానాన్ని కొనసాగిస్తూ కాంట్రాక్టులు కమిషన్ల నోట్లు ఓట్లు సీట్లు కేంద్రంగా పాలన సాగింది రాష్ట్ర రాజకీయా లను డబ్బు అధికారం డబ్బు అధికారం చుట్టూ తిరిగేలా మార్చారు ప్రభుత్వాన్ని. వ్యక్తిగత ఆస్థిల భావించి




నిరంకుశంగా పాలన కొనసాగించారు ప్రశ్నించే గొంతులను అనుచివేసి అహంకారం క్రితంగా వ్యవహరించారు రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీశారు. ఉమ్మడి రాష్ట్రంలో అంకరించిన అశ్రుత పెట్టుబడి క్రోనీ క్యాపిటల్ ఇజం వ్యవస్థను బలోపేతం చేశార తెలంగాణ రాష్ట్రంలో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య వ్యవస్థ కాపాడడం కోసం తెలంగాణ ఉద్యమ సారథి ఆచార్య కోదండరాం నేతృత్వంలో 2018 ఏప్రిల్ 29 తెలంగాణ జన సమితి పార్టీ స్థాపించినట్టు తెలిపారు తెలంగాణ ఉద్యమ ఆంక్షలు సాధన ఆర్థిక రాజకీయ సామాజిక సమన్నత్వం ప్రజాస్వామ్య పరిరక్షణ ఎన్నికల సంస్కరణ శృతి చర్యలు నిర్వహిస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇచ్చిన పిలుపు నన్నుసరించి చదువు బోధించు సమీకరించు పోరాడు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితో ప్రజలను సంఘటితం చేస్తూ ముందుకు సాగుతుందని అన్నారు ఈ నేపథ్యంలో ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి పార్టీ కార్య చర్యలను మరింత చేయాల్సిన అవసరం ఉన్నది ఈ ప్రయాణంలో భాగంగా గతాన్ని సమీక్షించి భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకునేందుకు నేడు హైదరాబాద్ నక్లెస్ రోడ్డు జలవివారిలో నిర్వహించునున్న తెలంగాణ జన సమితి నాలుగవ రాష్ట్ర ప్లీనరీ విజయవంతం చేయవలసిందిగా సామాజిక ప్రజాస్వామిక లౌకిక తెలంగాణ సాధనకు ఉద్యమిద్యం. రండి కదలి రండి అని తెలంగాణ జన సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నీరుడి స్వామి పిలుపునిచ్చారు

## ఇది ప్రయాణికుల ఆర్టీసీ బస్టాండా లేక

# కూరగాయల మార్కెటా ?

- సోమవారం వచ్చిందంటే తుక్కుగూడలో ప్రయాణికులకు నరకయాతన
- వాహనదారులకు చలానా వేయడానికి ట్రాఫిక్ పోలీసులు గుంపులుగా ఉంటారు
- అదే ట్రాఫిక్ క్లియర్ చేయడానికి ఒక్క పోలీస్ కూడా కనిపించాడు ఇక్కడ
- మహేశ్వరం గేటు మొదలు పెట్టుకుంటే అయ్యప్ప గుడి వద్ద వరకు వసూళ్లు చేయడమే లక్ష్యం
- ఆకు కూరగాయలు అమ్మే వారి నుండి వంద రూపాయలు వసూలు
- రోడ్డుమీద ఎక్కడ ఏ విధంగా పెట్టిన కచ్చితంగా వసూలు చేయడం
- మామూలుగా శ్రీశైలం హైవే ప్రతిరోజు ట్రాఫిక్ తో వానదారులు ఇబ్బంది పడుతూ ఉంటారు
- సోమవారం సంత రోజు ట్రాఫిక్ భరించలేక వాహనదారుల ఇబ్బందులు
- ప్రతి సోమవారం వాహనదారులకు ఇబ్బందులుగా భారీగా ట్రాఫిక్ జామ్
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు జిహెచ్ఎంసి అధికారులు







**మహేశ్వరం, మే 11,(ప్రజా కలం)**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి పేరుకు మాత్రం తుక్కుగూడ పెద్దిది రోజురోజుకు పెరుగుతున్న సమస్యలను మాత్రం ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు తుక్కుగూడలో ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు స్థానిక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం అంగడి బజార్ వచ్చిన రోజు వాహనదారులకు స్థానిక ప్రజలకు నరకయాతన కనపడుతుంది. ట్రాఫిక్ తో ప్రజలు వాహనదారులు ఇబ్బంది పడుతున్న ట్రాఫిక్ పోలీసులు గాని జిహెచ్ఎంసి అధికారులు కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు తై బజారు వేలంపాటలో కోట్లు పెట్టి వేలంపాట పాడి ప్రతి సోమవారం మహేశ్వరం గేటు మొదలు పెడితే అయ్యప్ప గుడి వరకు ఎవరు ఎక్కడైనా సరే రోడ్డుమీద ఇరుపక్కల చిరు వ్యాపారస్తులు పెట్టుకొని 50 రూపాయల నుండి 100, 200,300 వరకు చెల్లిస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మరొక విచిత్రం ఏమిటంటే ఏకంగా ఆర్టిసి బస్టాండ్ ని ఆక్రమించి సంత నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు ఆక్రమించి సంత నిర్వహిస్తే ప్రయాణికులు బస్సు ఎక్కడ ఎక్కాలి బస్సులు ఎక్కడ ఆపాలి ఆ మాత్రం కూడా అధికారులకు తెలియదా ట్రాఫిక్ పోలీసులు జిహెచ్ఎంసి అధికారులు నిద్రపోతున్నారా...తై బజార్లో వేలం పాట పాడిన వారు బస్టాండ్ రోడ్డు ఏది వారికి అవసరం లేదు ఎక్కడ పెట్టుకున్నా వసూలు చేయడమే వారి లక్ష్యం ప్రతి సోమవారం సంతలో ట్రాఫిక్ తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు ట్రాఫిక్ పోలీసులకు తెలిసిన పట్టించుకోకపోవడం నిజంగా అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం పోలీసుల ప్రతిరోజు తుక్కుగూడ నుండి మహేశ్వరం గేట్ వరకు వాహనదారులకు చలానా వేయడానికి ట్రాఫిక్ పోలీసులు గుంపులు గుంపులుగా కనిపిస్తారు. కానీ తుక్కుగూడలో ఇంత ట్రాఫిక్ జరుగుతున్న ఒక ట్రాఫిక్ పోలీసు కనిపించరు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ లు క్లియర్ చేయరు. వాహనదారులు స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డ వారికి అవసరం లేదేమో వారికి కావాల్సింది ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తే ఫోటో కొట్టి వాహనదారులకు చలానా వేయడమే వారి లక్ష్యం ట్రాఫిక్ పోలీసులకు పై అధికారులు ఇచ్చిన టార్గెట్ కంప్లీట్ కావాలి కనుక వారికి కూడా ఒక విధంగా కలిసి వస్తుంది ఎక్కడ పడితే అక్కడ వెహికల్ పార్కు చేస్తే ట్రాఫిక్ పోలీసులు ఫోటో కొట్టి ఫైన్ వేస్తారు. ఇది వారి యొక్క డ్యూటీ ఇక్కడ నష్టపోయేది వాహనదారుడు ఇబ్బందులు పడేది వాహనదారు ట్రాఫిక్ లో నరకయాతన పడేది వాహనదారుడు పూర్తిస్థాయిలో లాభపడేది ట్రాఫిక్ పోలీసులు జిహెచ్ఎంసి అధికారులు స్థానిక ప్రజలు వాహనదారులు మాత్రం అధికారుల నిర్లక్ష్యం అని స్థానిక ప్రజల ఆరోపిస్తున్నారు. జిహెచ్ఎంసి అధికారుల మొద్దు నిద్ర కారణంగా ప్రజలు వాహన దారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు తక్షణమే అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కారం చేయాలని కోరుతున్నారు. శ్రీశైలం జాతీయ రహదారి వాహనాలతో రద్దీగా ఉంటుంది రహదారిపై సంత రోజు ఏ ఒక్కరు కూడా రోడ్డు మీద ఎలాంటి చిరు వ్యాపారాలు లేకుండా చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.











# టీఆర్ఎస్ జెండా పండుగ, నెల రోజుల వేడుకలు

## గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు జెండా ఎగరలేయాలి- కల్వకుంట్ల కవిత



హైదరాబాద్: మే 11:ప్రజా కలం ప్రతినిధి

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ భావజాలాన్ని పల్లెపల్లెకూ తీసుకెళ్లే లక్ష్యంతో ఈ నెల 20 నుంచి జూన్ 20 వరకు నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జెండా పండుగ నిర్వహించాలని పార్టీ శ్రేణులకు అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాల నుంచి మొదలుకొని మండల, గ్రామ స్థాయి వరకు ప్రతి వార్డులో పార్టీ జెండాలను ఆవిష్కరించాలని ఆమె ఆదేశించారు.పార్టీ ప్రకటించిన పాంచజన్య సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.ఇక ?రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ మళ్లీ వంచనకు గురవుతోందని, వలస పాలన నాటి దుష్పరిణామాలను మళ్లీ ఎదుర్కొంటున్నామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని ఆశించిన ప్రతి వర్గం నేడు తీవ్ర నిరాశలో ఉందని, స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమించినట్లే, ఇప్పుడు తెలంగాణ పునర్నిర్మాణం కోసం మళ్లీ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఆమె పేర్కొన్నారు. సబ్బండ వర్గాల వికాసం కోసం తెలంగాణ రక్షణ సేన బాధ్యత తీసుకుంటుందని స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావానికి ముందే భారీ సంఖ్యలో చేరిన నాయకత్వంతో పాటు,తెలంగాణ జాగృతి శ్రేణులు సమన్వయంతో పనిచేసి జెండా పండుగను విజయవంతం చేయాలని కవిత పిలుపునిచ్చారు. ప్రతి వాడలో జెండా ఎగురవేయడంతో పాటు ప్రతి గడపకూ పార్టీ సిద్ధాంతాలను వివరించి, రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలను భాగస్వాములను చేయాలని ఆమె కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# బీసీ హాస్టళ్లు బేష్

అమరావతి : కూటమి ప్రభుత్వం రాకతో బీసీ బిడ్డల విద్యకు ఆసరాగా నిలిచే హాస్టళ్లు మెరుగైన పనితీరుతో ముందంజలో నిలుస్తున్నాయి. మౌలిక సదుపాయల కల్పన, ఆరోగ్యకరమైన మెనూ, బోధనలతో రాష్ట్ర స్థాయిలో బీసీ హాస్టళ్లు అగ్రగామిగా నిలిచాయి. పరిశుభ్రమైన వాతావరణం, పరిశుద్ధమైన తాగునీటి కల్పన, ఆరోగ్యభద్రతతో కూడిన విద్యను అందించడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల మనస్సును బీసీ హాస్టళ్లు గెలుచుకున్నాయి. హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వ ఐవీఆర్ సర్వేలో మిగిలిన సంక్షేమ హాస్టళ్లకంటే బీసీ సంక్షేమ హాస్టళ్లు 78.02 శాతం సంతృప్త స్థాయిలతో ప్రథమ స్థానంలో నిలిచి ఔరా అనిపించుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 1110 బీసీ బాలురు, బాలికల హాస్టళ్లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో బీసీ సంక్షేమ హాస్టళ్లు పూర్తిగా నిరాదరణకు గురయ్యాయి. నిధులు విడుదల చేయకపోవడంతో మరమ్మతులు సైతం నోచుకోలేకపో యాయి. కనీసం డైట్ బిల్లు కూడా చెల్లించకపోవడంతో బీసీ బిడ్డలు అర్ధాకలితో నరకం చూశారు. కాస్మోటిక్ ఛార్జీలు సైతం చెల్లించిన పాపానపోలేదు. దినదిన గండంగా ఆ అయిదేళ్లు బీసీ హాస్టళ్లలో చదివే విద్యార్థులు కాలం నెట్టుకొచ్చారు. కూటమి ప్రభుత్వం రాకతో ఇతర సంక్షేమ హాస్టళ్లతో పాటు బీసీ సంక్షేమ హాస్టళ్లకు మంచిరోజులు ప్రారంభమయ్యాయి. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబా బునాయుడు బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా బీసీ బిడ్డల ఆకలి తీర్చేలా రూ.110 కోట్ల మేర డైట్ బకాయిలను చెల్లించారు.

నాటి నుంచి ఎప్పటికప్పుడు డైట్ బిల్లులు చెల్లిస్తూ వస్తున్నారు. కాస్మోటిక్ ఛార్జీలను సైతం విద్యార్థులకు సకాలంలో చెల్లిస్తున్నారు. 23 నెలల కాలంలో బీసీ హాస్టళ్ల మరమ్మతులు, ఇతర నిర్మాణాల కోసం రూ.100 కోట్లు వెచ్చించారు. రూ.2 కోట్లతో 104 హాస్టళ్లలో విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ అందజేయడానికి ఎస్.ఆర్. శంకరన్ రిసోర్స్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో బీసీ బిడ్డలు 85.99 శాతం ఉత్తీర్ణత సాధించారు.

# క్రీడాకారులు క్రీడల పట్ల ఆసక్తి చూపించాలి

## గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేసిన కాటేదన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్




రాజేంద్రనగర్ మే 11,(ప్రజా కలం)

తెలంగాణ స్టేట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ 2026 జరుగుతున్న కాటేదన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లోని జరుగుతున్న కారుక్రమానికి ఆర్గనైజ్ బై రంగారెడ్డి డిస్టిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఈనెల 9 అండ్ 10 మే 2026 ఇండోర్ స్టేడియం కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో కాటేదన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ ని ఆహ్వానించి వారిని శాలువలతో ఘనంగా సత్కరించారు. రంగారెడ్డి డిస్ట్రిక్ట్ తెలంగాణ దాదాపుగా 1000 మంది కిక్ బాక్సింగ్ స్పోర్ట్స్ ప్లేయర్ పాలు పంచుకోవడం జరిగింది దీన్ని దిగ్విజయంగా జరగాడానికి ముఖ్యంగా ఎం మైపాల్ మాస్టర్ జనరల్ సెక్రెటరీ అఫ్ తెలంగాణ ఎం నర్సింగరావు జనరల్ సెక్రెటరీ ఆఫ్ రంగారెడ్డి డిస్ట్రిక్ట్ వీలు ఆధ్వర్యంలో జరిగింది. గెలిచిన క్రీడాకారులు నేషనల్ 2026 కి ఎంపిక అయ్యారు ఇలాంటి కార్యక్రమాలు మన స్టేట్ లో మరియు ముఖ్యంగా మన రంగారెడ్డి లో మరిఎన్నో జరగాలని కోరుకుంటున్నా ముఖ్య అతిథిగా కాటేదన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ పాల్గొని గెలుపొందిన కిక్ బాక్సర్లకు వెంకటేష్ చేతులమీదుగా మెడల్స్ తో పాటు మేమంటోలు , బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాటేదన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ గారితో పాటు సనమ్ రాజు గౌడ్ , ఆర్.కుమార్ , పోతురాజు రమేష్ , గురుస్వామి , అశోక్ కుమార్ , సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై హత్యాచారం చేసిన సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

## బేటీ బచావో కాదు... బేటా బచావోగా మారింది బీజేపీ నినాదం

## బండి సంజయ్‌ను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలి -- బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు కొరిపెల్లి నిర్మల డిమాండ్

మేడిపల్లి మే 11(ప్రజాకలం న్యూస్)

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ బీఆర్ఎన్ పార్టీ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు.

బేటీ బచావో" అంటూ దేశవ్యాప్తంగా నినాదాలు ఇచ్చే బీజేపీ,ఇప్పుడు బేటా బచావో విధానాన్ని అమలు చేస్తోందని బిఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మైనర్ బాలికపై అత్యాచారం కేసులో పోక్సో చట్టం కింద కేసు నమోదైనప్పటికీ,నిందితుడు సాయి భగీరథ్‌ను ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం రాష్ట్ర ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైందన్నారు.చట్టం అందరికీ సమానమైతే అధికార పార్టీల నేతల కుటుంబాలకు మాత్రం ఎందుకు మినహాయింపు ఇస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.

ం బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని,న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని అన్నారు. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్ మాట్లాడుతూ... బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు గంటల తరబడి స్వీకరించకపోవడం, ఫిర్యాదును మార్చమని ఒత్తిడి తేవడం, కేసు వెనుక పెద్దలు ఉన్నారని చెప్పడం వంటి ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. న్యాయం కోసం బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్ ముందు వేడుకోవాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి సభలో ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించిన తర్వాతే ఫిర్యాదు స్వీకరించడం దురదృష్టకరమన్నారు.పోక్సో చట్టం ప్రకారం మైనర్ బాలిక సమ్మతి చెల్లదని, అయినప్పటికీ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోకుండా బాధితురాలిపైనే కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. బాధిత కుటుంబాన్ని బెదిరించే ప్రయత్నాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... ఈ కేసును మీడియా దృష్టికి రాకుండా దాచిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. “హనీ ట్రాప్” పేరుతో అసలు అంశాన్ని మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, మహిళల భద్రతపై మాట్లాడే నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయ ప్రయోజనాల కోసం కేసును బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో పెరుగుతున్నాయన్నారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, నాయకులు ఆకుల మధుకర్, కందుకూరి ఆంజనేయులు, గడీల జగన్ రెడ్డి, శ్యామల శ్రీనివాస్, పాశం నరేందర్ రెడ్డి, పుల్ల శ్రీనివాస్, బుల్లెట్ శంకర్, నర్సిరెడ్డి, కళ్యాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా నిలిచిన ఎస్ఎన్‌డీపీ నాలా పనులకు శ్రీకారం చుట్టిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, మే 11,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి జిల్లాలగూడ డివిజన్



పరిధిలోని మిథుల నగర్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్ఎన్‌డీపీ నాలా పనులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలా పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అక్కల భూపాల్ రెడ్డి, డిప్లాల్ చౌహాన్, అరకల కామేష్ రెడ్డి, మదారి రమేష్, అనిల్ కుమార్ యాదవ్, విజయ్, దిండు భూపేష్ గౌడ్, లక్ష్మణ్ ముదిరాజ్, గోపి యాదవ్, సునీత బాలరాజ్, సుర్వి లత, పంతంగి మాధవి, బిందు, నిర్మల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా చిట్యాల శ్వేత

## హర్షం వ్యక్తం చేసిన ప్రజ్ఞాపూర్ రజక సంఘం అధ్యక్షులు మెతుకు నర్సింలు

గజ్వేల్ :11 మే ప్రజా కలం ప్రతినిధి)

వీరనారి చాకలి ఐలమ్మ మనుమరాలు చిట్యాల శ్వేతను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా ప్రభుత్వం నియమించడం పట్ల ప్రజ్ఞాపూర్ రజక సంఘం అధ్యక్షులు ( టెంట్) మెతుకు నర్సింలు హర్షం వ్యక్తం చేశారు, సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ రజక సంఘం అధ్యక్షుడు మెతుకు నర్సింలు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ వారసురాలిగా సామాజిక స్పృహ కలిగిన చిట్యాల శ్వేతకు పదవి దక్కడం రజక సామాజిక వర్గానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని మహిళల హక్కుల పరిరక్షణలోనూ వారి సమస్యల పరిష్కారంలోనూ వారు చురుకైన పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు



# తణుకులో కిలాడే లేడీ

ఏలూరు : పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి వంచిస్తున్న ఘటనలు అనేకం వెలుగుచూస్తున్నాయి. ఆ కోవలోనే తాజాగా బంగారం కూడా చేరింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలో వెలుగుచూసిన ఒక భారీ ఆర్థిక మోసం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. అధిక వడ్డీ ఆశ చూపి, తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామంటూ ఒక కిలాడీ జంట అమాయక ప్రజలను, ముఖ్యంగా మహిళలను నమ్మించి కోట్లాది రూపాయల మేర టోకరా వేసింది. సుమారు 25 కోట్ల రూపాయల మేర సాగిన ఈ భారీ కుంభకోణంలో బాధితులు ఇంకా ఉన్నారనే ప్రచారం జరుగుతుంది. బాధితుల కథనం ప్రకారం.. తణుకు పట్టణానికి చెందిన స్నేహలత, దుర్గాప్రసాద్ అనే దంపతులు లక్ష రూపాయలకు నెలకు 10 వేల నుండి ఏకంగా 30 వేల రూపాయల వరకు వడ్డీ ఇస్తామని నమ్మబలికారు. కేవలం వడ్డీ మాత్రమే కాకుండా బయట మార్కెట్ ధరతో సంబంధం లేకుండా కేవలం 12 వేల రూపాయలకే గ్రాము బంగారం ఇప్పిస్తామంటూ ఆశ చూపారు. వీరి మాటలు నమ్మిన పలువురు మహిళలు తమ వద్ద ఉన్న నగదుతో పాటు బంధువులు, స్నేహితుల వద్ద నుంచి కూడా అప్పులు తెచ్చి మరీ ఈ జంటకు అప్పగించారు.

మొదట్లో నమ్మకం కలిగించడం కోసం కొందరికి వడ్డీలు చెల్లించి, ఆపై చేతులు ఎత్తేయటంతో ఇపుడు వారి చేతిలో మోస పాయిన బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బాధితుల్లో ఒకరైన ఉషారమ్య తాను 25 లక్షల నగదు, 30 కాసుల బంగారాన్ని సదరు జంటకు ఇచ్చినట్లు మీడియా సమావేశంలో వెల్లడించారు. అంతేకాకుండా ఆమె ద్వారా ఆమె కుటుంబ సభ్యులు, పరిచయస్తుల నుండి మరో 40 లక్షల నగదు, 60 కాసుల బంగారాన్ని కూడావారికి ఇచ్చినట్లు చెబుతున్నారు. మరో బాధితురాలు శైలజ సైతం తనకు జరిగిన అన్యాయాన్ని మీడియా ముందు ఏకరువు పెట్టారు. ఆమె నుంచి 36 కాసుల బంగారం, 44 లక్షల రూపాయల నగదును ఈ జంట కాజేసినట్లు వివరించారు. నగదు బదిలీకి సంబంధించిన వీడియోలు, ఇతర పక్కా ఆధారాలు తమ వద్ద ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వమని ఒత్తిడి చేసిన బాధితులను ఈ కిలాడీ జంట రకరకాలుగా భయాందోళనలకు గురిచేసినట్లు తెలుస్తోంది.

## మాజీ సీఎం స్టాలిన్‌తో

# సీఎం విజయ్ భేటీ..

## తమిళనాడులో కీలక రాజకీయ పరిణామం

చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం నాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే (ఐవీఖ) అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్‌ను ఆళ్వార్‌పేటలోని ఆయన నివాసంలో కలిశారు. ఎన్నికల్లో విజయం సాధించి, ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ స్టాలిన్‌ను కలవడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనను ఒక మర్యాదపూర్వక భేటీగా అభివర్ణిస్తున్నారు. స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్, ముఖ్యమంత్రి విజయ్‌కు ఘన స్వాగతం పలికారు.

ముఖ్యమంత్రి రాగానే, ఉదయనిధి మొదట విజయ్‌కు కరచాలనం చేస్తూ, ఆప్యాయంగా కౌగిలించుకుంటూ స్వాగతం పలికారు. ఆ తర్వాత, స్టాలిన్ కూడా విజయ్‌ను కౌగిలించుకున్నారు. విజయ్, స్టాలిన్‌లు ఒకరినొకరు పట్టు శాలువాలు, పూలగుచ్ఛాలతో సత్కరించుకున్నారు. ఏప్రిల్ 23 ఎన్నికలకు ముందు ఐవీఖ, విజయ్ నేతృత్వంలోని ఎఖ మధ్య జరిగిన తీవ్రమైన ఎన్నికల పోరు ఇందులో విజయం సాధించిన అనంతరం ఈ సమావేశం జరిగింది. తమిళనాడులో జరిగిన 2026 అసెంబ్లీ ఎన్నికల్లో 107 స్థానాల్లో విజయం సాధించి అతిపెద్ద పార్టీగా విజయ్ టీవీకే పార్టీ రికార్డు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజే డీఎంకే, ఎండీఎంకే నేతలతో సమావేశమైన సీఎం విజయ్, సోమవారం మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిశారు.

సీఎం విజయ్.. ప్రతిపక్ష నేతగా ఉదయనిధి స్టాలిన్ ప్రమాణ స్వీకారం

ముఖ్యమంత్రి విజయ్, మరో తొమ్మిది మంది మంత్రులు, ఎడప్పాడి కె. పళనిస్వామి సహా మాజీ



ముఖ్యమంత్రులు, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు సోమవారం నాడు తమిళనాడు శాసనసభలో ప్రమాణ స్వీకారం చేశారని అధికారులు తెలిపారు. తాత్కాలిక సభాపతి ఎం. వి. కరుప్పయ్య వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్రంలో సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కజగం' (TVK) ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో, సభ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కొత్తగా ఏర్పాటైన తమిళనాడు శాసనసభలో మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సోమవారం ప్రతిపక్ష నాయకుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ వరుస భేటీలు తమిళనాడు రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మోదీపై పోలీసులకు ఫిర్యాదు

## బీసీ కులగణనపై స్పష్టత ఇవ్వాలని వీహెచ్ డిమాండ్



**హైదరాబాద్, మే 11 (ప్రజాకలం) :** ప్రధాని నరేందర్ మోదీ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ తెలంగాణ రాష్ట్ర బీసీ సలహాదారు వి. హనుమంతరావు (వీహెచ్) అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీని "ముస్లిం, మావోయిస్టు పార్టీ"గా పేర్కొనడం సామాజిక విభేదాలను రెచ్చగొట్టేలా ఉందని ఆయన ఆరోపిం చారు.


అంబర్‌పేట్ ఎస్‌హెచ్‌వో కిరణ్ కుమార్‌ను కలిసి ఫిర్యాదు లేఖ అందజేసిన వీహెచ్, ప్రధాని చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. దేశంలో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ, ముస్లింలు దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని, వారిని అవమానించే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. ప్రధాని భాష దేశ నాయకుడికి తగిన విధంగా లేదని విమర్శించారు. ఆరెస్సెస్ చెప్పిన విధంగానే మోదీ వ్యవహరిస్తున్నా రని ఆరోపించారు.

బీసీ కులగణనపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవా లని డిమాండ్ చేసిన వీహెచ్, ఓబీసీ కాలమ్ లేకుండా జరిగే జనగణ నలో బీసీలు పాల్గొనొద్దని పిలుపుని చ్చారు.

బీసీలకు న్యాయం చేయాలంటే కులగణన తప్పనిసరి అని అన్నారు. 60 కోట్ల బీసీల పట్ల ప్రధాని చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శిం చారు.

అలాగే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జోక్యం




చేసుకొని బీసీ కులగణన అంశంపై ప్రధాని మోదీతో మాట్లాడాలని సూచించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి ఎలా వస్తుందో చూస్తా మని వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, గొర్నాక కాంటెస్టెడ్ కార్పొరేటర్ పోలినేని రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# పంచాయితీ ఎన్నికలకు అంతా సిద్ధం

విజయవాడ : స్థానిక సంస్థల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఇదే విషయాన్ని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీలతోపాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, నగరపాలక




సంస్థలకు సంబంధించిన పదవీకాలం ముగిసింది. ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఆరు నెలల్లోపు స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్వహించాలన్నది ఒక నిబంధన. ఇప్పుడు సీఎం చంద్రబాబు తాజా ప్రకటనతో ప్రభుత్వం వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తున్నట్లు అర్థం అవుతోంది. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు వస్తేనే ఆర్థిక సంఘం నిధులు విడుదల అయ్యే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వం వాటి ఎన్నికల నిర్వహణపై ప్రత్యేకంగా ఫోకస్ చేసినట్లు అర్థమవు తోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకు పైగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వాటికి సంబంధించి సర్పం చుల పదవీకాలం ఏప్రిల్ 2 తో ముగిసింది. దీంతో సర్పం చులు మాజీలు అయ్యారు. వారి స్థానంలో పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది ప్రభుత్వం. అయితే పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్ పడే అవకాశం ఉంది. ఇప్పటికే 16వ ఆర్థిక సంఘం సమయం ప్రారంభం అయింది.

# చిన్న పత్రికల సమస్యల పరిష్కారానికి కృషి

### - అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం - సీఏ సర్టిఫికెట్ సమస్య పరిష్కారానికి కృషి

### -మంత్రి, కమిషనర్ లతో పాటు మీడియా అకాడమీ చైర్మన్ దృష్టికి మీ సమస్యలు తీసుకెళ్లాం : విరాహత్ అలీ





**హైదరాబాద్, మే 11 (ప్రజాకలం) :** చిన్న, మధ్య తరహా పత్రికలు, మ్యాగజైన్స్ ఎడిటర్ల సంక్షేమం కోసం తమ యూనియన్ తల్లిలా అండగా ఉంటుందని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ పేర్కొన్నారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీలకు చిన్న, మధ్య తరహా పత్రికల నుంచి సభ్యులుగా నియమితులైన వారిని తెలంగాణ స్మాల్ మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు యూసుఫ్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విరాహత్ అలీ మాట్లాడుతూ.. చిన్న పత్రికల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని చెప్పారు.

చిన్న మధ్య తరహా ప్రతికల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ ముకుంద్ రెడ్డిలతో పాటు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఆయన వివరించారు. అక్రిడిటేషన్ల జారీలో ఇబ్బందిగా మారిన సీఏ సర్టిఫికెట్ నిబంధనపై సమాచార శాఖ కమిషనర్‌తో చర్చించామని, త్వరలోనే ఈ సమస్య తొలిగిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్స్, ప్రతినెలా జారీ చేసే ప్రకటనల విషయంలో సమాచార శాఖ మంత్రి, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేద్దామని విరాహత్ అలీ అన్నారు. కమిటీ సభ్యులుగా ఎంపికైన వారు క్షేత్రస్థాయిలో పోరాడి అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు వచ్చేలా చూడాలని సూచించారు. పత్రికల ప్రకటనల పెండింగ్ బిల్లులు త్వరగా విడుదలయ్యేలా ప్రయత్నిస్తున్నామని, ఐకమత్యంతోనే హక్కులను సాధించుకోగలమని పిలుపునిచ్చారు. అనంతరం అక్రెడిటేషన్ కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు.

**యూనియన్ లో చేరిన అగస్టిన్:** ఈ కార్యక్రమంలో 'వుదయం' దినపత్రిక ఎడిటర్ అగస్టిన్ తిరిగి యూనియన్‌లో చేరగా, ఆయనను విరాహత్ అలీ సాదరంగా ఆహ్వానించి సభ్యత్వాన్ని ఇచ్చారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అశోక్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల సమన్వయకర్త బాలరాజు నేతృత్వంలో జరిగిన ఈ సన్మాన సభలో టియుడబ్ల్యుజె రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైజల్, మధు గౌడ్, హెచ్‌యూజే అధ్యక్షుడు శంకర్, చిన్న పత్రికల సంఘం కోశాధికారి ఆజంఖాన్, రాజిరెడ్డి, దయానంద్, అల్వాల్ హన్మంతు, ఎస్ ఎస్ కె హుస్సేన్, మాతంగి దాస్, దైవాదీనం, బాలకృష్ణ,గోళ్ల రమేష్,ఆమన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.





Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by KALAKONDA RAMAKRISHNA, Printed at TEJOMAI PUBLICATION, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com